శుక్రవారం
18•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 203
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

అద్భుత పాలనతో అసాధారణ విజయం

- సీఎం కేసీఆర్‌పై సింగపూర్ ప్రభుత్వం ప్రశంసలు
- రెండోసారి విజయం సాధించడంపై శుభాకాంక్షలు
- కలిసి పనిచేసేందుకు మరింత ఆసక్తితో ఉన్నాం
- లేఖ రాసిన సింగపూర్ వాణిజ్య వ్యవహారాల ఇంచార్జి మంత్రి ఈశ్వరన్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుపై సింగపూర్ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. రెండోసారి ఘనవిజయం సాధించడం గొప్ప విషయమని, అందుకు శుభాకాంక్షలు తెలిపింది. నాలుగున్నరేండ్ల పాలనలో అద్భుతాలు సృష్టించారని, అందుకే అసాధారణ విజయం సొంతం చేసుకున్నారని అభిప్రాయపడింది. సింగపూర్, తెలంగాణ మధ్య ఆర్థికసంబంధాలను మరింత పటిష్ఠం చేసేందుకు, అందుకు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు మరింత ఆసక్తితో ఉన్నట్టు పేర్కొన్నది. ఈ మేరకు సింగపూర్ వాణిజ్య వ్యవహారాల ఇంచార్జి మంత్రి ఎస్ ఈశ్వరన్ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఆ లేఖ గురువారం అందింది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించడంపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. 'మీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం 17.17 శాతంతో అత్యధిక వార్షిక రెవెన్యూ వృద్ధిని నమోదు చేసింది. తెలంగాణలో ఉన్న పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని సింగపూర్ కంపెనీలు గుర్తించాయి. అందుకే మీ హయాంలో డీబీఎస్ (డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్) సింగపూర్ హెడ్‌క్వార్టర్స్ ఆవల అతిపెద్ద టెక్నాలజీ హబ్‌ను హైదరాబాద్‌లో నిర్మించి, తెలంగాణ రాష్ట్రానికి విస్తరించింది.' అని లేఖలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సింగపూర్, తెలంగాణ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలపడుతాయని తనకు పూర్తి విశ్వాసం ఉన్నదని, భవిష్యత్‌లో మరిన్ని సింగపూర్ కంపెనీలు తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్‌తో కలిసి పని చేస్తామన్నారు. రెండోసారి సీఎంగా పదవి స్వీకరించిన కేసీఆర్ రాష్ట్రాభివృద్ధిని ఇలాగే కొనసాగించాలని, మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కవరింగ్ లెటర్‌లో చెన్నైలోని సింగపూర్ కాన్సులేట్ జనరల్ రాయ్ ఖో సైతం సీఎం కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారు. ఘనవిజయం సాధించడంపై కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, తెలంగాణ ప్రభుత్వంతో మరింత సత్సంబంధాన్ని ఏర్పరుచుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

పేరిణి నృత్యానికి సాంస్కృతిక శోభ

- నృత్యరీతులపై ఆకట్టుకున్న పరిశోధనా పత్రాలు

నిట్‌క్యాంపస్ (వరంగల్ అర్బన్): నటరాజ రామకృష్ణ నృత్యరీతులు సమకూర్చిన పేరిణికి తెలంగాణ సంప్రదాయ ప్రత్యేక అభినయ నృత్యరీతులను జతచేసి పేరిణి నృత్యాన్ని అందరూ అభినయించేలా రూపుదిద్దుతున్నామని ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ కళాకృష్ణ తెలిపారు. హన్మకొండలో 'నృత్త రత్నావళి' పై శాస్త్ర ప్రయోగ' అనే అంశంపై జరిగిన సదస్సులో రెండోరోజు నాట్యశాస్త్ర ప్రముఖులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా గురువారం ప్రత్యేకించి ప్రొఫెసర్ చూడామణి నందగోపాల్, ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ హెడ్ డాక్టర్ అద్వైతవాదిని కౌల్, ప్రముఖ నాట్యాచారులు డాక్టర్ కళాకృష్ణ నృత్యరీతుల్లో దాగి ఉన్న అర్థాలను, వాటి సారాన్ని ఆవిష్కరించారు. వీరితోపాటు డాక్టర్ అరుణాభిక్షు, డాక్టర్ సంప్రీతి, డీఎల్ తేజస్విత, డాక్టర్ యశోదాఠాకూర్ నృత్త రత్నావళిలోని పలు నృత్యరీతులపై అభినయ భావాలను వివరించారు. రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో పేరిణి కోర్సుగా ఉందని, రానున్న రోజుల్లో కూచిపూడి, భరతనాట్యంలా పేరిణి నృత్యం తెలంగాణలో ప్రత్యేకమైన గుర్తింపు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు, ఆర్కియాలజీ విభాగం నుంచి రంగాచారి, కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పేరిణికి ప్రత్యేక నృత్యరీతులు



మగవారు ప్రదర్శించే పేరిణికి సరికొత్త నృత్యరీతులను సమకూర్చి అమ్మాయిలు ప్రదర్శించేలా, మన సంస్కృతికి దగ్గరగా ఉండేలా రూపుదిద్దుతున్నాం. ప్రభుత్వం, తెలంగాణ సాంస్కృతికశాఖ ప్రోత్సాహంతో పేరిణి నృత్యాన్ని ప్రత్యేకంగా మలిచేందుకు కృషిచేస్తున్నాం. ఛావల, సిరిబిరం, కళుహుళం, అలఘ్నుపాతం, పాటవం భంగిమలను అంగికాభినయం నేపథ్యంతో సరికొత్త నృత్యరీతులతో పేరిణికి మరింత గుర్తింపు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం. సోలోగా, బృందంగా అభినయించే విధంగా రూపొందిస్తున్నాం.

–డాక్టర్ కళాకృష్ణ, ప్రముఖ నాట్యాచారుడు

లాస్యం నృత్యానికి ఆభరణం



నృత్యాభినయంలో అడుగులు, లాస్యప్రయోగం.. నృత్యం నేర్చుకోవడంలో ప్రధానఅంశాలు. లాస్యానికి శాస్త్రీయ ప్రాధాన్యం ఉన్నది. నృత్తరత్నావళిలో లాస్యం ప్రత్యేకంగా నిర్వచించారు. నాట్యంలో లయబద్ధమైన భంగిమలతో అభినయానికి అందం చేకూరుతుంది. అభినయం, నాట్యంలో లాస్యం ప్రయోగం చేసేప్పుడు భంగిమలు బ్యాలెన్సింగ్‌గా ఉంటే ఆ నృత్యం లయబద్ధమైన ప్రదర్శనకు పునాది.

–డాక్టర్ యశోదాఠాకూర్

అంతర్జాతీయ యువజన నాయకత్వంపై నేటినుంచి జాగృతి సదస్సు

- నోవాటెల్ వేదికగా మూడురోజులపాటు కార్యక్రమం
- తరలిరానున్న 135 దేశాల ప్రతినిధులు, 70 మంది వక్తలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జాగృతి నిర్వహిస్తున్న అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు శుక్రవారం నుంచి మూడురోజులపాటు హైదరాబాద్‌వేదికగా జరుగనున్నది. 'గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు' అనే అంశంపై హెచ్‌ఐసీసీలోని నోవాటెల్‌లో జరిగే ఈ సదస్సు ఏర్పాట్లను గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత పరిశీలించారు. 2030 వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 17 అంశాల లక్ష్యాల సాధనలో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సదస్సు రెండోరోజు కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే, ప్రత్యేకఅతిథిగా సార్క్ మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ థాపా హాజరుకానున్నారు. 20న సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు సదస్సుకు తరలిరానున్నారు. 16 దేశాల నుంచి 70 మంది వక్తలు, 40 మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

ప్రముఖులతో ప్రత్యేక చర్చలు

సదస్సులో ముఖ్యమైన అంశాలపై చర్చించేందుకు వీలుగా ఇప్పటికే ప్రత్యేకంగా హాళ్లను ఏర్పాటుచేశారు. ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్‌గుప్తా చర్చాగోష్ఠిని నిర్వహిస్తారు. అసోం ఎంపీ గౌరవ్ గగోయ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతోపాటు ఎంపీ కవిత ప్యానలిస్టులుగా పాల్గొంటారు. 'గాంధీ, యూత్ అండ్ సస్టెనబులిటీ, ప్రాస్పెక్టివ్స్ ఫ్రం ద వరల్డ్' అంశంపై యూకే ఎంపీ సీమా మల్హోత్రా, న్యూజీలాండ్ ఎంపీ కన్వజిత్‌సింగ్ భక్షీ, యునైటెడ్ నేషన్స్‌లో నేపాల్ శాశ్వత ప్రతినిధి మధు రామన్ ఆచార్య, శ్రీలంక పరిశ్రమలు, వాణిజ్యశాఖ ఉపమంత్రి బుదికా పథిరాణా, మాసిడోనియా రిపబ్లిక్ పెట్టుబడుల శాఖ మాజీ మంత్రి గ్లిగర్ తస్కోవిచ్, ఆఫ్ఘనిస్తాన్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ వ్యవస్థాపకుడు జాన్ డిక్సన్ ప్రసంగిస్తారు.



గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో పోటీచేస్తున్న ఎం సత్యనారాయణగౌడ్ ప్యానల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, టీజీవో అధ్యక్షురాలు వీ మమత, టీఎన్జీవో ప్రధానకార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షురాలు రేచల్ తదితరులు

ఉద్యోగుల్లో చిచ్చుపెట్టేందుకు ఏపీ ఎన్జీవోల కుట్ర

- హౌసింగ్ సొసైటీ భూముల కోసం కొత్త నాటకం
- అమరావతిలో ఉంటూ ఇక్కడ పోటీ
- రూ. 18 కోట్ల కుంభకోణం కేసుల్లో ఉన్నవారితో ప్యానెల్
- సత్యనారాయణగౌడ్ ప్యానెల్ విజయంతోనే స్థలాల పంపిణీ
- మీడియా సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు కారం రవీందర్‌రెడ్డి, మమత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, బషీర్‌బాగ్: రాష్ట్ర విభజన తర్వాత అమరావతికి వెళ్లినప్పటికీ ఏపీఎన్జీవోల సంఘం తెలంగాణ ఉద్యోగుల్లో చిచ్చుపెట్టేందుకు ఇంకా కుట్రచేస్తున్నదని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, టీజీవో అధ్యక్షురాలు వీ మమత ఆరోపించారు. గచ్చిబౌలి హౌసింగ్‌సొసైటీ ఎన్నికలు జరుగకుండా, అక్కడ జరిగిన కుంభకోణాలు బయటకు రాకుండా కోర్టులో కేసులు వేసి ఏండ్ల తరబడి అడ్డుకున్న ఏపీఎన్జీవోలు ఇప్పుడు కొత్త నాటకానికి తెరలేపారని ధ్వజమెత్తారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడిరాష్ట్రంలో ఏపీఎన్జీవోల సంఘం ముసుగులో రూ.18 కోట్ల కుంభకోణానికి పాల్పడి.. క్రిమినల్ కేసులు నమోదైనవారు ఇప్పుడు అమరావతిలో ఉద్యోగం చేసుకుంటూ తెలంగాణ ఉద్యోగుల్లో చిచ్చుపెడుతున్నారన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఒక్క డైరెక్టర్ కూడా లేకుండా అమరావతిలో ఉండేవారితోనే ప్యానెల్ ఏర్పాటుచేసి, గచ్చిబౌలి సొసైటీ ఎన్నికల్లో పోటీచేస్తున్నారని వివరించారు. హౌసింగ్ సొసైటీ ఎన్నికలు జరుగకుండా ఐదేండ్లుగా కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకుంటున్న ఏపీఎన్జీవోలసంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఇక్కడ సొసైటీ డైరెక్టర్‌గా పోటీచేయడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. హౌసింగ్ సొసైటీలో ఇప్పటికే వాటాధనం చెల్లించి, ప్లాట్ల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ఉద్యోగులు భాగ్యనగర్ తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగులసంఘం పేరుతో అసోసియేషన్ ఏర్పాటుచేసుకుని, సమస్యలు పరిష్కరించుకుంటున్నారని, సొసైటీ ఎన్నికలు జరిపేలా తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నుంచి అత్యవసర ఆదేశాలు ఇప్పించుకున్నామని వివరించారు. సొసైటీ ఎన్నికలు జరిగితే భూముల వ్యవహారం కొలిక్కి వస్తుందని తెలిపారు. అమరావతిలో ఉద్యోగాలు చేస్తున్నవారిని ఇక్కడి సొసైటీ డైరెక్టర్లుగా ప్యానెల్ ఏర్పాటుచేసి పోటీచేయిస్తున్నారని, అక్కడ ఉండేవారు ఏ హోదాలో ఇక్కడి భూములను పంచుతారని ప్రశ్నించారు. ఇప్పటికే ఉద్యోగుల జేఏసీ తరపున గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీని భాగ్యనగర్ ఎన్జీవోలకు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌కు విన్నవించామని, దానిపై ఆయన సానుకూలంగా ఉన్నారని, సమస్య తీరుతుందనుకునే సమయంలో ఏపీఎన్జీవోలు మళ్లీ అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఏపీ ఎన్జీవోలు మళ్లీ ఇప్పుడు ఉద్యోగులను రెచ్చగొడుతూ వివాదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, ఏపీ ఎన్జీవోలలో ఉన్న తెలంగాణ, ఏపీ ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. భాగ్యనగర్ తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల తరపున సత్యనారాయణగౌడ్ ప్యానెల్‌ను గెలిపించాలని, వీరితోనే భూముల సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ప్లాట్లు పంచితే టీఎన్జీవోలకు ఉద్యోగుల్లో మంచిపేరు వస్తుందనే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో టీఎన్జీవో ప్రధానకార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షురాలు రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, కొండల్‌రెడ్డి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు ముజీబ్, లక్ష్మణ్, భాగ్యనగర్ తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్, కార్యదర్శి బలరాం, ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎన్నికల్లో పోటీచేస్తున్న సత్యనారాయణ గౌడ్ ప్యానెల్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

పంటకాలనీల ఆలోచన అభినందనీయం



హైటెక్స్‌లో అగ్రివిజన్-2019 సదస్సును ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో వ్యవసాయవర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు తదితరులు

- వ్యవసాయరంగంవైపు యువత దృష్టిసారించాలి
- అగ్రివిజన్ సదస్సులో ఉపరాష్ట్రపతి వెంకయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు సంక్షేమమే ధ్యేయంగా పంటకాలనీలను ఏర్పాటుచేయాలనే తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచన వ్యవసాయరంగానికి మంచి పరిణామమని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. రెండు రోజులపాటు జరిగే అగ్రివిజన్-2019 సదస్సును గురువారం ఆయన మాదాపూర్ ఐటీసీ కోహినూర్ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో గ్రామీణ రైతులు, యువత సాగుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయాన్ని పరిశ్రమలా గుర్తించి యువత ఇటువైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. పంటల్లో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ ఉత్పాదకత పెంచడమేకాకుండా, స్థిరత్వం సాధించాల్సిన అవసరం ఉన్నదని, అలాగే వ్యాధులు, చీడపీడలు తట్టుకొనేలా, వాతావరణ మార్పుల్ని తట్టుకొనేలా ఆధునిక టెక్నాలజీతో విత్తనాలు ఉత్పత్తి దగ్గర నుంచి పోస్ట్ హార్వెస్టింగ్ వరకు మార్పులు రావాలన్నారు. వ్యవసాయంలో డిజిటల్ టెక్నాలజీ పెరగాలన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ, జియో ఇన్ఫర్మేషన్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్‌డాటా ఎనలిటిక్స్ వంటివి విరివిగా ఉపయోగించి రైతుల ఆదాయం పెంచాలని సూచించారు. ఈ సదస్సులో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, సీఐఐ తెలంగాణ అధ్యక్షుడు సంజయ్ సింగ్, సీఐఐ, కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అనిల్‌కుమార్ ఏమూపు, సమీర్‌గోయల్, టీఆర్ కేశవన్ తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.53 గంటలకు

సూర్యాస్తమయం: 6.00 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం ద్వాదశి రాత్రి 8.24 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: రోహిణి మధ్యాహ్నం 12.26 వరకు, తదుపరి మృగశిర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం ఉదయం 11.03 నుంచి మధ్యాహ్నం 12.27 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.07 నుంచి 9.51 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.49 నుంచి 1.33 వరకు, వర్జ్యం: తె. 4.51 నుంచి ఉదయం 6.27 వరకు, తిరిగి సాయంత్రం 5.35 నుంచి రాత్రి 7.11 వరకు.

లోకం పోకడ



సార్సార్.. మీకు గట్టి పోటీ వచ్చింది!

బాబు పాలనకు మూడు నెలల్లో చరమగీతం



- ఏపీ ప్రజలు ఆయనను వద్దనుకుంటున్నారు
- ఆయన బంధాలు, బంధుత్వాలు తెలియని వ్యక్తి
- చంద్రబాబుపై నిప్పులు చెరిగిన మాజీమంత్రి తలసాని
- 20 రోజుల్లో సీఎం కేసీఆర్ ఏపీలో పర్యటిస్తారని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ ప్రజలు చంద్రబాబును వద్దనుకుంటున్నారని, మరో మూడు నెలల్లో ఆయన పాలనకు చరమగీతం పాడబోతున్నారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తాను రెండురోజులు ఏపీలో పర్యటిస్తేనే బాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, ఇక సీఎం కేసీఆర్ అక్కడికి వెళ్తే ఏమైపోతారోనని ఎద్దేవాచేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బాబుకు ఫెడరల్ ఫ్రంట్ అంటేనే వణుకు పుడుతున్నదని విమర్శించారు. తాను విజయవాడ దుర్గగుడిలో మీడియాతో మాట్లాడలేదని, అక్కడ ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్ద మీడియా ప్రతినిధుల కోరిక మేరకే మాట్లాడానని చెప్పారు. ఆలయాల దగ్గర రాజకీయాలు చేసే ఆలోచనలు చంద్రబాబువేనని మండిపడ్డారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన తనకు బంధుత్వాలు ఉన్నాయన్నారు. ఏపీనుంచి వచ్చి తెలంగాణలో స్థిరపడిన 26 బీసీ కులాలకు తాము న్యాయం చేస్తామని, ఈ మేరకు బీసీ కమిషన్‌కు నివేదించామని గుర్తుచేశారు. కానీ చంద్రబాబుకు బంధాలు, బంధుత్వాల విలువ తెలియదని విమర్శించారు. హరికృష్ణ శవం వద్ద టీఆర్‌ఎస్‌తో పొత్తుపై మాట్లాడిన నీచమైన చరిత్ర బాబుదని మండిపడ్డారు.

కులాల మధ్య చిచ్చుపెట్టడం బాబు నైజం

సీఎం కేసీఆర్ రాబోయే 15-20 రోజుల్లో ఏపీలో పర్యటిస్తారని తలసాని స్పష్టంచేశారు. ఆ సమయంలో ఏపీని ఎలా అభివృద్ధి చేయాలో చంద్రబాబు అడిగితే సీఎం కేసీఆర్ సలహాలు ఇస్తారన్నారు. తాను వెళ్తేనే ఏపీలో ప్రజా స్పందన అద్భుతంగా ఉన్నదని, ఇక కేసీఆర్ వెళ్తే ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవాలని సూచించారు. దేశానికి సేవ చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేస్తున్నారని స్పష్టంచేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టేది చంద్రబాబేనని, మాల మాదిగలకు, కాపులు, ఇతర కులాల మధ్య చిచ్చుపెట్టారని ఆరోపించారు. ఎన్టీఆర్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా టీడీపీని స్థాపిస్తే చంద్రబాబు అదే పార్టీతో పొత్తు పెట్టుకోవడాన్ని ఎన్టీఆర్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. గోబెల్స్ చంద్రబాబుకు బంధువని, అందుకే ఆ తరహాలోనే ప్రచారంచేసుకుంటున్నారని మండిపడ్డారు. లోటు బడ్జెట్ ఉంటే రూ.కోట్లు ఖర్చుపెట్టి ధర్మదీక్షలు, నవనిర్మాణ దీక్షలు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. అవినీతిలో ఏపీ మొదటిస్థానంలో ఉన్నదని పేర్కొన్నారు. ఏపీలో ఏవరు ముఖ్యమంత్రి అయినా చంద్రబాబు కంటే బ్రహ్మాండంగా పాలిస్తారని చెప్పారు.

వైద్యారోగ్యశాఖలో 26 కొత్తపోస్టులు

- ఎంహెచ్‌ఎస్‌ఆర్బీలో భర్తీకి అనుమతి
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యారోగ్య, కుటుంబసంక్షేమశాఖకు సంబంధించి 26 పోస్టులను మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొత్తగా ఏర్పాటుచేసిన మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ) కోసం ఈ పోస్టులను రాష్ట్రశాఖ అనుమతించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైద్య, ఆరోగ్యశాఖ ప్రతిపాదన మేరకు ఎంహెచ్‌ఎస్సార్బీకి కొత్తగా మంజూరైన పోస్టుల్లో మెడికల్, హెల్త్‌సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (సభ్య కార్యదర్శి), జాయింట్ డైరెక్టర్ (సభ్యుడు) పోస్టులను డిప్యూటేషన్‌పై భర్తీచేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఎంహెచ్‌ఎస్సార్బీ నిర్వహణా సిబ్బందిలో డిప్యూటీ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఎల్‌ఎఫ్‌వై సెక్రటరీ, ట్రెజరర్ (గ్రేడ్-2), అకౌంట్స్ ఆఫీసర్, ఆఫీస్ సూపరింటెండెంట్ (2), సీనియర్ అసిస్టెంట్(4), జూనియర్ అసిస్టెంట్ (4) పోస్టులకు డిప్యూటేషన్‌పై, లీగల్ ఆఫీసర్ పోస్టుకు డిప్యూటేషన్ లేదా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాల్సిందిగా సూచించారు. సిస్టమ్ అనలిస్ట్, చీఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ (2) పోస్టులు కాంట్రాక్టు పద్ధతిన, డాటా ఎంట్రీ ఆపరేటర్ (4), ఆఫీస్ సబార్డినేట్ (4) పోస్టులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో వెల్లడించారు.

అంతర్రాష్ట్ర బదిలీల గడువు పొడిగింపు

- మెమో జారీచేసిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సీఎస్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రాల పునర్విభజన తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. రెండు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల భార్య లేదా భర్త విషయంలో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు చేయడానికి 2017 ఆగస్టు 7న ఉమ్మడిగా గైడ్‌లైన్స్ విడుదలచేసి దరఖాస్తులను ఆహ్వానించారు. దరఖాస్తులను సునిశితంగా పరిశీలించి అంతర్రాష్ట్ర బదిలీలు చేపడుతున్నారు. వచ్చిన దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అంతర్రాష్ట్ర బదిలీల గడువును 2019 జూన్ 30 వరకు పొడిగించాయి. బదిలీల గడువుపెంపు ఇదివరకే వచ్చిన దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునీత సంయుక్తంగా అన్నిశాఖలకు మెమో జారీచేశారు.

ఆకాశవాణి చిన్నమ్మ.. నిర్మలావసంత్ ఇకలేరు

- నివాళులర్పించిన ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ అకాశవాణి కేంద్రం నుంచి ప్రతిరోజూ ప్రసారమయ్యే పాడి-పంట కార్యక్రమంలో చిన్నమ్మగా శ్రోతలను అలరించిన నిర్మలావసంత్ (73) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 8న ఆకాశవాణి కేంద్రంలో జరిగిన పూర్వఉద్యోగుల ఆత్మీయసమ్మేళనంలో చివరిసారిగా పాల్గొని ఉల్లాసంగా గడిపారు. తమిళనాడుకు చెందిన ఆమె కుటుంబం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కడప జిల్లాలో స్థిరపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన వసంత్‌తో వివాహం జరిగిన అనంతరం ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. నిర్మల భర్త నిజాంకాలేజీలో ఇంగ్లిష్ విభాగంలో డీన్‌గా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. పల్లెటూరి అమాయక మహిళా రైతుల సందేహాలను తన గొంతులో వినిపిస్తూ, పెద్దయ్యద్వారా సమాధానాలు రాబడుతూ అందరినీ మెప్పించారు. వ్యవసాయ విభాగానికి కొండంత అండగా నిలిచిన చిన్నమ్మ అంటూ నిర్మలమ్మకు ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్ నివాళులర్పించింది. వారి వారసత్వం కొనసాగిస్తూ, ఆకాశవాణి వైభవానికి కృషిచేస్తామని ప్రతిజ్ఞచేశారు.

కంటివెలుగు @ 1.30 కోట్లు



భద్రాద్రికొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది




- 7,821 గ్రామాల్లో కంటి వైద్యశిబిరాలు పూర్తి
- నిరాటంకంగా 91వ రోజు వైద్యశిబిరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వ రహిత తెలంగాణ సాధనకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు వైద్యశిబిరాల నిర్వహణ 7,821 గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలోని 640 వార్డుల్లో పూర్తయింది. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి 91వ రోజైన గురువారం వరకు శిబిరాల్లో 1,30,64,007 మందికి కంటి పరీక్షలు చేశారు. 20,27,571 మందికి కండ్లద్దాలను అందజేశారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 98,724 మందికి కంటి పరీక్షలు చేశారు.

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	గురువారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	98,724	1,30,64,007
రీడింగ్ అద్దాలు పొందినవారు	8,453	20,27,571
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	6,888	15,65,028
కంటి సమస్యలపై రెఫరల్	5,807	8,19,942

ఇప్పుడు కంటిచూపు బాగా ఉంది



నేను కొంతకాలంగా కంటి సమస్యతో బాధపడుతున్న. కంటి వైద్య శిబిరాల గురించి తెలుసుకుని ఇక్కడికి వచ్చా. కండ్లజోడు ఇవ్వడంతో ఇప్పుడు కంటిచూపు బాగా ఉంది. ఉచితంగా కంటి వైద్యపరీక్షలు చేస్తున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– కంచర్ల రాజ్యలక్ష్మి, కొత్తగూడెం

పండ్లు, కూరగాయలతో ఆరోగ్యం

- జాతీయ పోషకాహార సంస్థ వెల్లడి

హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: రోజువారీ భోజనంలో 400 గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకుంటే అనారోగ్య సమస్యలు లేకుండా జీవించవచ్చునని జాతీయ పోషకాహార సంస్థ వెల్లడించింది. అనేక ప్రయోగాల అనంతరం ఈ విషయంపై స్పష్టత ఇచ్చింది. వాస్తవానికి ఇంత మోతాదులో కూరగాయలు, పండ్లు తీసుకోకున్నా ఆరోగ్యంగా ఉన్నట్టు కనబడినప్పటికీ పూర్తి స్థాయిలో ఆరోగ్యంగా ఉండరని పేర్కొన్నది. చాలామంది రక్తహీనతతోపాటు, అనేక రుగ్మతలతో ఇబ్బందులు పడుతుంటారని తెలిపింది. ఈ క్రమంలో విటమిన్ల లోపం ఏర్పడి అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని పేర్కొన్నది. ఇందులోభాగంగానే మైప్లేట్ పేరుతో ఒక యాప్‌ను ఆవిష్కరించింది.

శుక్రవారం
18•1•2019
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



అమరులారా వందనం

గురువారం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

స్పీకర్ పోచారం

ప్రతిపాదించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. మద్దతు పలికిన ప్రతిపక్ష పార్టీలు

ఏకైక నామినేషన్ దాఖలు.. నేడు అధికారికంగా ప్రకటించనున్న ప్రొటెం స్పీకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

శాసన సభాపతిగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. స్పీకర్ ఎన్నికకు సంబంధించి గురువారం నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఆయన ఎన్నిక లాంఛనం కానున్నది. స్పీకర్‌గా పోచారం ఎన్నికైనట్టు శుక్రవారం శాసనసభలో అధికారికంగా ప్రకటిస్తారు. స్పీకర్ పదవికి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ప్రతిపాదిస్తూ నామినేషన్ ఫారంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతకం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వీఎం అబ్రహం ప్రతిపాదిస్తూ సంతకాలు చేశారు. పోచారం మొత్తం ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నరసింహాచార్యులు నామినేషన్ పత్రాలను స్వీకరించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే, ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ స్పీకర్ ఎన్నికపై ప్రకటన చేస్తారు. అనంతరం సీఎం కేసీఆర్, ప్రతిపక్ష నాయకులు కలిసి పోచారంను తోడ్కొని వెళ్లి స్పీకర్ స్థానంలో కూర్చోబెడుతారు. అనంతరం స్పీకర్‌ను అభినందిస్తూ సభా నాయకులు కేసీఆర్, అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రసంగిస్తారు. శనివారం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉంటుంది. పోచారం గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి చాంబర్‌కు వెళ్లి తనను స్పీకర్‌గా ఎంపికచేసినందుకు సీఎం

మిగతా 8వ పేజీలో



సుదీర్ఘ అనుభవానికి సమున్నత గౌరవం

- సింగిల్ విండో చైర్మన్‌గా మొదలైన పోచారం రాజకీయ ప్రస్థానం
- తెలంగాణ తొలి ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా సేవలు

8

కొలువుదీరిన అసెంబ్లీ

- ప్రొటెంస్పీకర్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన సభ
- శాసనసభ్యులుగా 114 మంది ప్రమాణం
- తొలుత సీఎం కేసీఆర్ ప్రమాణస్వీకారం
- ఆంగ్లంలో ఎనిమిది మంది, ఉర్దూలో ముగ్గురు సభ్యులు..
- వేర్వేరు కారణాలతో హాజరుకాని ఐదుగురు సభ్యులు
- ప్రతిపక్ష సభ్యుల వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

స్వరాష్ట్రంలో రెండో అసెంబ్లీ తొలిసారిగా గురువారం కొలువుదీరింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహా 114 మంది ఎమ్మెల్యేలుగా ప్రమాణంచేశారు. ఉదయం 11:30 గంటలకు జాతీయ గీతాలాపనతో సభ ప్రారంభమైంది. అనంతరం సభ్యులతో ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేయించనున్నట్టు ప్రొటెంస్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రకటించారు. తొలుత ఎమ్మెల్యేగా ప్రమాణం చేసేందుకు సభానాయకుడు, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ లేవగానే సభ్యులంతా బల్లలుచరుస్తూ అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్ దైవసాక్షిగా ప్రమాణం స్వీకరించారు. తర్వాత ప్రొటెంస్పీకర్ వద్దకు వెళ్లి కరచాలనం చేశారు. స్పీకర్ చైర్‌కు ఎడమవైపు నుంచి కిందకు వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి, తన స్థానంలోకి వెళ్లి కూర్చున్నారు. అనంతరం మహిళాసభ్యులు ఎమ్మెల్యేలుగా

మిగతా 4వ పేజీలో



గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఒడిశాలోనూ కంటివెలుగు

- 'సునేత్ర' పేరుతో నిర్వహిస్తున్న నవీన్ పట్నాయక్ ప్రభుత్వం
- ఇప్పటికే తెలంగాణ స్ఫూర్తితో రైతుబంధు తరహా పథకం అమలు
- దేశానికే ఆదర్శంగా మారుతున్న తెలంగాణ పథకాలు

4

రెండో విడుత ప్రచారం షురూ

- మూడో విడుత నామినేషన్లకు నేడు ఆఖరు
- పంచాయతీల్లో కొనసాగిన ఏకగ్రీవాల పర్వం

9



గురువారం రాష్ట్ర శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు కూడా ఉన్నారు.



తన చాంబర్‌కు వచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్. చిత్రంలో స్పీకర్ అభ్యర్థి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రొటెంస్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ తదితరులు కూడా ఉన్నారు.

ముఖ్యమంత్రి అవసరం నాకుంది

అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుపై రానున్నరోజుల్లో ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం సీఎం కేసీఆర్‌ను కలుస్తానని తెలిపారు. అసెంబ్లీ తొలి రోజున లాబీలో మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తన అవసరం ముఖ్యమంత్రికి లేదని, ముఖ్యమంత్రి అవసరం తనకు ఉన్నదన్నారు. కేసీఆర్ తన నియోజకవర్గానికి వస్తే సన్మానిస్తానన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయవద్దని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించినట్టు చెప్పారు. ప్రజలు తీర్పు ఇచ్చాక ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరి కాదనే విషయం గుర్తించానని, తనను గెలిపించిన ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామినవుతానని ఆయన పేర్కొన్నారు.

నేడు కేసీఆర్‌ను కలువనున్న వంటేరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ పార్టీ నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలువనున్నారు. వంటేరు ప్రతాప్‌రెడ్డి 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన సంగతి తెలిసిందే.







గురువారం తెలంగాణ రాష్ట్ర రెండో తొలిశాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు గన్‌పార్కులోని అమరవీరులస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్యేలు కే తారకరామారావు, భాస్కర్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాలె యాదయ్య, ఎంపీ సీతారాంనాయక్, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, క్రాంతికిరణ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సుంకె రవిశంకర్, జగదీశ్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు

అమరవీరులకు నివాళుర్పించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ సహా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తొలుత గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ప్రగతిభవన్ నుంచి నేరుగా గన్‌పార్కు వద్దకు చేరుకున్న సీఎం కేసీఆర్ ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించి, అసెంబ్లీకి బయల్దేరారు. తొలిసారి ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా గన్‌పార్క్ వద్ద గౌరవ వందనం స్వీకరించే సంప్రదాయానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. నివాళులర్పించినవారిలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కే తారకరామారావు, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మాదేవేందర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, పద్మారావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డితో పాటు ఎంపీలు వినోద్‌కుమార్, జోగినిపల్లి సంతోష్‌కుమార్, శిల్పి ఎక్కా యాదగిరిరావు కూడా ఉన్నారు.



అసెంబ్లీ ఆవరణలోని మైసమ్మ గుడిలో పూజలు చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో స్పీకర్ అభ్యర్థి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.

మైసమ్మకు సీఎం కేసీఆర్ పూజలు

- సుందరంగా ముస్తాబైన అసెంబ్లీ ప్రాంగణం
- సందడిచేసిన ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం సీఎం కేసీఆర్, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు అసెంబ్లీలోని మైసమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలుచేశారు. సీఎం కేసీఆర్‌కు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సీఎం కేసీఆర్, పోచారంను శాలువాతో సన్మానించారు. సమావేశాల సందర్భంగా కొత్త సభ్యులకు స్వాగతం పలుకడానికి అసెంబ్లీని అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. ప్రమాణస్వీకారాన్ని తిలకించడానికి వచ్చిన సభ్యుల కుటుంబసభ్యులు ఈ అలంకరణను చూసి ముగ్ధులయ్యారు. రాత్రి వేళల్లో విద్యుత్‌దీపాల వెలుగులతో అసెంబ్లీ సరికొత్త శోభను సంతరించుకున్నది.

విభేదాలు మరిచి విందుభోజనం!

- జూబ్లీహాల్‌లో సభ్యులకు విందు ఇచ్చిన ప్రభుత్వం
- ఒకే టేబుల్‌పై ఆసీనులైన అధికార, ప్రతిపక్ష సభ్యులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రెండో అసెంబ్లీ తొలి సమావేశాల మొదటిరోజున ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరికీ గురువారం మధ్యాహ్నం జూబ్లీహాల్‌లో ప్రభుత్వం భోజనాలు ఏర్పాటుచేసింది. వివిధ రాజకీయ పార్టీల నేతలంతా విభేదాలు మరిచి ఒకే టేబుల్‌పై సరదాగా ముచ్చట్లు చెప్పుకుంటూ సామూహికంగా విందు భోజనం చేశారు. సీఎం కేసీఆర్, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్, హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీ బీ వినోద్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, టీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్‌రావు, మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లారాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు సలీం, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఫారూఖ్‌హుస్సేన్ తదితరులు ముచ్చటిస్తూ భోజనాలు చేశారు. తెలంగాణ వంటకాలు భోజనాలు బాగున్నాయని సభ్యులు కితాబిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీలు, సభ్యులతో సీఎం కేసీఆర్ కలిసి జూబ్లీహాల్, శాసనమండలి ప్రాంగణమంతా కలియతిరిగారు. భవనాన్ని చాలా బాగా ఆధునీకరించారని మెచ్చుకున్నారు. ఇకపై కలెక్టర్ల సమావేశాలు పెట్టుకోవచ్చని, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చునని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ వెంట అసెంబ్లీ కార్యదర్శితో పాటు జీఏడీ అధికారులు, టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ చాంబర్‌లో సీఎం కేసీఆర్‌తోపాటు స్పీకర్ అభ్యర్థి, ప్రొటెంస్పీకర్‌లు కాసేపు కూర్చున్నారు. మండలి చైర్మన్‌తో కొద్దిసేపు ముచ్చటించారు.



కాంగ్రెస్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కరచాలనం చేసి శుభాకాంక్షలు చెప్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గండ్ర తదితరులు

కొలువుదీరిన అసెంబ్లీ

మూడోపేజీ తరువాయి...

ప్రమాణం చేశారు. తొలుత అజ్మీరా రేఖానాయక్ ఇంగ్లిష్‌లో ప్రమాణంచేశారు. తర్వాత సీఎం కేసీఆర్ కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ధనసరి అనసూయ, గొంగిడి సునీత, హరిప్రియ బానోత్, పద్మాదేవేందర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న అక్షరమాలను పరిగణనలోకి తీసుకొని వరుసగా ఒక్కోసభ్యుడితో ప్రొటెంస్పీకర్ ప్రమాణం చేయించారు. చాలామంది సభ్యులు దైవసాక్షిగా, కొందరు పవిత్ర హృదయం సాక్షిగా ప్రమాణంచేశారు. చివరి సభ్యుడిగా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రమాణం చేశారు. నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌తోనూ ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు ఒక్కోసభ్యుడి పేరు పిలువగా, స్పీకర్ పోడియం ఎదుట ఏర్పాటుచేసిన మైక్ వద్దకు వచ్చి ప్రతిసభ్యుడు ప్రమాణపత్రాన్ని చదివారు. అనంతరం వారికి ఎమ్మెల్యే సర్టిఫికెట్ అందజేశారు. ప్రమాణం అనంతరం ప్రతిసభ్యుడు సీఎం కేసీఆర్‌కు అభివాదంచేస్తూ ప్రొటెం స్పీకర్ చైర్ వద్దకు వెళ్లారు. ప్రొటెం స్పీకర్ వారికి అభినందనలు తెలిపాక రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. సభ్యులందరికీ ప్రత్యేక మెటీరియల్‌తో కూడిన బ్యాగ్‌లను అందజేశారు. బ్యాగ్‌లో భారత రాజ్యాంగం, అసెంబ్లీ నియమ, నిబంధనలను తెలిపే పుస్తకాలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో అందించారు. ప్రత్యేక బ్యాగులో దాదాపుగా 17 రకాల వస్తువులు, పుస్తకాలు అందించారు. వీటితో పాటుగా తిరుపతి డైరీ, లడ్డూలు అందజేశారు. సభ్యుల సమాచారాన్ని సేకరించే బయోడేటా ఫారాలు, ఎమ్మెల్యే లెటర్ ప్యాడ్స్ అందజేశారు. ప్రమాణం అనంతరం సభ్యులను సహచరులు అభినందించారు. సభ్యుల ప్రమాణాలు పూర్తయిన తర్వాత ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు సభను వాయిదావేశారు. వివిధ కారణాలతో ప్రమాణ స్వీకారానికి ఐదుగురు సభ్యులు హాజరుకాలేదు. ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీ, జాఫర్ హుస్సేన్, బీజేపీ సభ్యుడు రాజాసింగ్, టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, టీఆర్‌ఎస్ సభ్యుడు మాధవరం కృష్ణారావు ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు. వీరంతా శుక్రవారం ప్రమాణం స్వీకరించనున్నారు.

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనే నేను..

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనే నేను, శాసనసభ సభ్యుడిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగంపట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారత దేశసార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని.. నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.

తెలంగాణ శాసనసభ సభ్యుడనైన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనే నేను, సభ నియమాలకు కట్టుబడి ఉంటానని, వాటిని అనుసరిస్తానని, సభ మర్యాదలను పాటిస్తానని, సంప్రదాయాలను గౌరవిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.

ప్రతిపక్ష సభ్యులకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

సభామర్యాదలు పాటిస్తూ, సభ హుందాతనం పెంచేందుకు చొరవ తీసుకొనే ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రత్యేకతను మరోమారు చాటుకున్నారు. గన్‌పార్క్‌వద్ద అమరవీరులకు నివాళులర్పించిన తర్వాత ఉదయం 11:25 గంటలకు అసెంబ్లీలోకి సీఎం కేసీఆర్ వచ్చారు. నేరుగా ప్రతిపక్ష సభ్యుల స్థానాల వద్దకు వెళ్లారు. కాంగ్రెస్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కరచాలనంచేసి శుభాకాంక్షలు తెలిపారు. మల్లు భట్టి విక్రమార్కతోపాటు ఇతర సభ్యులతో కరచాలనం చేసి, అభినందనలు తెలిపారు. అనంతరం టీఆర్‌ఎస్ సభ్యులకు నమస్కరిస్తూ వెళ్లి తన స్థానంలో కూర్చున్నారు.

పవిత్రహృదయం సాక్షిగా కేటీఆర్ ప్రమాణం

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంలో కొందరు పవిత్ర హృదయం సాక్షిగా ప్రమాణం చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, ఈటల రాజేందర్, చంటి క్రాంతికిరణ్, నోముల నర్సింహయ్య, పొడెం వీరయ్య, సోలిపేట రామలింగారెడ్డి, ధనసరి అనసూయ, జగదీశ్‌రెడ్డి, కందాల ఉపేందర్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, అంజయ్యయాదవ్, రసమయి బాలకిషన్, కాలె యాదయ్య, జైపాల్‌యాదవ్ పవిత్ర హృదయం సాక్షిగా ప్రమాణం చేశారు. మిగిలిన సభ్యులు దైవసాక్షిగా ప్రమాణం చేశారు.

ఎనిమిది మంది ఇంగ్లిష్‌లో, ముగ్గురు ఉర్దూలో..

తెలుగుతోపాటు ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లోనూ ఎమ్మెల్యేలు ప్రమాణం స్వీకరించారు. కాంగ్రెస్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, కాలేరు వెంకటేశ్, షకీల్ అహ్మద్, ఎంఐఎం సభ్యుడు అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాల, అజ్మీరా రేఖనాయక్, హరిప్రియ బానోత్, నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఇంగ్లిష్‌లో ప్రమాణంచేశారు. ఎంఐఎం సభ్యులు కౌసర్ మొహినుద్దీన్, సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ, మహ్మద్ మోజంఖాన్‌లు ఉర్దూలో ప్రమాణం చేశారు.



గురువారం అసెంబ్లీలో తొలుత శాసనసభ్యుడిగా ప్రమాణం చేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



గురువారం తెలంగాణ రాష్ట్ర రెండో అసెంబ్లీ సమావేశంలో జాతీయ గీతాలాపన సందర్భంగా గౌరవసూచకంగా లేచినిలుచున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు

ప్రమాణ స్వీకారంలో సైడ్‌లైట్స్

- అసెంబ్లీకి టీఆర్‌ఎస్ సభ్యులంతా గులాబీ కండువాలతో హాజరయ్యారు. సభ ప్రారంభానికి పదినిమిషాల ముందే తమ స్థానాల్లో ఆసీనులయ్యారు. ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు తర్వాత వచ్చారు. సభ్యులకు స్థానాలు కేటాయించకపోవడంతో, ఎక్కడైనా కూర్చొవచ్చని ప్రొటెం స్పీకర్ సూచించారు. టీఆర్‌ఎస్ సభ్యులంతా ఒకవైపు, కాంగ్రెస్ సభ్యులంతా మరోవైపు కూర్చున్నారు.
- ప్రమాణస్వీకారం అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు మరికొందరు సభ్యులు సీఎం కేసీఆర్ స్థానం వద్దకు వెళ్లగా, సీఎం కేసీఆర్ వారితో కరచాలనం చేసి అభినందించారు. కాంగ్రెస్ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ సభ్యులు, టీఆర్‌ఎస్ సభ్యులంతా ప్రమాణం చేసిన తర్వాత సీఎం కేసీఆర్‌కు నమస్కరించారు.
- అనారోగ్యం కారణంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న వీల్‌చైర్‌లో సభకు హాజరయ్యారు. ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అనుమతితో వీల్‌చైర్‌లో కూర్చొనే ప్రమాణం చేశారు. రిజిస్టర్‌లో సంతకం చేసిన అనంతరం సభ్యులకు అభివాదం చేస్తూ బయటికి వెళ్లారు.
- ప్రమాణం అనంతరం సభ్యులతో కేటీఆర్, హరీశ్‌రావు ఇతర సీనియర్ సభ్యులు కరచాలనం చేసి అభినందించారు.
- కాంగ్రెస్ సభ్యుడు ఆత్రం సక్కు ప్రమాణం చేస్తున్న క్రమంలో 'దైవసాక్షిగా' అనే పదాన్ని పలుకలేదు. అసెంబ్లీ సిబ్బంది దైవసాక్షిగా అనే పదాన్ని చేర్చుతూ మరోమారు ఆత్రం సక్కుతో ప్రమాణపత్రాన్ని చదివించారు.



జూబ్లీహాల్‌లో శాసనసభ్యులకు ప్రభుత్వం ఇచ్చిన విందులో పాల్గొన్న సీఎం కేసీఆర్, శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, అధికార, ప్రతిపక్ష సభ్యులు




ఆధునీకరించిన జూబ్లీహాల్, శాసనమండలి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీలు సలీం, ఫారూఖ్‌హుస్సేన్, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క తదితరులు

ఒడిశాలోనూ కంటివెలుగు

- సునేత్ర పేరుతో నిర్వహిస్తున్న నవీన్ పట్నాయక్ ప్రభుత్వం
- దేశానికే ఆదర్శంగా మారుతున్న తెలంగాణ ఆరోగ్య పథకాలు


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో విజయవంతంగా కొనసాగుతున్న కంటివెలుగు స్ఫూర్తితో ఒడిశా ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పలు ఆరోగ్య పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఏ పౌరుడూ కంటి సమస్యలతో బాధపడొద్దన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా కండ్లద్దాలు పంపిణీ చేస్తున్నారు. అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఒడిశా ప్రభుత్వం 'సునేత్ర' పేరుతో యథాతథంగా అమలు చేస్తున్నది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ, శస్త్ర చికిత్సలు చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగును ఆదర్శంగా తీసుకొని సునేత్రకు రూపకల్పన చేసినట్టు ఒడిశా ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే రైతుబంధు, రైతు బీమా స్ఫూర్తితో ఒడిశా ప్రభుత్వం కాలియా (కృషక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఇన్‌కమ్ అగుమెంటేషన్) పేరుతో పథకాన్ని ప్రారంభించింది. రైతులకు పంట పెట్టుబడి అందించడంతోపాటు బీమా సౌకర్యం కల్పిస్తున్నది.

దేశానికే రోల్ మోడల్

ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా కేసీఆర్ సర్కారు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆరోగ్యశ్రీ, కంటివెలుగు, కేసీఆర్ కిట్లు, ఉచిత డయాలిసిస్ సేవలు, ఈజేహెచ్‌ఎస్, అమ్మఒడి తదితర ఆరోగ్య పథకాలను పలు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రశంసించడంతోపాటు వాటి స్ఫూర్తిగా పలు కార్యక్రమాలు అమలుచేస్తున్నాయి. ముఖ్యంగా సీఎం కేసీఆర్ ఆరోగ్యశ్రీని పటిష్ఠం చేసి యూనివర్సల్ హెల్త్ కవరేజీ విషయంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలిపారు. ఈ పథకం కింద 85.04 లక్షల కుటుంబాలకు ఆరోగ్య బీమా వర్తింపజేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో ఉచిత వైద్యం అందిస్తున్నారు. అవసరాన్ని బట్టి రూ.2లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వైద్యసేవలను అందిస్తున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.12లక్షల వరకు సాయం అందిస్తున్నారు. ఈ పథకం స్ఫూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం రూపకల్పనకు తెలంగాణ ప్రభుత్వం తోడ్పాటు అందించింది. సాఫ్ట్‌వేర్‌తోపాటు ఇతర సాంకేతిక సహకారం అందించింది.

మేఘాలయ బొగ్గు గనిలో
కార్మికుని మృతదేహం గుర్తింపు

వైద్యుల పర్యవేక్షణలో వెలికితీతకు ప్రయత్నాలు




గనిలో చిక్కుకున్న కార్మికుడి మృతదేహం ఫొటోలను పరిశీలిస్తున్న నౌకాదళ డైవర్లు

న్యూఢిల్లీ/షిల్లాంగ్, జనవరి 17: మేఘాలయ బొగ్గు గనిలో చిక్కుకుపోయిన 15 మంది కార్మికుల్లో ఓ కార్మికుని మృతదేహాన్ని నౌకాదళ డైవర్లు గురువారం గుర్తించారు. తూర్పు జయంతియా జిల్లా ర్యాట్-హోల్ మైన్‌లో దాదాపు 160-210 అడుగుల లోతున అండర్‌వాటర్ ఆర్వోవీ (రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్) సాయంతో ఈ మృతదేహాన్ని గుర్తించామని నౌకాదళ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ ఆపరేషన్ వీడియోను ఆయన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. దాదాపు 370 అడుగుల లోతున్న ర్యాట్-హోల్ మైన్ ముఖద్వారం వరకు తీసుకొచ్చిన ఈ మృతదేహాన్ని వైద్యుల పర్యవేక్షణలో వెలికితీస్తామని, దీన్ని సురక్షితంగా ఎలా వెలికితీయాలో సహాయ సిబ్బందికి సూచించేందుకు వైద్యుల బృందం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నదని అధికారులు తెలిపారు. గత నెల 13న ఈ గనిలోకి అక్రమంగా ప్రవేశించిన 15 మంది కార్మికులు వరద నీటి మధ్య అక్కడే చిక్కుకున్న విషయం తెలిసిందే. వీరి కోసం నౌకాదళం, ఎన్డీఆర్ఎఫ్, వాయుసేన సిబ్బంది సహా అనేక సంస్థలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

లోక్‌పాల్ నియామకమెప్పుడు?


- కేంద్రంపై సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి
- అభ్యర్థుల పేర్లను సిఫార్సు చేయాలంటూ సెర్చ్ కమిటీకి ఆదేశం
- ఫిబ్రవరి నెలాఖరు వరకు జాబితా సమర్పించాలంటూ గడువు



న్యూఢిల్లీ, జనవరి 17: లోక్‌పాల్ నియామకంలో జాప్యంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. లోక్‌పాల్ నియామకానికి అభ్యర్థుల పేర్లను సిఫార్సు చేయాలని సెర్చ్ కమిటీని ఆదేశించింది. ఈ జాబితాను సమర్పించేందుకు ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు విధిస్తున్నట్లు ప్రకటించింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని జస్టిస్ ఎల్ఎన్ రావు, జస్టిస్ ఎస్కే కౌల్ ధర్మాసనం ఈ మేరకు గురువారం కేంద్రానికి గడువు విధించింది. సెర్చ్ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వం వహిస్తున్నారు. లోక్‌పాల్ సభ్యుల ఎంపిక బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చేందుకు వీలుగా సెర్చ్ కమిటీకి తగిన సిబ్బంది, మౌలిక సౌకర్యాలను కల్పించాలని కేంద్రానికి సూచించింది. సరైన వసతులు లేకపోవడంతో సెర్చ్ కమిటీ కనీసం సమావేశం నిర్వహించేందుకు, సంప్రదింపులు జరిపేందుకు అవకాశం లేకుండాపోయిందని అసంతృప్తి వ్యక్తంచేసింది. తదుపరి విచారణ మార్చి 7న జరుగుతుందని ధర్మాసనం చెప్పింది. కేంద్రం తరుపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు. లోక్‌పాల్ సెర్చ్ కమిటీ ఏర్పాటు కోసం గత ఏడాది అక్టోబర్ నుంచి తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు జనవరి 4న కేంద్రాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. సెర్చ్ కమిటీ సభ్యుల పేర్లను సైతం ప్రభుత్వం ఇప్పటికీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదని ఆరోపిస్తూ కామన్‌కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. లోక్‌పాల్ నియామకాన్ని వెంటనే చేపట్టాలంటూ తన వ్యాజ్యంలో కేంద్రాన్ని కోరింది.

త్వరలో రైతులకు భారీ వరాలు

కేంద్ర వ్యవసాయ మంత్రి వెల్లడి ■ ఆర్థిక ప్యాకేజీ, వడ్డీ మాఫీ ఉండవచ్చని అంచనా



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతు సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే భారీ ఉపశమన చర్యలను చేపట్టనున్నామని కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్‌సింగ్ గురువారం చెప్పారు. చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న 'ఆదాయ లోటు రుగ్మత'ను పరిష్కారానికి తమ శాఖ ఒక క్యాబినెట్ నోట్‌ను రూపొందించిందన్నారు. రైతులకు ఆర్థిక ప్యాకేజీ, నిర్ణీత వ్యవధిలో రుణాలు చెల్లించే రైతులకు వడ్డీ మాఫీ వంటి చర్యలను ఆ పత్రంలో చేర్చామన్నారు. పీఎంవో, నీతి ఆయోగ్, వ్యవసాయ, ఆర్థిక శాఖ కార్యాలయాల అధికారులతో పలు దఫాలు సమావేశమై ఓ ముసాయిదా నోట్‌ను వ్యవసాయ శాఖ సిద్ధం చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. రైతుల కోసం భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించనున్నారా అని విలేకరులు ప్రశ్నించగా, ప్రతి ఏటా బడ్జెట్‌కు ముందు లేదా బడ్జెట్ సమావేశాల సందర్భంగా రైతుల కోసం కొత్తగా ఏదో ఒకటి ప్రకటిస్తున్నామని, ఈసారి కూడా అదే జరుగుతుందన్నారు. మంత్రి పక్కనే ఉన్న వ్యవసాయ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్.. ఈ అంశం తమ మంత్రిత్వ శాఖ పరిధిలో లేదని మరిన్ని వివరాలు తెలిపేందుకు నిరాకరించారు. అంతకుముందు రైతుల సంబంధిత రజతోత్సవ కార్యక్రమంలో మంత్రి రాధామోహన్‌సింగ్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వానికి వ్యవసాయం ఎప్పుడూ ప్రాధాన్య అంశమేనని, రైతుల సంక్షేమం పట్ల పూర్తి నిబద్ధతతో ఉన్నామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి అన్ని వ్యవసాయ క్షేత్రాలకు నీరు, విద్యుత్ అందుతాయన్నారు.

డ్యాన్స్‌బార్లపై నిషేధం రద్దు

- మహారాష్ట్రలో షరతులతో అనుమతించిన సుప్రీంకోర్టు
- సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వ్యక్తిగత గోప్యతకు వ్యతిరేకమని వ్యాఖ్య
- తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన బార్ గర్ల్స్ యూనియన్



న్యూఢిల్లీ, జనవరి 17: మహారాష్ట్రలో డ్యాన్స్ బార్ల పునఃప్రారంభానికి సుప్రీంకోర్టు మార్గం సుగమం చేసింది. డ్యాన్స్ బార్ల లైసెన్సు విధానం, వాటి పనితీరుపై ఆంక్షలు విధిస్తూ 2016లో మహారాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఓ చట్టంలోని కొన్ని నిబంధనలను రద్దు చేసిన సుప్రీంకోర్టు 'నిబంధనలు ఉండవచ్చు కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపూర్ణ నిషేధం విధించరాదు' అని వ్యాఖ్యానించింది. డ్యాన్స్ బార్ల నిర్వహణకు లైసెన్సులు జారీ చేయాలని ఆదేశించిన న్యాయస్థానం వాటిని పాఠశాలలు, ప్రార్థనా స్థలాలకు కిలోమీటరు దూరంగా ఏర్పాటు చేయాలన్న నిబంధనను తోసిపుచ్చింది. జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ మేరకు తన తీర్పును ప్రకటిస్తూ, బార్లలో డ్యాన్స్ చేసే వారికి టిప్ (నగదు బహుమతి) ఇవ్వవచ్చు కానీ వారిపైకి నోట్లు లేదా చిల్లర విసర రాదని స్పష్టం చేసింది. 'హోటళ్లు, రెస్టారెంట్లు, బార్ రూమ్‌లలో అసభ్య నృత్యాలపై నిషేధం, మహిళల గౌరవ (పని ప్రదేశాలలో) పరిరక్షణ మహారాష్ట్ర చట్టం, 2016' లోని పలు నిబంధనలను కోర్టు కొట్టివేసింది. డ్యాన్స్ బార్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని పేర్కొంటూ ఆ నిబంధనను కోర్టు రద్దు చేసింది. డ్యాన్స్ బార్లను సాయంత్రం ఆరు నుంచి రాత్రి 11.30 గంటల వరకే తెరిచి ఉంచాలన్న నిబంధనను మాత్రం న్యాయస్థానం సమర్థించింది. 2005 నుంచి ఇంతవరకు ఒక్క డ్యాన్స్‌బ్యార్ లైసెన్సును కూడా జారీ చేయలేదని గుర్తుచేసిన ధర్మాసనం నిబంధనల పేరిట నిషేధం విధించరాదని తెలిపింది. విద్యాసంస్థలు, ప్రార్థనా స్థలాలకు కిలోమీటరు దూరంలో డ్యాన్స్ బార్లను ఏర్పాటు చేయాలన్న నిబంధన రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. బార్‌రూమ్‌లను, డ్యాన్స్ ఫ్లోర్‌ను వేరు చేయాలన్న నిబంధనను కూడా కోర్టు కొట్టివేసింది. డ్యాన్స్ బార్లపై పలు ఆంక్షలు విధిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం 2016లో చేసిన చట్టాన్ని సవాలు చేస్తూ పలువురు హోటల్, రెస్టారెంట్ల యజమానులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు గత ఏడాది ఆగస్టులో తన తీర్పును రిజర్వులో ఉంచింది. డ్యాన్స్ బార్లకు అనుకూలంగా అంతకుముందు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వమ్ము చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కొత్త చట్టం ద్వారా ప్రయత్నించిందని పిటిషనర్లు ఆరోపించారు.

సామాజిక కార్యకర్తల హర్షం

మహారాష్ట్రలో డ్యాన్స్ బార్ల పునఃప్రారంభానికి అనుమతినిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పలువురు సామాజిక కార్యకర్తలు స్వాగతించారు. కోర్టు తీర్పు తమకు లభించిన గొప్ప విజయమని భారతీయ బార్ గర్ల్స్ యూనియన్ అధ్యక్షురాలు వర్షా కాలే పేర్కొన్నారు. ఈ కేసును ఇంతకుముందు కోర్టుల్లో పలుమార్లు గెలిచామని, కానీ ఇది అతిపెద్ద విజయమని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మంది డ్యాన్సర్లు హోటళ్లలో వెయిటర్లుగా, గాయకులుగా మారిపోయారని, ఇప్పుడు కోర్టు తీర్పుతో వారంతా తిరిగి తమ పూర్వ వృత్తిని చేపడుతారని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం 2005లో డ్యాన్స్ బార్లను మూసివేసినప్పుడు వాటిలో 75వేల మందికి పైగా మహిళలు డ్యాన్సర్లుగా పనిచేస్తున్నారని చెప్పారు. కోర్టు తీర్పును 'ప్రగతిశీలమైనది'గా అభాసింగ్ అనే సామాజిక కార్యకర్త పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మొదటి నుంచి నృత్యాన్ని ఒక వృత్తిగానే పరిగణించిందని, కానీ ప్రభుత్వమే మహిళల ప్రాథమిక హక్కును ఏకపక్షంగా అణచివేసిందని విమర్శించారు. మహిళల గౌరవం విషయంలో అంతగా చింతించే ప్రభుత్వం ముంబైలో బహిరంగంగా సాగుతున్న వ్యభిచారం విషయంలో ఎందుకు కండ్లు మూసుకుందని ప్రశ్నించారు.

మాయావతితో జాగ్రత్త

- అఖిలేశ్ యాదవ్‌ను హెచ్చరించిన బాబాయి శివ్‌పాల్
- ఆమె గతంలో ఎస్పీ అగ్రనేతలను ఇష్టమొచ్చినట్లు తిట్టారని వ్యాఖ్య



ఛందౌలి, జనవరి 17: బహుజన్ సమాజ్ వాదీ(బీఎస్పీ) పార్టీ అధ్యక్షురాలు మాయావతితో చాలా జాగ్రత్తగా ఉండాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌కు ఆయన బాబాయి శివ్‌పాల్ యాదవ్ సూచించారు. 1995లో ఎస్పీ ప్రభుత్వానికి బీఎస్పీ మద్దతు ఉపసంహరించిన తర్వాత జరిగిన పరిణామాలను గుర్తుకు తెచ్చుకోవాలని హెచ్చరించారు. గురువారం ఆయన చందౌలిలో జరిగిన సభలో మాట్లాడుతూ 'నాడు బీఎస్పీ మద్దతు ఉపసంహరించడంతో ఎస్పీ ప్రభుత్వం పడిపోయింది. దీంతో ఆగ్రహానికి గురైన ఎస్పీ కార్యకర్తలు లక్నోలోని మాయావతి గెస్ట్‌హౌస్‌పై దాడి చేశారు. దీనిని నిరసిస్తూ మాయావతి అప్పటి ఎస్పీ అధ్యక్షుడు ములాయం సింగ్‌పైనా, నాపైనా, పలువురు ఎస్పీ నాయకులపైనా తీవ్రమైన ఆరోపణలు చేశారు. నేను ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డానని ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఎలాంటి విచారణను ఎదుర్కోవడానికైనా సిద్ధమేనని, నార్కో పరీక్ష కూడా చేసుకోవచ్చని నేను అప్పుడే చెప్పాను. అంతేకాదు.. మాయావతి కూడా నార్కో పరీక్షకు సిద్ధపడాలని సూచించాను. ములాయంసింగ్‌ను కూడా ఆమె గుండా అని తిట్టారు. కానీ, ఇవ్వన్నీ మరిచిపోయి ఇప్పుడు బీఎస్పీతో ఎలా పొత్తు పెట్టుకున్నారు? మాయావతిని ఎలా నమ్మారు?' అని పేర్కొన్నారు. ములాయం సింగ్ సోదరుడైన శివ్‌పాల్ అఖిలేశ్‌తో విభేదించి ఎస్పీ నుంచి సొంత పార్టీ ప్రగతిశీల్ సమాజ్‌వాదీ పార్టీ లోహియాను స్థాపించారు.

యువత ఆశయాల సాధనకు కట్టుబడి ఉన్నాం: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 17: దేశ యువత ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి వంద శాతం కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ చెప్పారు. కేంద్రంలో మళ్లీ బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ఆ పార్టీ యువజన విభాగం భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ప్రచారోద్యమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో గురువారం ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ 'త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడానికి యువతను సంఘటితం చేయడం కోసం మీరు చేస్తున్న ప్రయత్నాన్ని మెచ్చుకుంటున్నా. యువత ఆశయాలు, ఆకాంక్షలు, కలలను నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నా. నమో యువ' అని పేర్కొన్నారు. 'మోదీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే మన లక్ష్యం' అనే నినాదంతో వివిధ కార్యక్రమాల ద్వారా యువ ఓటర్లకు చేరువకావడానికి బీజేవైఎం ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారోద్యమానికి 'విజయ్ లక్ష్ 2019' అని పేరు పెట్టారు.

వారిపై వారికే అదుపు లేదు

ఎన్డీయే సర్కార్ విమర్శకులపై జైట్లీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వాన్ని విమర్శించేవారు 'అదుపులోలేని వ్యతిరేకులు' అని, ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాన్ని బలహీనపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆరోపించారు. వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్లిన జైట్లీ ఫేస్‌బుక్‌లో గురువారం పలు వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యం, అసమ్మతి తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైన అంశాలు తప్ప అసత్యాలు, అణచివేత, సంస్థాగత విధ్వంసం కావన్నారు. 'ఈ ప్రభుత్వం ఏ ఒక్క మంచి పని చేయలేదు' అనుకొనేవారిపై ఆయన తన దాడిని ఎక్కుపెడుతూ, సానుకూల దృక్పథం ఉన్నవారితోనే దేశాలు అభివృద్ధి చెందుతాయని, ఇలాంటి స్వీయ అదుపులేని వ్యతిరేకులతో కాదని మండిపడ్డారు.

కర్ణాటకలో అనిశ్చితికి తెర!

- బెంగళూరుకు చేరిన 'హస్తం' ఎమ్మెల్యేలు
- నేడు కాంగ్రెస్ బల ప్రదర్శనగా సీఎల్పీ భేటీ

బెంగళూరు, జనవరి 17: కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సద్దుమణుగుతున్నట్లు తెలుస్తున్నది. శుక్రవారం కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు పలువురు బెంగళూరుకు చేరుకున్నారు. పార్టీకి విధేయులమని ప్రకటించారు. దీంతో హెచ్‌డీ కుమారస్వామి సారథ్యంలోని జేడీఎస్-కాంగ్రెస్ కూటమి సర్కార్‌కు పొంచి ఉన్న ముప్పు తొలిగినట్లేనని భావిస్తున్నారు. పార్టీలో అసమ్మతి పెరిగిపోతున్నదన్న వార్తల నేపథ్యంలో పరిస్థితులను చక్కదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు ఢిల్లీ నుంచి బెంగళూరుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీఎస్ యెడ్యూరప్ప.. ప్రభుత్వాన్ని కూల్చేందుకు తాము ప్రయత్నించడం లేదని పేర్కొన్నారు. కొద్ది రోజులుగా గుర్‌గ్రామ్‌లోని రిసార్టులో బస చేసిన బీజేపీ ఎమ్మెల్యేలు కూడా బెంగళూరుకు చేరుకున్నారు. తన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బీజేపీ నిరర్థక ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు గుర్‌గ్రామ్‌లో క్యాంప్ రాజకీయాలు నడిపిందన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు తాను ప్రయత్నించానన్న ఆరోపణలను కుమారస్వామి తోసిపుచ్చారు. బీజేపీ చేయాల్సిందంతా చేస్తూ తమపై ఎదురుదాడికి దిగుతున్నదని ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ తన బల ప్రదర్శనకు సీఎల్పీ భేటీని వేదికగా మార్చుకోనున్నది. తద్వారా జేడీఎస్- కాంగ్రెస్ సంకీర్ణకూటమిని కూలదోసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించబోవన్న సంకేతాలివ్వనున్నది. శుక్రవారం జరిగే సీఎల్పీ భేటీకి సభ్యుల గైర్హాజరును తీవ్రంగా పరిగణిస్తామని ఎమ్మెల్యేలకు పంపిన నోటీసులో సీఎల్పీ నేత సిద్దరామయ్య పేర్కొన్నారు.

పాఠశాలల్లో ఐఐటీలతో బోధన

విద్యార్థుల్లో పరిశోధనా ధోరణిని పెంచేందుకు వినూత్న చర్యలు చేపడుతున్న కేంద్రప్రభుత్వం



'వైబ్రెంట్ గుజరాత్' ప్రోలో ఓ స్టాల్‌ను సందర్శించిన ప్రధాని మోదీ, మీడియాతో మాట్లాడుతున్న జవదేకర్

అహ్మదాబాద్, జనవరి 17: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పరిశోధనా ధోరణిని పెంపొందించేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగా గణితం, సైన్స్ లాంటి ముఖ్యమైన సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడకుండా ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ)లు, ఐఐఎస్ఈఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్)లు, యూనివర్సిటీల్లాంటి ఉన్నత విద్యా సంస్థలతో వాటికి సమీపంలోని 10-15 పాఠశాలల్లో బోధన జరిపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్చార్డీ) మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. 'వైబ్రెంట్ గుజరాత్' అంతర్జాతీయ సదస్సులో భాగంగా అహ్మదాబాద్‌లోని సైన్స్ సిటీలో ఖగోళ అన్వేషణపై అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ వారు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌తోపాటు భవిష్యత్ టెక్నాలజీపై ఏర్పాటు చేసిన మరో ఎగ్జిబిషన్‌ను గురువారం ప్రారంభించారు. తర్వాత జవదేకర్ విలేకరులతో మాట్లాడుతూ.. 21వ శతాబ్దిలో గణితం, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ లాంటి సబ్జెక్టులకు గల ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రాథమిక పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో పరిశోధనాత్మక ధోరణిని పెంపొందించాల్సిన అవసరం ఉన్నదన్నారు. విజ్ఞానశాస్త్రాన్ని, గణితాన్ని వినోదాత్మక రీతిలో బోధించవచ్చని, వీటిని విద్యార్థులకు అవగతమయ్యేలా బోధించేందుకు పెద్దపెద్ద పరికరాలేమీ అవసరంలేదని, చిన్నపాటి మెళకువలు పాటిస్తే సరిపోతుందన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర పోషించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో గణితం, సైన్స్ సబ్జెక్టుల పట్ల మక్కువను పెంపొందించేందుకు సరైన శిక్షణ అవసరమని, ఈ రెండు సబ్జెక్టుల్లో విద్యార్థులు దేనిలో వెనుకబడినా ఆ అంతరం పెరుగుతుందని, అంతిమంగా వారు మరింత వెనుకబడతారని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

ఆరోగ్య ప్రపంచం

- 20 ఏండ్లలో గణనీయమైన మార్పు వచ్చింది
- ఐదేండ్లలోపు శిశు మరణాల సంఖ్య 50శాతం తగ్గింది
- ఆర్థికాభివృద్ధి కారణంగా ఆరోగ్య రంగంలో భారత్ పైకి ఎగబాకింది
- బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మెలిండా గేట్స్ వెల్లడి



మెలిండా గేట్స్, బిల్ గేట్స్

వాషింగ్టన్: ప్రపంచం గత 20 ఏండ్లలో ఎంతో నాటకీయంగా ఆరోగ్యంగా మారిందని అమెరికాకు చెందిన ప్రముఖ దాత, మైక్రోసాఫ్ట్ సంస్థ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సతీమణి మెలిండాగేట్స్ వ్యాఖ్యానించారు. తమ ఆర్థికాభివృద్ధి కారణంగా భారత్, ఇండోనేషియా, వియత్నాం వంటి దేశాలు ఆరోగ్య సూచిలో పైకి ఎగబాకాయని ఆమె తెలిపారు. వాషింగ్టన్‌లో గురువారం జరిగిన ఒక ప్రపంచ సదస్సు సందర్భంగా ఆమె తన భర్త బిల్‌గేట్స్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలలో ప్రజల పరిస్థితులు ఎంతో మెరుగుపడ్డాయని చెప్పారు. అందుకే తమను తాము (బిల్-మెలిండా) ఆశాజీవులుగా చెప్పుకుంటామని అన్నారు. గత 20 ఏండ్లలో పేదల సంఖ్య తగ్గడమే కాకుండా, వారి ఆరోగ్యం కూడా ఎంతగానో మెరుగుపడిందని బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కూడా అయిన మెలిండా పేర్కొన్నారు. 1990 తరువాత ఐదేండ్లలోపు శిశువుల మరణాల రేటు 50 శాతం తగ్గిందని చెప్పారు. బిల్‌గేట్స్ మాట్లాడుతూ, తమ ఆర్థికాభివృద్ధి కారణంగా భారత్, ఇండోనేషియా, వియత్నాం దేశాలు ఆరోగ్య సూచిలో పైకి వెళ్లాయని, అందువల్ల వాటికి అందే నిధులు తగ్గుతాయని చెప్పారు. భారత్ ఎంతో పెద్ద దేశమైనప్పటికీ రోటావైరస్ వ్యాక్సిన్‌ను సమర్థవంతంగా ప్రజలకు అందించారని ప్రశంసించారు. అలాగే న్యూమోకాకస్ వ్యాక్సిన్‌ను భారత్‌లో అందజేయనున్నారని తెలిపారు. హెచ్ఐవీ, మలేరియా, మశూచి వంటి వ్యాధుల కారణంగా సంభవించే మరణాల సంఖ్య 1990 తరువాత సగానికి తగ్గిపోయిందని మెలిండా చెప్పారు.

రాకేశ్ ఆస్తానాపై వేటు

- మరో ముగ్గురు అధికారుల పదవీ కాలం తగ్గింపు
- 24న సీబీఐ కొత్త డైరెక్టర్ నియామకానికి అత్యున్నత కమిటీ భేటీ



న్యూఢిల్లీ, జనవరి 17: సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మకు ఉద్వాసన పలికిన ప్రధాని మోదీ నేతృత్వంలోని అత్యున్నత కమిటీ వారం రోజుల వ్యవధిలోనే స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాతోపాటు మరో ముగ్గురు అధికారుల పదవీ కాలాన్ని తగ్గించివేసింది. తన బాస్ అలోక్‌వర్మతో అసాధారణ రీతిలో ఘర్షణకు దిగిన ఆస్తానాను కేంద్ర ప్రభుత్వం గత అక్టోబర్‌లో నిర్బంధ సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆస్తానాతోపాటు సీబీఐ జాయింట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ శర్మ, డిప్యూటీ ఐజీ మనీశ్ కుమార్ సిన్హా, ఎస్పీ జయంత్ నాయక్‌నవారేలను వారి పదవీ కాలం ముగియడానికి ముందే సీబీఐ నుంచి తొలిగిస్తున్నట్టు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని అత్యున్నత కమిటీ సీబీఐకి కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేసేందుకు ఈ నెల 24న సమావేశం కానుంది. అరుణ్ కుమార్, మనీశ్ సిన్హాలు అలోక్‌వర్మకు సన్నిహితులు కావడంతో వారిపై కూడా వేటు పడినట్టు తెలుస్తున్నది. రాకేశ్ ఆస్తానాను ప్రభుత్వం పౌర విమానయానశాఖ భద్రతా విభాగానికి బదిలీ చేసినట్టు సమాచారం.

'ప్రైవేట్' రిజర్వేషన్ల కోసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు

న్యూఢిల్లీ, జనవరి 17: ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల్లోనూ రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ వచ్చేనెలలో ప్రారంభమయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధం అవుతున్నది. సదరు బిల్లు ప్రకారం వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లు ప్రైవేట్ విద్యాసంస్థల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంగళవారం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు అవసరమైన చట్టాన్ని తేవాల్సిన అవసరం ఉన్నదని సామాజిక న్యాయ నిపుణుడు పీఎస్ కృష్ణన్ పేర్కొన్నారు. ఈ మేరకు గతంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రులుగా పని చేసిన కపిల్ సిబల్, స్మృతి ఇరానీతోపాటు ప్రస్తుత మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు లేఖ రాసినట్లు పీఎస్ కృష్ణన్ పేర్కొన్నారు.

జర్నలిస్టు హత్య కేసులో డేరా బాబాకు జీవిత ఖైదు



- మరో ముగ్గురికి కూడా
- 16 ఏండ్ల కిందటి కేసులో తీర్పు వెలువరించిన సీబీఐ కోర్టు

పంచకుల(హర్యానా), జనవరి 17: దాదాపు 16 ఏండ్ల కిందట జరిగిన ఒక జర్నలిస్టు హత్య కేసులో హర్యానాలోని డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీం సింగ్‌తోపాటు మరో ముగ్గురికి పంచకులలోని సీబీఐ కోర్టు జీవిత కారాగార శిక్ష విధించింది. డేరా సచ్చా సౌదా ప్రాంగణంలో మహిళలు ఏ విధంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నదానిపై ఓ మహిళ రాసిన లేఖను జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతి గతంలో తన పత్రికలో ప్రచురించారు. దీంతో ఆయనను 2002లో కొందరు దుండగులు హత్య చేశారు. అనంతరం ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ రాంచందర్ కుటుంబసభ్యులు పంజాబ్, హర్యానా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిపిన న్యాయస్థానం కేసును సీబీఐకి అప్పగించింది. అనంతరం సీబీఐ దర్యాప్తును ముగించింది. ఈ కేసును విచారిస్తున్న పంచకులలోని సీబీఐ కోర్టు గత శుక్రవారం గుర్మీత్‌తోపాటు నిర్మల్ సింగ్, కుల్‌దీప్ సింగ్, క్రిషన్ లాల్‌ను దోషులుగా ప్రకటించింది. గురువారం వీరికి శిక్షలను ఖరారు చేసింది. లైంగికదాడి కేసులో గుర్మీత్ ఇప్పటికే 20 ఏండ్ల జైలు శిక్షను అనుభవిస్తున్నాడు.



మేం గోవాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించాం.
మేం ఎవరికీ ద్రోహం చేయడం లేదు. బీజేపీ లేదా కాంగ్రెస్‌లకు భయపడటం లేదు.
పార్టీ మారటాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం.
గోవా చిన్న రాష్ట్రం. ఇక్కడ నిరంతరం పార్టీలు మారటం ఉండరాదు.

దీపక్ దావల్‌కర్, గోమంతక్ పార్టీ అధ్యక్షుడు

న్యూ ఢిల్లీకి దగ్గరలోని విలాసవంతమైన రిసార్ట్‌లో సెలవు రోజులు గడిపిన తర్వాత ఇంటికి వచ్చిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యేలందరికీ హృదయపూర్వక స్వాగతం. ఇప్పుడు వారు చాలాకాలంగా నిర్లక్ష్యం చేసిన వారి నియోజవర్గాలకు వెళ్లి వాటి అభివృద్ధికి పాటుపడుతారని ఆశిద్దాం.

దినేష్ గుండురావ్, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు



చరిత్రలో నేడు



1960

ఉమ్మడి రక్షణ ఒప్పందంపై సంతకం చేసిన అమెరికా, జపాన్.

2015



వన్డేల్లో 31 బంతుల్లోనే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ డివిలియర్స్.

2017



2016 అత్యంత అధికంగా ఉష్ణోగ్రత ఉన్న సంవత్సరంగా ప్రకటించిన నాస, నోవా.

కర్ణాటకలో జేడీ(ఎస్)-కాంగ్రెస్ కూటమి అధికారపక్షంలో మరో కుదుపు చోటుచేసుకున్నది. అధికారపక్షం నుంచి 10 నుంచి 13 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయనున్నారనే వార్తల నేపథ్యంలో ప్రతిపక్ష బీజేపీ తనదైన శైలిలో పావులు కదుపుతున్నది. తన ఎమ్మెల్యేలను గుర్‌గాంలో క్యాంపులో దాచిపెట్టి అధికారపక్షం కంటే సంఖ్యాబలంలో పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నది. సాధారణ ఎన్నికలు రాబోతున్న వేళ అధికారపక్షం అస్థిరత్వం పాలు కావటాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే దిశగా అడుగులు వేయటం గమనార్హం.

ది హిందూ

కన్నయకుమార్, ఉమర్ ఖలీద్‌లపై దేశ ద్రోహ నేరారోపణ కేసులో విచారణకు పోలీసులు చార్జిషీటు దాఖలు చేయటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఉద్యమకారులను జైలులో నిర్బంధించేందుకు బ్రిటిష్ పాలకులు ఉపయోగించిన నల్ల చట్టాన్ని విద్యార్థి నేతలపై వినియోగించటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం విద్యార్థినేతలపై రాజద్రోహం, కుట్ర పేరుతో కేసులు పెట్టి రాజకీయాలు చేస్తున్నదనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

మారని చదువులు

'ప్రథమ్' సంస్థ ఏటా వెల్లడిస్తున్న విద్యాస్థితి నివేదిక క్షేత్రస్థాయి వాస్తవాలకు నిలువుటద్దంగా నిలిచింది. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెరిగిన తీరు కొంత ఊరట కలిగించింది. అయితే విద్యా ప్రమాణాల విషయంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నది. పదాలు, వాక్యాలు చదువగలిగే విద్యార్థుల సంఖ్య గతంలో కన్నా మరింత తగ్గిందని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(అసర్) వెల్లడించింది. దేశవ్యాప్తంగా 596 జిల్లాల్లోని మూడు నుంచి పదహారేండ్ల వయసున్న ఐదు లక్షలకు పైగా విద్యార్థులపై విద్యా ప్రమాణాల విషయంలో చేసిన అధ్యయనంలో తేలిన ఈ చేదు నిజాలు మన విద్యా వ్యవస్థ దురవస్థను చాటి చెబుతున్నది. 2007తో పోలిస్తే బడిలో చేరని పిల్లల సంఖ్య మూడు శాతం తగ్గింది. కానీ విద్యా ప్రమాణాల్లో మాత్రం 2.8 శాతం పడిపోవటం దిగ్భ్రాంతికరం. అసర్ అధ్యయనం ప్రకారం- ఐదవ తరగతి విద్యార్థుల్లో రెండవ తరగతి స్థాయి పాఠ్యాంశాలు చదువగలిగే విద్యార్థులు 2016లో 47.1 శాతం ఉంటే, 2018 నాటికి అది 43.6 శాతానికి పడిపోయింది. 8వ తరగతి విద్యార్థుల్లో 76.1 శాతం నుంచి 69.5 శాతానికి పడిపోవటం ఆందోళన కలిగించేదే. మెరుగైన విద్యా ప్రమాణాలకు ఉపాధ్యాయుల నియామకమే కీలకం. కానీ దేశవ్యాప్తంగా ఉన్న 13 లక్షల పాఠశాలల్లో 10.3 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే లోపం ఎక్కడ ఉన్నదో తెలుస్తున్నది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, వారి పని విధానం కారణంగానే పల్లె నుంచి పట్టణాల దాకా ప్రాథమిక స్థాయిలో పిల్లల చదువుల కోసం తల్లిదండ్రుల ప్రైవేట్ బాట పడుతున్నారు. తాజా అసర్ అధ్యయనం ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చదువులో మెరుగైన స్థితిలో ఉండటం గమనార్హం.

అందరికీ విద్య లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయి. ప్రత్యేక కార్యాచరణలతో విద్యావ్యాప్తికి కృషిచేస్తున్నాయి. అయితే ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలంటే పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఒకే బడి విధానం అవసరమని కొఠారీ కమిషన్ సూచించింది. కామన్ స్కూల్ విధానంతోనే విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులకు అవకాశముంటుందని విద్యావేత్తలు ఎప్పటినుంచో చెబుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోంచే అలహాబాద్ హైకోర్టు నిర్దేశాలు గమనించదగ్గవి.

అసర్ రిపోర్టు వెలువడిన రెండు మూడు రోజులు దేశవ్యాప్తంగా చదువుల స్థితిగతులపై చర్చ జరుగటం, ఆ తర్వాత ఆ విషయాన్ని మర్చిపోవటం పరిపాటి అయ్యింది. గత కొన్నేండ్లుగా ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఏటా పాఠశాల విద్యపై అధ్యయన రిపోర్టును వెలువరిస్తూ విద్యా ప్రమాణాల్లో ఉన్న దీన స్థితిని చెబుతూనే ఉన్నది. ఏడెనిమిది తరగతుల విద్యార్థులు సైతం కనీస కూడికలు, తీసివేత లెక్కలు చేయలేని దుస్థితిని చెబుతూనే ఉన్నది. అక్షరాలను గుర్తించి చదువలేని స్థితిని చూపుతూ మన చదువుల దీన హీన స్థితిని గురించి హెచ్చరిస్తూనే ఉన్నది. అయినా విద్యాప్రమాణాల్లో గుణాత్మక మార్పుల్లో అడుగు ముందుకు పడటం లేదు. మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవటం, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాల నెపంతో అసలు సమస్యను దాటవేసే ధోరణి సాగిపోతున్నది. మన దేశీయ సంప్రదాయ విద్యా క్రమాన్ని, ప్రైవేట్ విద్యాసంస్థల తీరుతెన్నులను చూస్తే, విద్యాప్రమాణాలకు మౌలిక వసతులు, సమస్యలు అసలు అవరోధాలే కావని తేటతెల్లమవుతుంది. విద్యా విషయ సమస్య అంతా చదువులు చెప్పే బోధకుల్లోని నిబద్ధతలో ఉన్నది. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లటానికి ఉపాధ్యాయుల తీరు తెన్నులే కారణమని అనేక అధ్యయనాలు చెప్పాయి. పనిచేసే చోటనే ఉండకపోవటం, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపటం లాంటి చర్యలతో ప్రజలకు ప్రభుత్వ బడులపై పూర్తిగా విశ్వాసం సన్నగిల్లింది. తాజా నివేదికలో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల్లోనే కన్నా ప్రభుత్వ బడుల్లోనే విద్యాప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని తేలింది.

అందరికీ విద్య లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయి. ప్రత్యేక కార్యాచరణలతో విద్యావ్యాప్తికి కృషిచేస్తున్నాయి. అయితే ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలంటే పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఒకే బడి విధానం అవసరమని కొఠారీ కమిషన్ సూచించింది. కామన్ స్కూల్ విధానంతోనే విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులకు అవకాశముంటుందని విద్యావేత్తలు ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోంచే అలహాబాద్ హైకోర్టు నిర్దేశాలు గమనించదగ్గవి. ప్రభుత్వ ఖజానా నుంచి ఆర్థిక ప్రయోజనాలు పొందే ప్రతి ఒక్కరూ అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా తమ పిల్లల్ని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరించేవారు ప్రైవేట్ పాఠశాలలకు ఫీజుల రూపంలో ఎంత మొత్తం చెల్లిస్తారో, అంతే మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేయాలి. ఆ మొత్తాన్ని ప్రభుత్వ బడుల్లో చేరిన పిల్లల మౌలిక అవసరాల కల్పనకు ఖర్చు చేయాలని అలహాబాద్ హైకోర్టు సూచించటం గమనించదగ్గది. సరిగ్గా ఈ స్ఫూర్తికి అనుగుణంగానే తెలంగాణ ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్యతో పాటు, సంక్షేమ హాస్టళ్లన్నింటిలో మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నది. అన్నివర్గాల ప్రజలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నది. అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ విద్యాప్రమాణాల విషయంలో కూడా ఆదర్శంగా నిలిచే దిశగా అడుగులు వేస్తున్నది. తాజా అసర్ రిపోర్టు చూసిన తర్వాతనైనా సమాజంలో చలనం రావాలి. మెరుగైన విద్యా ప్రమాణాల కోసం దేశవ్యాప్తంగా ఒక ఉద్యమంగానే ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగాలి.

జనగళం

నిర్మాణాత్మకంగా వ్యవహరించాలె

ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ జరుగాలి. ఇందుకు అధికార, ప్రతిపక్షాలు కలిసి సమగ్రంగా చర్చించాలి. గతంలో లాగా ప్రతిపక్షాలు సభా కార్యక్రమాలను అడ్డుకోకుండా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. రాష్ట్రాభివృద్ధి కోసం అధికార పార్టీ ఏం చేయాలో తగిన సలహాలు అందించాలి. అంతేకాదు రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి. అప్పుడే ప్రజల మన్ననలు పొందగలుగుతారు. అంతేగానీ ప్రతిపక్షం కనుక కేవలం విమర్శలే చేస్తామనే విధంగా వ్యవహరించకూడదు. రాష్ట్ర ప్రజలు కూడా ప్రతిపక్షాలు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నారు. వారి ఆక్షాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీ సమావేశాల్లో తన వంతు పాత్ర పోషించాలి.

- నోముల ప్రవీణ్‌కుమార్, నల్గొండ

ప్రయాణ భారాలు తగ్గించాలె

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ సాధించే లక్ష్యంతో పనిచేస్తున్నది. ఇప్పటికే కంటి వెలుగు కార్యక్రమం విజయవంతమైంది. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఊరట కలుగుతుంది. ఎందుకంటే ఏ చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా ప్రజలు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించాల్సి వస్తున్నది. అక్కడ వారు వేసే బిల్లుల గురించి చెప్పనక్కరలేదు. కాబట్టి ఈ పరీక్షలు పేద, మధ్య తరగతి ప్రజలకు చాలా మేలు చేస్తాయి. కంటివెలుగు ద్వారా అద్దాలు అవసరమున్న వారికి ప్రభుత్వమే రూపాయి ఖర్చులేకుండా అందజేసింది. త్వరలో చేయబోయే పరీక్షల ద్వారా ఆయా రంగాల్లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేస్తారు. కాబట్టి ఏవైనా చిన్న సమస్యలుంటే అక్కడే చికిత్సతో పాటు అవసరమైన మందులు కూడా ఇస్తారు. దీంతోపాటు పెద్ద సమస్యలు ఉంటే సమీపంలోని పెద్ద దవాఖానకు తీసుకెళ్లనున్నారు. ఆరోగ్య తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ కార్యక్రమాలు అభినందనీయం.

- అక్షరకుమార్, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



ఇలపావులూరి మురళీ మోహనరావు

జాతీయస్థాయిలో ఫ్రంట్ ప్రభావం

తెలంగాణలో ఇరువై లక్షల మందికి పైగా సీమాంధ్రులు సుఖంగా జీవిస్తున్నారు. తాము పరాయి రాష్ట్రంలో ఉన్నామన్న భావనే వారికి కలుగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల మధ్య సఖ్యత, పరస్పర సహకారం ఎంతో అవసరం. నీటి పంపకాలు, కరెంట్ వినియోగం, వస్తు సేవలు, సరఫరాలు మొదలైన రంగాల్లో రెండు రాష్ట్రాలు ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ అన్యోన్యంగా ఉండాలి. అలాగే ఇద్దరూ కలిసి జాతీయస్థాయిలో పోరాడి ప్రయోజనాలు సాధించుకోవాలి.

జాతీయస్థాయిలో ఎన్డీయే, యూపీఏ కూటములకు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్‌ను నిర్మిస్తామని చాలాకాలం కిందట తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఆ మేరకు కొందరు ప్రాంతీయ పార్టీల నాయకులతో చర్చలు జరిపారు. ఈ లోపలే తెలంగాణకు ముందస్తు ఎన్నికలు ప్రకటించడంతో ఆ ఎన్నికల హడావుడిలో కొద్దికాలం ఫెడరల్ ఫ్రంట్ ముచ్చట రాలేదు. కానీ, ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రచండ సూర్యతేజంతో ఘనాతిఘన విజయాన్ని సాధించిన తర్వాత మళ్లీ ఫెడరల్ ఫ్రంట్ కొత్త ఊపిరి పోసుకున్నది. తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతను కేటీఆర్‌కు అప్పగించి, ఫ్రంట్‌కు ప్రాణం పోసే అశ్వమేధ యాగానికి శ్రీకారం చుట్టారు కేసీఆర్. ఇప్పటికే ఆయన డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, ఆప్, జేడీఎస్ లాంటి పార్టీలతో చర్చలు జరిపి వారి మద్దతును కూడగట్టగలిగారు.

ఇక పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అత్యంత బలమైన పార్టీ, ప్రతిపక్ష పార్టీ అయిన వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డితో కేసీఆర్ తరపున కేటీఆర్ తన బృందంతో కలిసి చర్చలు సాగించారు. కేటీఆర్ బృందానికి ఆత్మీయ స్వాగతం పలికి వైసీపీ నేతలు సుమారు గంటన్నర పాటు కేటీఆర్‌తో మంతనాలు సాగించారు. జాతీయస్థాయిలో రెండు పార్టీలు కలిసి పనిచేయాలని ఒక నిర్ణయానికి రావడం శుభపరిణామంగా చెప్పుకోవచ్చు. ఇద్దరూ కలిసి సంయుక్తంగా మీడియా ముందు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రావడం కోసం తాము మద్దతు ఇస్తామని, ఇప్పటికే తమ ఫ్లోర్ లీడర్స్ పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారని, తమ పార్టీ ఎంపీ కవిత కూడా ప్రత్యేక హోదాపై మద్దతును తెలియజేశారని, త్వరలో తమ పార్టీ అధినేత కేసీఆర్ అమరావతి వెళ్లి జగన్‌తో చర్చలు కొనసాగిస్తారని ఈ సందర్భంగా కేటీఆర్ తెలియజేయడం రెండు రాష్ట్రాల మధ్య సుహృద్భావపూర్వక సంబంధాలు కొనసాగాలనేది తమ అభిమతమని తేల్చిచెప్పడం జరిగింది. అలాగే కేసీఆర్ తలపెట్టిన ఫెడరల్ ఫ్రంట్‌కు తాము మద్దతిస్తామని జగన్ మోహన్‌రెడ్డి విస్పష్టంగా ప్రకటించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వైసీపీ ఇరువై స్థానాలు గెలుస్తున్నదని ఇప్పటికే సర్వేలు తెలియజేస్తున్నాయి. అలాగే టీఆర్ఎస్ 16 స్థానాలను గెలుస్తుందని మొన్నటి శాసనసభ తీర్పుతోనే తేలిపోయింది. ఈ రెండు పార్టీలు ఐకమత్యంతో మెలిగితే సుమారు 37 ఎంపీల బలం చేకూరుతుంది. కేంద్రం నుంచి పలు ప్రయోజనాలను పొందటం సాధ్యమవుతుంది.

జాతీయస్థాయిలో రాజకీయ పరిస్థితులను గమనించినప్పుడు రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తిరిగి అధికారాన్ని సాధించడం అంత సులభంగా జరిగే పని కాదని ఎవరికైనా అర్థమవుతుంది. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడు ముఖ్యమైన రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. యూపీలో ఎస్పీ, బీఎస్పీ జట్టుకట్టి బీజేపీని ఓడించాలని కృత నిశ్చయంతో ఉన్నాయి. ఇక పశ్చిమబెంగాల్లో మమతా బెనర్జీ సారథ్యంలో తృణమూల్ ఫ్రంట్ కనీసం 35 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉన్నది. ఢిల్లీలో ఆప్ పార్టీ మళ్లీ విజయ దుందుభి మోగిస్తుంది. బీహార్‌లో నితీశ్ కుమార్ కూడా బీజేపీతో అసంతృప్తితోనే ఉన్నారు. మహారాష్ట్రలో ఈసారి శివసేనకు ఆధిక్యం లభించవచ్చు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుస్తుంది. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బీజేపీకి డిపాజిట్లు కూడా రావు.



తమిళనాడు, కేరళలో చెప్పాల్సిన అవసరమే లేదు. కర్ణాటకలో నాలుగో, ఐదో బీజేపీ గెలుస్తుందేమో చెప్పలేము. ఇన్ని బలమైన రాష్ట్రాల్లో బీజేపీ వెనుకబడి ఉండగా, ఎన్డీయేకు ఆధిక్యత వచ్చే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ కూడా కొద్దిగా పుంజుకున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, దానికి సొంతంగా ఎనభై సీట్లు వచ్చే అవకాశం ఉండొచ్చు. కాంగ్రెస్‌తో తాజాగా జట్టుకట్టిన టీడీపీ ఆంధ్రప్రదేశ్‌లో బాగా బలహీనపడింది. ఏ విధంగా చూసుకున్నా, ఎన్డీయేకు 200 స్థానాలు, యూపీఏకు వంద స్థానాలు మించవు. కనుక బీజేపీ, కాంగ్రెస్‌లను వ్యతిరేకించే పార్టీలు జట్టుకడితే 200 సీట్లకు పైనే సునాయాసంగా సాధించగలవు. ఫెడరల్ ఫ్రంట్ గనుక రెండు వందలు సీట్లు సాధించిన పక్షంలో ఎన్డీయే, యూపీఏ కూటమిలోని పార్టీలు బయటకు వచ్చి ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతు ఇచ్చిన పక్షంలో కేంద్రంలో అధికారాన్ని సాధించడం కష్టం కాబోదు. ఈ దిశగా కేసీఆర్ వేస్తున్న అడుగులకు వైసీపీ మద్దతు ప్రకటించడం ముదావహం.

తెలంగాణలో ఇరువై లక్షల మందికి పైగా సీమాంధ్రులు సుఖంగా జీవిస్తున్నారు. తాము పరాయి రాష్ట్రంలో ఉన్నామన్న భావనే వారికి కలుగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల మధ్య సఖ్యత, పరస్పర సహకారం ఎంతో అవసరం. నీటి పంపకాలు, కరెంట్ వినియోగం, వస్తు సేవలు, సరఫరాలు మొదలైన రంగాల్లో రెండు రాష్ట్రాలు ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ అన్యోన్యంగా ఉండాలి. అలాగే ఇద్దరూ కలిసి జాతీయస్థాయిలో పోరాడి ప్రయోజనాలు సాధించుకోవాలి.

ఈ విజ్ఞత కలిగినవాడు కాబట్టే జగన్మోహన్ రెడ్డి కేసీఆర్ ఆహ్వానానికి తమ అంగీకారాన్ని తెలిపారు.

ఇక వైసీపీ, టీఆర్ఎస్ కలిసి పనిచేయాలని ప్రకటించడం పట్ల తెలుగుదేశం నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రి కూడా గంగవెర్రులెత్తిపోతున్నారు. కేసీఆర్‌తో జగన్ కుమ్మక్కయ్యారని, ఆంధ్రా ప్రయోజనాలను కేసీఆర్‌కు తాకట్టు పెట్టారని, కేసీఆర్ ఆంధ్రా ద్రోహి అని ఆర్తనాదాలు చేస్తున్నారు. నిజానికి హరికృష్ణ మృతదేహాన్ని పక్కనే పెట్టుకొని టీఆర్ఎస్‌తో కలిసి పని చేస్తామని చంద్రబాబు రాయబారాలు పంపిన వైనాన్ని వాటంగా విస్మరిస్తున్నారు. కేసీఆర్ ఛీ కొట్టాక తెలుగుదేశం పార్టీకి బద్ధ శత్రువు అయిన కాంగ్రెస్‌తో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని ఎవరికి తెలియదు? ఈ విషయాన్నీ చంద్రబాబే స్వయంగా చెప్పిన మాట మరిచారా? అంటే టీఆర్ఎస్‌తో చంద్రబాబు పొత్తు పెట్టుకుంటే అది రెండు రాష్ట్రాల ప్రయోజనాల కోసం. అదే జగన్ పెట్టుకుంటే ఆంధ్రాకు ద్రోహం చేసినట్లు! ఇదీ తెలుగుదేశం ద్వంద్వ విధానం. చంద్రబాబు వెయ్యినాలుకల మీద మొన్ననే కదా తెలంగాణలోని సీమాంధ్రులు కర్రు కాల్చి వాతలు పెట్టారు! ఎక్కడా డిపాజిట్లు రాకుండా తరిమికొట్టారు!. చంద్రబాబు కారు కూతలను విశ్వసించే స్థితిలో ఆంధ్రులు ఏ మాత్రం లేరనే విషయం మొన్నటి ఎన్నికల్లోనే స్పష్టమైపోయింది.

వాస్తవానికి టీఆర్ఎస్, వైసీపీ ఎన్నికల పొత్తులు పెట్టుకోలేదు. ఆంధ్రాలో టీఆర్ఎస్ పోటీ చెయ్యదు, తెలంగాణలో వైసీపీ పోటీ చెయ్యదు. అలాంటపుడు పొత్తులు అని ఎలా ఆరోపిస్తారు? యూపీఏ ఫ్రంట్‌లో చంద్రబాబు చేరినట్లే ఫెడరల్ ఫ్రంట్‌లో వైసీపీ చేరుతుంది. అందులో దోషం ఏముంది? కాకపోతే, చంద్రబాబుకు అనుకూల మీడియా అండగా ఉన్నది. అందువల్ల యజమాని ఆదేశాల మేరకు వైసీపీ, టీఆర్ఎస్ మీద కావలసినంత బురద చల్లుతుంది. కానీ పచ్చ మీడియాను గుడ్డిగా విశ్వసించే స్థితిలో ప్రజలు లేరు.

వాస్తవానికి టీఆర్ఎస్, వైసీపీ ఎన్నికల పొత్తులు పెట్టుకోలేదు. ఆంధ్రాలో టీఆర్ఎస్ పోటీ చెయ్యదు, తెలంగాణలో వైసీపీ పోటీ చెయ్యదు. అలాంటపుడు పొత్తులు అని ఎలా ఆరోపిస్తారు? యూపీఏ ఫ్రంట్‌లో చంద్రబాబు చేరినట్లే ఫెడరల్ ఫ్రంట్‌లో వైసీపీ చేరుతుంది. అందులో దోషం ఏముంది? కాకపోతే, చంద్రబాబుకు అనుకూల మీడియా అండగా ఉన్నది. అందువల్ల యజమాని ఆదేశాలమేరకు వైసీపీ, టీఆర్ఎస్ మీద కావలసినంత బురద చల్లుతుంది. కానీ పచ్చ మీడియాను గుడ్డిగా విశ్వసించే స్థితిలో ప్రజలు లేరు. బలమైన సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు వాస్తవాలు అందుతున్నాయి. ఎవరేమిటి అనేది ప్రజలు గ్రహిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు గుణపాఠం చెబుతారు. ఎవరేమనుకున్నప్పటికీ, ఫెడరల్ ఫ్రం ట్ ద్వారా జాతీయస్థాయిలో టీఆర్ఎస్, వైసీపీ ప్రముఖ పాత్రను పోషి స్తాయనేది మాత్రం సత్యం. అది మరో నాలుగు నెలల్లో రుజువు కాబోతున్నది.

(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)

స్వచ్ఛ సర్వేక్షణ్‌ను స్వాగతిద్దాం

స్వచ్ఛత



డాక్టర్ గాదె వెంకటేష్

జనవరి 4 నుంచి 2019 జనవరి 31 వరకు దేశం అంతటా మొదలైన 'స్వచ్ఛ సర్వేక్షణ్' కొనసాగనున్నది. ఇంతవరకు అమృత్, స్మార్ట్ సిటీస్, హృదయ్ లాంటి ప్రతిష్టాత్మక పథకాలను ఎన్డీయే ప్రభుత్వం చేపట్టింది. అమృత్ కార్యక్రమ విస్తరణలో స్వచ్ఛ సర్వేక్షణ్ విధానాన్ని 2016లో ప్రారంభించారు. మొదటి రెండేండ్లలో కొన్ని పట్టణాలు, మహా నగరాలకు మాత్రమే అమృత్ పరిమితం కాగా, 2018, 2019 వచ్చేసరికి అన్ని మున్సిపాలిటీల్లో ఈ స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విస్తరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే స్వచ్ఛత ఆధారంగా ఒక నగరానికి ర్యాంకింగ్ ఇవ్వడం. క్రెడిట్ రేటింగ్ సర్టిఫికెట్స్ ఇచ్చే పాశ్చాత్య సంస్కృతి నుంచి స్వచ్ఛత ఆధారంగా ర్యాంకింగ్ ఇవ్వడం అనేది బహుశా మన దేశమే మొదలు పెట్టింది. స్వచ్ఛ సర్వేక్షణ్ వల్ల లాభనష్టాలు సామాన్య ప్రజలకు అంతగా అర్థం కాకపోయినా పురపాలక సంఘాలకు అర్థమవుతుంది. అమృత్ నగరాలకు దేశస్థాయిలో మిగితా మున్సిపాలిటీలకు రీజియన్ స్థాయిలో జనాభా ప్రాతిపదికన ర్యాంకులు కేటాయిస్తున్నారు. లక్ష జనాభా దాటిన పట్టణాలను అమృత్ సిటీలుగా కేంద్రం గుర్తించింది. తెలంగాణలో మొత్తం 12 అమృత్ నగరాలున్నాయి. ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ విధానం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డాక్యుమెంటేషన్, ప్రజల అభిప్రాయాలు, స్పందనకు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా ఉంటుంది. స్వచ్ఛ సర్వేక్షణ్ నాలుగు విభాగాలుగా విభజించి ఈ సర్వేక్షణ్ చేస్తారు. ముఖ్యంగా ఘణ, వ్యర్థ పదార్థాలు, పారిశుధ్య నిర్వహణకు పురపాలక సంఘాలు తీసుకుంటున్న చర్యలపై ఈ ర్యాంకు ఇస్తారు. ఈసారి 500 మార్కులకు గానూ, 50కి పైగా ప్రశ్నలున్నాయి. పురపాలక సంఘాలు వాటికి సమాధానమిస్తూ ఆధారాలను చూపించాల్సి ఉంటుంది. ఇదంతా ఆన్‌లైన్లోనే జరుగుతుంది. ఈ మొత్తంలో 45 శాతం మార్కులు ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణకే కేటాయించారు. అంటే చెత్త సమస్య తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. సౌత్ జోన్‌లో వంద లోపు ర్యాంకుల్లో తెలంగాణలోని 21 మున్సిపాలిటీలు చోటు దక్కించుకున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్-2018 పోటీలో బోడుప్పల్, ఫిర్జాదీగూడ, సిద్దిపేట నగరాలు సౌత్ ఇండియాలో మొదటి మూడు పట్టణాలుగా చోటు దక్కించుకోవడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2017లో సూర్యాపేట 30వ ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వం చేత అవార్డు అందుకున్నది. ఈ పోటీ ద్వారా తెలంగాణలోని అన్ని పట్టణాల మధ్య ఒక సుహృద్భావ పోటీ వాతావరణం నెలకొన్నది. ఏదైనా ఉత్పత్తి జరుగుతున్నప్పుడు ప్రధాన ఉత్పత్తితో పాటు వ్యర్థాలు (అనుత్పాదకాలు) కూడా వెలువడుతాయి. ఇవి ఉపయోగకరం కాకపోయినా వాటిని నివారించలేం. నివారించి ఏ ఉత్పత్తినీ సాధించలేం. అలా అనివార్య వ్యర్థాలను ఏ దృక్పథంతో నిర్వహణ, నిర్వీర్యం చేస్తున్నామన్న దాన్ని బట్టే ఆ ఉత్పత్తి లేదా సంస్థ ఉన్నతి ఆధారపడి ఉంటుంది. సరిగ్గా పట్టణాల స్వచ్ఛత దీనిపై ఆధారపడి ఉంటుంది.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2018లో ర్యాంకులతో, మున్సిపాలిటీలు ఆత్మావలోకనం చేసుకుంటూ కొత్తగా ఏర్పడిన 74 మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తూ మునుముందు కూడా దేశానికి మార్గదర్శకంగా నిలువాలని కోరుకుందాం.

భారతదేశంలో 72.2 శాతం జనాభా 6,38,000 గ్రామాల్లో నివసిస్తున్నారు. అంటే 27.8 శాతం జనాభా కేవలం 5,480 పట్టణాలు, నగరాల్లో జీవిస్తున్నారు.దేశంలోని పట్టణాలు, నగరాల్లో రోజుకు 1, 88,500 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతున్నది. రాష్ట్రంలోని పట్టణాలు, మహానగరాల్లో రోజుకు 6,628 మెట్రిక్ టన్నుల ఘన, వ్యర్థ పదార్థాలు ఉత్పన్నమవుతాయి. అంతేకాకుండా 10,592 కిలోమీటర్ల రోడ్డు ఊడ్చగా చెత్త, 12,81,302 కిలోమీటర్ల మురుగు కాలువలను శుభ్రపర్చగా వెలువడిన వ్యర్థం మొత్తానికి అదనం. ఒక మనిషి రోజుకు గరిష్ఠంగా 100 గ్రాముల మలం, 1.25 లీటర్ల మూత్రం, 250-450 గ్రాముల ఘన వ్యర్థాలను విసర్జిస్తారు. జనాభా ప్రాతిపదికన అంచనా వేసుకుంటే రోజుకు గ్రామాల్లో ఉత్పత్తయ్యే వ్యర్థాలకన్నా పట్టణాలు,నగరాల్లో ఉత్పత్తి అయ్యేవి మూడొంతులు ఎక్కువగా ఉంటుంది. ఇదంతా మానవ జీవన విధానంలో భాగంగా మనిషి మనుగడ కోసం లేదా సౌకర్యాల కోసం అవసరమయ్యే శక్తి (వనరు)ని ఉత్పత్తి చేసుకోవడంలో భాగంగా వచ్చే అనుత్పాదకాలు (వ్యర్థాలు). నిత్యం ఉత్పన్నమయ్యే ఈ అనివార్యమైన వ్యర్థాలను నిర్వహణ, నిర్వీర్యం ఎలా చేస్తున్నామన్నదాన్నిబట్టి, ఆ వృత్తిలో ఉన్నవారి పట్ల ఉన్న దృక్పథంపై ఆ సమాజపు స్థాయి, ఉన్నతి నిర్ధారించబడుతుంది. ఎందుకంటే మనిషికి కావాల్సిన మౌలిక అవసరాలు నీరు, గాలి, తిండి, గుడ్డ, గూడు మొదలగు అన్నింటికీ ప్రత్యామ్నాయాలు ఉంటాయి. కానీ పారిశుద్ధ్యానికి ప్రత్యామ్నాయం లేదు.

అన్నిరంగాలను బలోపేతం చేస్తున్నామంటూ ప్రకటనలు ఇస్తున్న ప్రభుత్వాలు పారిశుధ్య కార్మికులనే అమానవీయ వ్యవస్థను రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలె. మనుషుల స్థానంలో యంత్రాలను ప్రవేశ పెట్టేందుకు శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధిని ఆలంబన చేసుకోవాలె. కానీ మన ప్రభుత్వాలు అప్పుడప్పుడు కార్మికులకు కొన్ని సబ్బులు, రేడియం జాకెట్లు, బూట్లు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నాయి.

స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాలు, పారిశుధ్య కార్మికులకు ఎక్కువ పనిభారం పెంచేవిగా తయారయ్యాయనేది కాదనలేని సత్యం. కానీ, వారికి ఒక గౌరవప్రద స్థానం, కనీస వసతులు కల్పించేవిగా లేకపోవడం విచారకరం. తమ ప్రాణాలు పణంగా పెట్టి నిత్యం ఈ దేశాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సఫాయి కార్మికులను అంటరానివారిగా చిన్నచూపు చూస్తున్నారు. పారిశుధ్య కార్మికుల బాధలు గమనిస్తే సగటు మానవ విలువల గురించి ఆలోచించే వాళ్లందరికి ఈ హృదయవిదారక ప్రక్రియను నిత్యం కళ్లచూస్తూ చేతులు కట్టుకొని ఉంటున్నందుకు గుండెలు బాదుకోవాలనిపిస్తున్నది. ఎందుకంటే ప్రతి కులవృత్తుల వారికీ, లేదా శాఖల వారికీ ఆ ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలు లేదా రక్షణ సౌకర్యాలకు సంబంధించిన ప్రత్యేక చర్యలుంటాయి. కానీ శానిటరీ వృత్తివారికి ఆ సదుపాయం లేదు.

అన్నిరంగాలను బలోపేతం చేస్తున్నామంటూ ప్రకటనలు ఇస్తున్న ప్రభుత్వాలు పారిశుధ్య కార్మికులనే అమానవీయ వ్యవస్థను రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలె. మనుషుల స్థానంలో యంత్రాలను ప్రవేశపెట్టేందుకు శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధిని ఆలంబన చేసుకోవాలె. కానీ మన ప్రభుత్వాలు అప్పుడప్పుడు కార్మికులకు కొన్ని సబ్బులు, రేడియం జాకెట్లు, బూట్లు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నాయి. పారిశుధ్య వ్యవస్థను ఎంత యాంత్రీకరిస్తే అంత మంచిది. ప్రాణాలు పణంగా పెట్టి పారిశుధ్యపనులు చేస్తూ ప్రాణాలు వదిలిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఏదో కొంత నష్టపరిహారం పేరిట ఆదుకోవటం జరుగుతున్నా, ఈ అమానవీయ వ్యవస్థ నిర్మూలనకు తగు రీతిలో కృషి జరుగటం లేదన్నది వాస్తవం. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం పారిశుధ్య వ్యవస్థను ఆధునీకరించి దేశానికే ఆదర్శంగా నిలువాల్సిన అవసరం ఉన్నది.

rinted and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



మల్లన్న హుండీ ఆదాయం రూ.23 లక్షలు

ఐనవోలు మల్లికార్జునస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. మొత్తం 22 హుండీలను తెరిచి లెక్కించగా రూ.23,01,486 ఆదాయం సమకూరిందని ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. ఇది ఇరవై రోజుల ఆదాయమని ఆయన పేర్కొన్నారు. - ఐనవోలు(వరంగల్ అర్బన్)



అద్దాల మండపం నిర్మాణ పనులు ప్రారంభం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా గురువారం సాయంత్రం అద్దాల మండపం పనులను స్థపతి డాక్టర్ ఆనందాచార్యుల వేలు ప్రారంభించారు. ప్రధానాలయానికి ఉన్న ఔటర్ ప్రాకారానికి వాయవ్యంలో ఈ మండపాన్ని నిర్మించనున్నారు. నిర్మాణానికి అవసరమైన నాలుగు స్తంభాలను శిల్పులు నిలబెట్టారు. ఆలయ విస్తరణ పనుల్లో అద్దాలమండపం కూడా అతి ముఖ్యమైనది. మండపంలో శ్రీవారి విగ్రహాలను ఏర్పాటుచేస్తారు. ఈ కార్యక్రమంలో ఉప స్థపతులు సంజయ్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. - యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ



పోచారానికి స్పీకర్ పదవిపై సంబురాలు

బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి స్పీకర్ పదవికి ఎంపిక కావడంతో టీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బాన్సువాడలో దేశాయిపేట్ సొసైటీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు. నస్రుల్లాబాద్ మండలకేంద్రంలోనూ టీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. - బాన్సువాడ, నమస్తే తెలంగాణ

టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి రాష్ట్ర వ్యాప్తంగా చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు గులాబీ కండువా కప్పుకొన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో వంకాయలపాటి వెంకటలచ్చయ్య ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 100 కుటుంబాలవారు ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మానాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మానాల మోహన్‌రెడ్డి అనుచరులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్ గూటికి చేరారు.

వరంగల్ జిల్లాలో..: వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపెల్లికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు దేశిని పద్మతోపాటు 25 మంది, మహేశ్వరంలో కాంగ్రెస్ నేత పెరుమాండ్ల నాగరాజు ఆధ్వర్యంలో 15 మంది నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో, చెన్నారావుపేటలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ తిరుపతి, జెడ్పీటీసీ రామిరెడ్డి ఆధ్వర్యంలో 45 మంది, ఖానాపురం మండలం మంగళవారిపేటలో 10మంది కాంగ్రెస్ నాయకులు మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 50 మంది హైదరాబాద్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.



ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో టీఆర్‌ఎస్‌లో చేరిన టీడీపీ నాయకులతో ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెంకటాపురం కాంగ్రెస్ నాయకులతో పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు



నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న మానాల కాంగ్రెస్ నాయకులు



వరంగల్ రూరల్ జిల్లా ఇటుకాలపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మల్లాపూర్ బస్టాండ్ వద్ద నిరసనకు దిగిన టీఆర్‌ఎస్ నాయకులు

మల్లాపూర్ సర్పంచ్ ఎన్నిక హైడ్రామా

చీటీతో పదవి దక్కించుకున్న క్యాతం జీవన్‌రెడ్డి

ఎన్నిక రద్దు చేయాలని టీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన

మల్లాపూర్: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలో హైడ్రామా కొనసాగింది. సర్పంచ్ అభ్యర్థులుగా క్యాతం జీవన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోపిడి రాజరెడ్డి, ఆకుతోట నర్సయ్య నామినేషన్లు దాఖలు చేయగా గురువారం సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోపిడి రాజరెడ్డి, ఆకుతోట నర్సయ్య నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఇక్కడ సర్పంచ్ స్థానానికి క్యాతం జీవన్‌రెడ్డి మాత్రమే బరిలో నిలిచాడు.

చీటీతో పదవి కైవసం..: క్యాతం జీవన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన పోటీదారులు కాగా కొంత మంది పెద్దలు చొరవ తీసుకొని ఇద్దరినీ పిలిచి రాజీ కుదిర్చినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఇద్దరు అభ్యర్థుల సమక్షంలో చీటీలు వేసి, సర్పంచ్ చీటీ వచ్చిన అభ్యర్థి గ్రామంలోని ఆలయానికి రూ.15 లక్షలు డిపాజిట్ చేయడంతోపాటు చీటీ రాని అభ్యర్థికి రూ.5లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. ఇందులో చీటీ జీవన్‌రెడ్డికి అనుకూలంగా రావడంతో టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అయిష్టంగా నామినేషన్ ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఈ నిర్ణయం సరికాదని టీఆర్‌ఎస్ నేతలు స్థానికంగా ఆందోళన చేశారు. టీఆర్‌ఎస్‌కు చెందిన మరో అభ్యర్థి నర్సయ్యను నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని కొందరు ఒత్తిడిచేశారని ఆరోపించారు. ఈ ఎన్నికను రద్దుచేయాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

హక్కుల సాధనకే ఫెడరల్ ఫ్రంట్

చంద్రబాబు కుట్రలను తిప్పికొడతాం: ఎంపీ గుత్తా



నల్లగొండ, నమస్తే తెలంగాణ: దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రాల హక్కుల సాధన కోసం సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ దిశగా అడుగులు వేస్తున్నారని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటిస్తున్నట్టు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఏపీలోనూ ఫెడరల్ ఫ్రంట్‌లో భాగస్వామ్యం చేసేందుకు కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలిశారన్నారు. కానీ, ఏపీ సీఎం చంద్రబాబు ఏపీ ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశంతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ, టీఆర్‌ఎస్ కలయిక ఎన్నికల పొత్తు కాదని, ఇది ఫెడరల్ ఫ్రంట్‌లో భాగమేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో చంద్రబాబు కుట్రలను తిప్పికొడతామన్నారు.

తీర్థయాత్రలకు వెళ్లొస్తుండగా విషాదం

డిచ్‌పల్లి వద్ద హైవేపై ఇన్నోవా బోల్తా, దంపతుల మృతి

డిచ్‌పల్లి, నమస్తే తెలంగాణ: సంక్రాంతి సెలవుల్లో తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి స్వస్థలం ఆదిలాబాద్ చేరుకుంటున్న ఓ కుటుంబంలో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. నిజామాబాద్ జిల్లాలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై నాకా తండా వద్ద గురువారం తెల్లవారుజామున ఇన్నోవా కారు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడి దంపతులు మృతిచెందగా, మరో ఎనిమిదిమంది కుటుంబసభ్యులు గాయపడ్డారు. ఆదిలాబాద్‌కు చెందిన గౌరిశెట్టివార్ ప్రకాశ్, చాంద దంపతులు, వారి కుమారులు, కోడళ్లు, మనుమళ్లు, మనువరాళ్లతో కలిసి ఈ నెల 11న తీర్థయాత్రలకు వెళ్లి, తిరిగి బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని ఇన్నోవాలో ఇంటికి బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున డిచ్‌పల్లి మండలం నాకా తండా వద్ద 44వ జాతీయ రహదారిపై ఇన్నోవా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడి నుజ్జునుజ్జయింది. ప్రకాశ్ (74), చాంద (68) అక్కడికక్కడే మృతిచెందారు. కుటుంబసభ్యులు శ్రీనివాస్, సుష్మిత, శ్రీతేజ, జగన్నాథ్, శివప్రసాద్, హారిక, గాయత్రీ, శౌర్య గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రులను నిజామాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. వాహనం నడుపుతున్న దంపతుల పెద్ద కొడుకు శ్రీనివాస్ నిద్రమత్తు, పొగమంచు, అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నది.



మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి సమీపంలో గురువారం కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని వెనుకనుంచి గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొట్టగా, ఆ వెనుకే వస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం డిపో ఆర్టీసీ బస్సు సిలిండర్ లారీని ఢీకొట్టడంతో అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. - మహబూబ్‌నగర్ క్రైం

దుబాయ్‌లో ముప్కాల్ యువకుడి ఆత్మహత్య



అరుణ్ (ఫైల్)

ముప్కాల్: బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌కు చెందిన అనికేశి హన్మాండ్లు, ప్రమీల దంపతుల చిన్న కుమారుడు అరుణ్(29) బుధవారం దుబాయ్‌లోని ఆల్కుష ప్రాంతంలోని తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని అతని స్నేహితులు దుబాయ్ నుంచి అరుణ్ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పారు. ఆత్మహత్య కు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

గుప్తనిధి తవ్వకాల నిందితులకు రిమాండ్


వికారాబాద్, నమస్తే తెలంగాణ: వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం నాగుసాన్‌పల్లి గ్రామశివారులో శివాలయం పక్కన ఈ నెల 2న అర్ధరాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వారినుంచి అమ్మవారి పంచలోహ విగ్రహం, ఎనిమిది నాణేలు, శఠగోపం, బిందెను స్వాధీనం చేసుకున్నట్టు వికారాబాద్ డీఎస్పీ శిరీష గురువారం మీడియాకు తెలిపారు. నాగుసన్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ తన పొలంలో రమేశ్, ఆటోడ్రైవర్ శ్రీనివాస్, పూజారి వెంకటేశంతో కలిసి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్టు తెలిపారు. ఈ నెల 16న మోమిన్‌పేటలో వీటిని అమ్మేందుకు యత్నిస్తుండగా నలుగురిని పట్టుకున్నామని, వీటిని అమ్మిపెడతానని చెప్పిన ఉపేందర్‌రెడ్డి పరారీలో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ తెలుసుకొనేందుకు ఆర్కియాలజీ అధికారులకు అప్పగిస్తామన్నారు. గుప్త నిధుల కోసం తవ్విన సమయంలో నిందితులు తీసిన ఫొటోల్లో 9 నాణేలు, బంగారు గొలుసు ఉండగా, స్వాధీనం చేసుకున్నవాటిలో ఒక నాణెం, బంగారు గొలుసు లేకపోవడం చర్చనీయాంశమైంది.

'గులాబీ' మద్దతు కోసం ఒత్తిళ్లు

సర్పంచ్‌గా బరిలో నిలిచేందుకు స్థానిక నాయకుల ముమ్మర ప్రయత్నాలు

తమనే బలపర్చాలంటూ రాష్ట్రవ్యాప్తంగా టీఆర్‌ఎస్ నేతలకు విన్నపాలు

జనగామ జిల్లాలో వాటర్ ట్యాంక్ ఎక్కి కార్యకర్త నిరసన



తమ కుటుంబానికే టీఆర్‌ఎస్ మద్దతు తెలుపాలని కోరుతూ జనగామ జిల్లా కొడకండ్ల మండలం రామవరంలో వాటర్ ట్యాంక్ ఎక్కిన కార్యకర్త మహేందర్

కొడకండ్ల: పంచాయతీ పోరులో విచిత్ర పరిస్థితి కనిపిస్తున్నది. టీఆర్‌ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలువాలనుకుంటున్న వారి సంఖ్య పెరుగుతున్నది. విపక్షాలకు అభ్యర్థులు కరువైన నేపథ్యంలో గులాబీ పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. సీఎం కేసీఆర్ నేతృత్వంలో టీఆర్‌ఎస్ రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, అన్ని వర్గాలకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుండటంతో చాలామందిలో సర్పంచ్‌గా పోటీ చేయాలనే ఆసక్తి పెరిగింది. దీనికితోడు కొత్త పంచాయతీరాజ్ చట్టంతో సర్పంచ్‌లకు విశేష అధికారాలు దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో తమకు అనుకూలమైన రిజర్వేషన్లు వచ్చిన వారంతా పోటీకి సిద్ధమవుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో టీఆర్‌ఎస్ బలపరిచే అభ్యర్థులను ఎమ్మెల్యేలు ప్రకటిస్తుండటంతో వారిని ప్రసన్నం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తమకు అవకాశం దక్కదేమోననే ఆందోళనతో కొందరు నిరసనలకు దిగుతున్నారు. తనకు గాని, తమ వారికి గాని టికెట్ ఇవ్వాలంటూ ఒత్తిడి పెంచుతున్నారు. తాజాగా జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల మండలం రామవరంలో టీఆర్‌ఎస్ పార్టీ తమ కుటుంబ సభ్యులను సర్పంచ్ అభ్యర్థిగా బలపర్చలేదని ఎడెల్లి మహేందర్ అనే కార్యకర్త గురువారం వాటర్ ట్యాంక్ ఎక్కారు. రిజర్వేషన్లలో భాగంగా ఈ గ్రామాన్ని ఎస్సీ మహిళకు కేటాయించి రెండో విడతలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మహేందర్ కుటుంబం నుంచి ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. అయితే టీఆర్‌ఎస్ వేరొకరిని సర్పంచ్ అభ్యర్థిగా బలపర్చింది. తమ కుటుంబానికే సర్పంచ్‌గా పోటీ చేసేందుకు అర్హత ఉన్నదని, వేరొకరిని ఎలా బలపరుస్తారంటూ నిరసనకు దిగాడు. సమాచారం అందుకున్న ఎస్సై రాజు ఘటన స్థలానికి చేరుకొని బాధితుడికి సర్ది చెప్పి కిందకు దించడంతో గ్రామస్థులంతా ఊపిరి పీల్చుకున్నారు.

కాళేశ్వరాన్ని పరుగులు పెట్టించండి

పనుల్లో జాప్యంపై సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్ ఆగ్రహం

మేడిగడ్డ, అన్నారం బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్ పనుల పరిశీలన



భూపాలపల్లి జిల్లాలోని అన్నారం బరాజ్ పనులను పరిశీలిస్తున్న స్మితా సబర్వాల్

మహాదేవపూర్(జయశంకర్ భూపాలపల్లి)/అంతర్గాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులను పరుగులు పెట్టించి సీఎం నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బరాజ్‌ను, పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడలో నిర్మిస్తున్న సుందిళ్ల పంప్‌హౌస్‌ను గురువారం ఆమె సందర్శించారు. మేడిగడ్డ బరాజ్ పరిధిలో పోచంపల్లి వైపున గల సైడ్‌బండ్స్ పనులను పరిశీలించారు. భూసేకరణలో జాప్యంపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ప్రాజెక్ట్ సందర్శన సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశించినా భూసేకరణ పూర్తిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్చి నెలాఖరులోగా మేడిగడ్డ బరాజ్ పనులను పూర్తిచేయాలన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటర్ల బిగింపు ప్రక్రియను, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి 13.2 కి.మీ. మేర గ్రావిటీ కెనాల్ వెంట వాహనాల్లో ప్రయాణిస్తూ ఇతర పనులను పరిశీలించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని సూచించారు. అనంతరం అన్నారం బరాజ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పెద్దపల్లి జిల్లాలోని గోలివాడలో సుందిళ్ల పంప్‌హౌస్ పనులను ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. మార్చి చివరినాటికి మోటర్ల బిగింపు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 10 నాటికి మొత్తం మోటర్లు బిగించి డ్రైరన్ చేపట్టాలని, వెట్‌రన్‌కు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆమె వెంట సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండే, లిఫ్ట్‌ఇరిగేషన్ సలహాదారు పెంటారెడ్డి, కలెక్టర్లు వాసం వెంకటేశ్వర్లు, శ్రీదేవసేన, సీఈ నల్లా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని నగరి బాలుసా కుటుంబానికి చెందిన 101 మంది సభ్యులు ఒక్కచోట చేరి సంక్రాంతి పండుగ జరుపుకొన్నారు. నగరిబాలుసా, రాంబాయి దంపతులకు నలుగురు కుమారులు, నలుగురు కూతుళ్లు.. ఇలా తరువాతి తరం అంతా కలిసి వారి సంఖ్య 101కి చేరింది. వృద్ధ దంపతులు నగరిబాలుసా, రాంబాయి ఈ లోకంలో లేకపోయినా ఏటా తామంతా ఒక్కచోట చేరి సంక్రాంతి సంబురాలు జరుపుకొంటున్నామని బాలుసా మనుమడు, ప్రజ్ఞా విద్యాసంస్థల అధినేత ప్రజ్ఞా గంగామోహన్ తెలిపారు. - ఆర్మూర్ టౌన్



భువనగిరిలోని వర్మీ కంపోస్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న విదేశీ బృందం

డంపింగ్ యార్డును సందర్శించిన విదేశీబృందం

భువనగిరి టౌన్: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం తుక్కాపురం రోడ్డులోని భువనగిరి మున్సిపల్ రిసోర్స్ పార్కు (డంపింగ్ యార్డు)ను 13 దేశాలకు చెందిన 19 మంది ప్రతినిధులు గురువారం సందర్శించారు. టెక్నికల్ కోఆపరేటివ్ స్కీం ఆఫ్ కొలంబో ప్లాన్, ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్‌ఐ) కింద సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఈనెల 7 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జరుగుతున్న శిక్షణలో పాల్గొనేందుకు వచ్చిన వీరు గురువారం భువనగిరి రిసోర్స్ పార్కును సందర్శించారు. ఈ బృందంలో వియత్నాం, కొలంబియా, ఉగాండా, శ్రీలంక, జింబాబ్వే, కెన్యా, అర్జెంటినా, మారిటస్, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్, ఇథియోపియా, తజకిస్తాన్‌లకు చెందిన ప్రతినిధులు ఉన్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన ఇద్దరి సస్పెన్షన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం విధులు కేటాయించినప్పటికీ శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైన ఇద్దరు ఉద్యోగులపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ వేటు వేశారు. సింగరేణి మణుగూరు మైన్స్ అండ్ జియాలజిస్టు విభాగంలో సహాయ పర్యవేక్షకులు సల్మాన్‌రాజ్, ఆర్ యుగంధర్‌కు రిటర్నింగ్ అధికారి స్టేజ్-2 విధులు కేటాయించారు. వారు ఎన్నికల సామగ్రి పంపిణీపై రిపోర్టు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్.. వారిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

నల్లమలలో వేటగాడి ఉచ్చుకు వన్యప్రాణి బలి

నిందితుడిపై కేసు నమోదు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: నల్లమలలో వన్యప్రాణిని బలిగొన్న వేటగాడిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం సెక్షన్ 9 కింద అధికారులు కేసు నమోదుచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిలకు చెందిన బోయ శ్రీనివాసులు(45) నల్లమల అడవిలో వన్యప్రాణులను హతమార్చేందుకు మోటర్ బైక్ క్లచ్ వైర్లతో తయారుచేసిన ఉచ్చును వేశాడు. అందులో చిక్కుకున్న వన్యప్రాణిని ముక్కలుగా చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఎఫ్‌ఆర్వో మనోహర్ తెలిపారు. మృత్యువాత పడ్డది కొండగొర్రెనా? లేక చుక్కల దుప్పా అన్నది పోస్టుమార్టం రిపోర్టులో తేలుతుందని వివరించారు.

హైకోర్టులో సౌకర్యాల కల్పన హర్షణీయం

- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ న్యాయవాదుల జేఏసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైకోర్టులో న్యాయవాదులకు సౌకర్యాల కల్పన, కొత్తగా లా చాంబర్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉమ్మడి హైకోర్టులో సరైన సౌకర్యాలు లేక న్యాయవాదులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. తెలంగాణ ప్రత్యేక హైకోర్టు ఏర్పాటైన తర్వాత సౌకర్యాల కల్పనపై దృష్టిసారించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రమాణం చేసిన న్యాయవాది, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులకు జేఏసీ కన్వీనర్ కొంతం గోవర్ధన్‌రెడ్డి, సీహెచ్ ఉపేందర్, అనిల్‌కుమార్, చక్రధర్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

ఆసు యంత్రం సృష్టికర్త మల్లేశంపై బయోపిక్

- ఆలేరులోని అయన సొంత ఇంట్లో చిత్రీకరణ ప్రారంభం
- చింతకింది మల్లేశం పాత్రలో పెళ్లిచూపులు నటుడు ప్రియదర్శి


ఆలేరుటౌన్: ఆసు యంత్రంతో దేశవ్యాప్తంగా పేరుప్రతిష్ఠలు గడించిన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు చింతకింది మల్లేశంపై బయోపిక్‌ను చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ నిర్మాత, దర్శకుడు రాజ్ ఆర్ ఆధ్వర్యంలో గురువారం ఆలేరులోని రైల్వేగేట్ సమీపంలో ఉన్న మల్లేశం ఇంట్లో ఈ చిత్ర నిర్మాణం ప్రారంభమైంది. రెండురోజులపాటు సాగే ఈ చిత్ర నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రొడక్షన్ యూనిట్ సభ్యులు చురుగ్గా చేస్తున్నారు. చిత్ర నిర్మాణం గురించి ఆర్ట్ డైరక్టర్ ఏలె లక్ష్మణ్ మాట్లాడుతూ.. చీర నేసేందుకు నూలుదారాన్ని చేతితో ఆసుపోస్తూ ప్రతిరోజు తన తల్లి పడే బాధలు మరెవరూ పడకూడదని చింతకింది మల్లేశం ఆశించారు. రేయింబవళ్లు కష్టపడి ఆసు యంత్రాన్ని కనిపెట్టిన మల్లేశం కృషిని ప్రపంచానికి తెలియజేసేందుకే చిత్ర నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. చింతకింది మల్లేశం పాత్రలో నటుడు ప్రియదర్శి, తల్లి పాత్రలో టీవీ యాంకర్ ఝాన్సీ, తండ్రి పాత్రలో చక్రపాణి ఆనంద్ నటిస్తున్నారని తెలిపారు. శుక్రవారం మల్లేశం ఇంట్లో ఆసు యంత్రం రూపకల్పన, దాన్ని కనిపెట్టేందుకు అతను చేసిన ప్రయోగాలపై, పోచంపల్లి, రేవనపల్లిలో పల్లె వాతావరణానికి సంబంధించి షూటింగ్ చేస్తామని పేర్కొన్నారు. కో ప్రొడ్యూసర్ శ్రీ అధికారి నేతృత్వంలో రూపొందించే ఈ బయోపిక్‌లో హీరోయిన్‌గా అనన్య నటిస్తున్నారని చెప్పారు. కులవృత్తినే నమ్ముకొని జీవితంలో అంచెలంచెలుగా ఎదిగి, పద్మశ్రీ అవార్డు సాధించి తెలంగాణ ఖ్యాతిని చాటిన మల్లేశం ఎందరికో ఆదర్శప్రాయుడని ఆయన అభిప్రాయపడ్డారు.



చింతకింది మల్లేశం బయోపిక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

నేడు బాధ్యతలు స్వీకరించనున్న మారెడ్డి

- పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా నియమితులైన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఉదయం పౌరసరఫరాల భవన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నట్టు పౌరసరఫరాలశాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేట జిల్లాకు చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని సీఎం కేసీఆర్ పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు పాల్గొననున్నారు.



ఉత్తమ సేవలందించిన వైద్యులకు అవార్డులు అందజేస్తున్న గవర్నర్ నరసింహన్ తదితరులు

అనవసర వైద్య పరీక్షలొద్దు

- మధ్యతరగతి ప్రజలకు భారంగా మెడికల్ బిల్లులు
- నిరుపేదలకు అండగా నిమ్స్ వంటి ప్రభుత్వ దవాఖానలు
- వీనస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సదస్సులో గవర్నర్ నరసింహన్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వైద్యులు రోగులపాలిట ప్రాణదాతలని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన 'వీనస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' 12వ వార్షిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. మధ్య తరగతి ప్రజలు మెడికల్ బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని, ఒకప్పుడు చాలా వరకు హోమ్‌మేడ్ రెమడీస్ ఉండేవని, ఇప్పుడు ప్రతిచిన్న సమస్యకు ఐసీయూలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు అనవసరమైన వైద్యపరీక్షలు రాయడం మానుకొని, సరైన పద్ధతిలో సులభంగా వ్యాధులను గుర్తించేందుకు యత్నించాలని సూచించారు. ప్రతి చిన్నదానికి శస్త్ర చికిత్సలు చేయకుండా సాధ్యమైనంత వరకు మందులతోనే వ్యాధులు నయమయ్యేలా కృషిచేయాలన్నారు. వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు వారి కుటుంబ సభ్యులకు రోగి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారమివ్వాలని చెప్పారు. నిమ్స్ వంటి ప్రభుత్వ దవాఖానలు మధ్యతరగతి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు రోగికి ఇచ్చే మానసిక ధైర్యమే వారిలోని సగం రోగాన్ని తగ్గిస్తుందన్నారు. అనంతరం 'వాయ్' యాప్‌ను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన పలువురు వైద్యులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యనిపుణులు మాట్లాడుతూ 'సిరల చికిత్సలు సురక్షితమైనవి'పై నిర్వహిస్తున్న సదస్సుకు స్వదేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా 350మందికిపైగా వైద్యులు, నర్సులు, టెక్నీషియన్స్, ఫిజియోథెరపిస్టులు హాజరుకానున్నట్లు తెలిపారు. మూడురోజులపాటు జరిగే ఈ సదస్సులో అంతర్నాళాల వ్యాధులకు సంబంధించి ఇటీవలి కాలంలో వచ్చిన శాస్త్రీయ, క్లినికల్, టెక్నికల్ ఆవిష్కరణలతోపాటు పలు అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి, అసోసియేషన్ ఆఫ్ సర్జన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ పీ రఘురామ్, వీఏఐ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ జిందాల్, ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రొఫెసర్ పింజల రామకృష్ణ, వాయికాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ నీహార్‌రంజన్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

సుజనాచౌదరి పెద్ద మోసగాడు

- వేలకోట్ల ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడు
- నేరాల కోసం తండ్రి పేరు కూడా మార్చాడు
- న్యాయవాది రామారావు ఆరోపణ

ఖైరతాబాద్: డబ్బు కోసం ఎంతటికైనా దిగజారే మాజీ మంత్రి సుజనాచౌదరి.. అనేక ఆర్థిక నేరాలకు పాల్పడిన పెద్ద మోసగాడు (స్కామర్) అని ప్రముఖ న్యాయవాది ఇమ్మనేని రామారావు ఆరోపించారు. తండ్రి పేరును కూడా మార్చి మోసాలు చేశారని, ఆరు వేల కోట్ల నుంచి ఏడువేల కోట్ల వరకు ఆర్థికమోసాలకు పాల్పడ్డారని, ఆయన నేరచరిత్ర విదేశాలకు కూడా పాకిందని విమర్శించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. సుజనాచౌదరి ఆర్థికనేరాలను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాకు వివరించారు. సుజనాచౌదరి కొన్ని వేలకోట్ల కుంభకోణాల్లో ప్రధాన నిందితుడని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ, కేంద్ర విచారణ సంస్థలు అభియోగ పత్రాలు దాఖలు చేశాయన్నారు. 2014లో 50 నుంచి 100 కంపెనీలు పెట్టి వాటిద్వారా ఎన్నో ఆర్థికనేరాలకు పాల్పడ్డారని, రెండునెలల క్రితమే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీలు (ఆర్వోసీ, హైదరాబాద్), కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన తీవ్ర ఆర్థిక నేర విచారణ (ఎస్‌ఎఫ్‌ఐవో) కార్యాలయంలో తాను ఫిర్యాదు చేశానని రామారావు చెప్పారు. 22 కంపెనీలకు చెందిన ఆర్థికనేరాలపై చర్యలు తీసుకుంటామని ఆర్వోసీ స్పష్టంచేసిందన్నారు. ఆరువేల కోట్ల నుంచి ఏడువేల కోట్ల వరకు ఆర్థికమోసాలకు పాల్పడ్డారని, ఆయన నేరచరిత్ర మారిషస్, షీషెల్స్, పనామా తదితర దేశాలకు పాకిందని పేర్కొన్నారు. ఇదే కేంద్ర ప్రభుత్వంలో ఈయన మంత్రిగా ఉన్నప్పుడే ఈ నేరాలకు పాల్పడ్డారన్నారు.

సుదీర్ఘ అనుభవానికి సమున్నత గౌరవం

సింగిల్ విండో చైర్మన్‌గా మొదలైన పోచారం రాజకీయ ప్రస్థానం

తెలంగాణ తొలి ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా సేవలు





మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో అసెంబ్లీ స్పీకర్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి ఆత్మీయ ఆలింగనం



ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌తో స్పీకర్ అభ్యర్థి పోచారం ఆత్మీయ ఆలింగనం , చిత్రంలో టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి

కామారెడ్డి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇకపై శాసనసభ వ్యవహారాలను నడిపించబోతున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, వాక్పటిమను పరిగణనలోకి తీసుకున్న సీఎం కేసీఆర్.. అసెంబ్లీ స్పీకర్‌గా పోచారం పేరును ప్రతిపాదించారు. ఆయన ఎన్నిక ఏకగ్రీవం కావడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. సింగిల్ విండో చైర్మన్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన పోచారం.. రాష్ట్ర మంత్రి స్థాయి వరకు ఎదిగారు. తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ దఫా మరో కీలకమైన పదవి చేపట్టబోతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేగా ఆయనకు మంచి పేరు ఉన్నది. ఎంత ఎత్తుకు ఎదిగినా ఆయనకు ప్రజల మనిషిగా మంచి గుర్తింపు ఉంది. మంత్రిగా ఉన్నా తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. బాన్సువాడ మండలం పోచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి.. మొదటి నుంచీ సొంత నియోజకవర్గమైన బాన్సువాడ నుంచే పోటీచేస్తున్నారు. పోచారం అసలుపేరు పరిగె శ్రీనివాస్‌రెడ్డి. ఊరిపేరునే ఇంటిపేరుగా మార్చుకున్నారు. ఆ పేరుతోనే రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితులయ్యారు.

వ్యక్తిగత వివరాలు

పేరు:	పరిగె శ్రీనివాస్‌రెడ్డి
భార్య:	పుష్పమ్మ
తల్లిదండ్రులు:	పరిగె రాజిరెడ్డి, పాపమ్మ
పుట్టిన తేదీ:	10-02-1949
విద్యాభ్యాసం:	బీఈ
స్వగ్రామం:	పోచారం గ్రామం (బాన్సువాడ మండలం)
సంతానం:	రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అరుణ
ఇష్టమైన ఆహారం:	పప్పుచారు

పనితనానికి పట్టాభిషేకం

పోచారం శ్రీనివాస్‌రెడ్డి 1976లో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు ఏడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఆరుసార్లు గెలిచారు. మంత్రిగా గృహనిర్మాణం, గనులు, జలవనరులు, పంచాయతీరాజ్ శాఖలను నిర్వహించారు. 2011లో తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షతో ఆంధ్రా పార్టీ టీడీపీకి గుడ్‌బై చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. తర్వాత వచ్చిన ఉపఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి భారీ విజయం సాధించారు. 2014లో సీఎం కేసీఆర్ తొలి క్యాబినెట్‌లో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు. తెలంగాణ తొలి వ్యవసాయశాఖ మంత్రిగా తనదైన శైలిలో రాణించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలతో ఎప్పటికప్పుడు సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ వారిలో ఉత్సాహం నింపారు. మోకాలికి శస్త్ర చికిత్స జరిగినా వెనుకడుగు వేయకుండా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు.

లక్ష్మీ పుత్రుడు బిరుదు ఇచ్చిన సీఎం కేసీఆర్

గత ఏడాది అక్టోబర్ 3న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని లక్ష్మీపుత్రుడిగా అభివర్ణించారు. నిఖార్సైన రైతుబిడ్డ అని, వ్యవసాయశాఖ మంత్రిగా అద్భుతంగా పనిచేశారని, రైతు బంధు, రైతుబీమా వంటి అద్భుతమైన పథకాల అమలులో క్రియాశీలకంగా వ్యవహరించారని ప్రశంసిస్తూ లక్ష్మీపుత్రుడు అనే బిరుదు ఇచ్చారు. అంతేకాదు అనేక సందర్భాల్లోనూ పోచారం పనితీరును సీఎం కేసీఆర్ అభినందించారు. నీటి తీరువా రద్దు, ఎర్ర జొన్న రైతులకు బకాయిల చెల్లింపు వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలన్నీ పోచారం హయాంలోనే అమల్లోకి వచ్చాయని గుర్తుచేశారు.


రాజకీయ నేపథ్యం

1976:	రాజకీయ అరంగేట్రం
1977:	దేశాయిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు
1980:	బాన్సువాడ సమితికి ప్రెసిడెంట్‌గా పోటీ.. ఓటమి
1984:	తెలుగుదేశంపార్టీలో చేరిక
1987:	నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నిక
1988:	టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక
1989:	టీడీపీ నుంచి ఎంపీగా పోటీచేసి ప్రత్యర్థి బాలాగౌడ్ చేతిలో ఓటమి
1992:	టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు
1994:	బాన్సువాడ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపు
1998:	గృహ నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ
1999:	భారీ మెజార్టీతో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపు
1999:	గనులశాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ
2000:	పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు
2002:	మంత్రి పదవికి రాజీనామా
2004:	అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి
2005-2007:	జిల్లా టీడీపీ కన్వీనర్‌గా నియామకం
2009:	ఎమ్మెల్యేగా గెలుపు
2011:	తెలంగాణ సాధన కోసం టీడీపీకి గుడ్‌బై, ఎమ్మెల్యే పదవికి రాజీనామా
2011 ఏప్రిల్ 27:	టీఆర్‌ఎస్ పార్టీలో చేరిక, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియామకం
2011:	ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలుపు
2014:	ఎమ్మెల్యేగా గెలుపు, సీఎం కేసీఆర్ క్యాబినెట్‌లో వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు
2018:	ఆరోసారి ఎమ్మెల్యేగా గెలుపు. అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నిక



స్పీకర్ పదవికి నామినేషన్ పత్రాలు దాఖలుచేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో సీఎం కేసీఆర్, భట్టివిక్రమార్క, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు

స్పీకర్ పోచారం



మూడోపేజీ తరువాయి...

కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఏకగ్రీవానికి సీఎం కేసీఆర్ పిలుపు

సీఎం కేసీఆర్ బుధవారం విపక్ష పార్టీల నాయకులకు ఫోన్‌చేశారు. స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుందామని కోరారు. సీఎం కేసీఆర్ ప్రతిపాదనకు అన్ని పార్టీల అధ్యక్షులు అంగీకారం తెలిపారు. టీఆర్‌ఎస్ ప్రతిపాదించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు తెలిపారు. దీంతో పోచారం ఏకగ్రీవంగా ఎన్నికకానున్నారు.

సభ్యులకూ మాట్లాడే అవకాశమివ్వండి.. కేటీఆర్ చమత్కారం

అసెంబ్లీ స్పీకర్‌గా పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేరు ఖరారై, నామినేషన్ దాఖలుచేసే సందర్భంగా పలువురు మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఆయనను అభినందించారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పోచారంను ప్రత్యేకంగా అభినందించారు. అసెంబ్లీలో సభ్యులకు కూడా మాట్లాడే అవకాశమివ్వాలంటూ ఛలోక్తి విసిరారు. భట్టి విక్రమార్క తదితర ప్రతిపక్ష సభ్యులు 'పోచారంను స్పీకర్‌గా నిర్ణయించారు.. సభ్యులకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వాలి' అంటున్నారని పోచారంతో చెప్పారు. పోచారం సుదీర్ఘంగా మాట్లాడుతారనే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారని తెలిసింది. దీంతో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి. పోచారంను అభినందించినవారిలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు టీ హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్దన్, షకీల్, గంప గోవర్ధన్, వనమా వెంకటేశ్వరరావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటల అభివృద్ధికి సహకరిస్తాం

- ఫ్లోరిడా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రమేశ్‌రెడ్డి వెల్లడి
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సందర్శించిన శాస్త్రవేత్త
- సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి సంసిద్ధత

హైదరాబాద్, నమస్తేతెలంగాణ : రాష్ట్రంలో ఉద్యాన పంటల అభివృద్ధికి సహకరిస్తామని, తెలంగాణ ప్రభుత్వం ముందుకువస్తే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఫ్లోరిడా వ్యవసాయ విశ్వవిద్యాలయం భూసార, నీటి విభాగం శాస్త్రవేత్త రమేశ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి చెందిన కే రమేశ్‌రెడ్డి అమెరికాలోని ఫ్లోరిడాలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం హైదరాబాద్ జీడిమెట్ల, ములుగులోని ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించారు. జీడిమెట్లలోని సెంటర్‌లో కూరగాయలు, పూలసాగుపై జరుగుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. ములుగులో పండ్లతోటల అభివృద్ధిపై జరుగుతున్న పనులను ప్రశంసించారు. ఉద్యానశాఖ తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న వినూత్నమైన కార్యక్రమాలపై సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే ప్రథమంగా రైతుల మేలుకోసం 24 గంటల విద్యుత్, ఎకరానికి రూ.4వేల పెట్టుబడి సాయం ఇవ్వడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. రాష్ట్రంలో ఉద్యానరంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, యురోపియన్ దేశాలకు సెప్టెంబర్ నుంచి మార్చి వరకు కూరగాయలు ఎగుమతి చేసే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సంచాలకులు ఎల్.వెంకట్రామిరెడ్డి, ఉపసంచాలకులు బీ బాబు, ఎంవీ మధుసూదన్, వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.



జీడిమెట్లలోని సెంటర్‌లో కూరగాయలు, పూల సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రమేశ్‌రెడ్డి

పాఠ్యపుస్తకాల ముద్రణ మొదలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రక్రియ మొదలైంది. గత ఏడాది మాదిరిగానే దాదాపు 1.30 కోట్ల ఉచిత పాఠ్యపుస్తకాల ముద్రణకు ప్రైవేటు ప్రింటర్ల నుంచి పిలిచిన టెండర్ల దాఖలు గడువు తేదీ ముగిసింది. సుమారు 50 మంది ప్రింటర్లు టెండర్లు దాఖలుచేయగా, ఎంపిక కోసం వీడియో ద్వారా భౌతిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రైవేటు ప్రింటింగ్ ముద్రణ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి వీడియో షూట్ చేస్తున్నామని, దీనివల్ల పారదర్శకత మరింత పెరుగుతుందని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణ సంస్థ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వరశర్మ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కోసం డీఈవోల ద్వారా సేకరించిన వివరాలతోపాటు డైస్ డాటాను పరిగణనలోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు దారి మళ్లకుండా సీరియల్ నంబర్లను వేస్తున్నట్టు తెలిపారు. సీరియల్ నంబర్ల విధానాన్ని కొనసాగిస్తున్నామని, దీనివల్ల ఏ పుస్తకం ఎక్కడకు చేరిందనే వివరాలు రికార్డుల్లో భద్రంగా ఉంటాయని వెల్లడించారు.

పదిశాతం పెరుగనున్న సేల్ పుస్తకాల ధరలు

ప్రింటర్లు దాఖలుచేసిన టెండర్లను ఈ నెల 29న తెరువనున్నారు.పేపర్ టెండర్ల ప్రక్రియ కూడా మొదలవుతుంది. ఉచిత పాఠ్యపుస్తకాల ముద్రణ కోసం దాదాపు 6,500 టన్నుల కాగితం అవసరం ఉంటుందని ముద్రణ సంస్థ డైరెక్టర్ తెలిపారు. దాదాపు 1.23 కోట్ల సేల్ పుస్తకాల ముద్రణ కూడా వచ్చేనెలలో ప్రారంభం కానుంది.



34 ఏండ్ల తర్వాత ఏకగ్రీవంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చింతలపేట పంచాయతీ పాలకవర్గం

34 ఏండ్లకు చింతలపేట జీపీ ఏకగ్రీవం

మారుతీనగర్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చింతలపేట పంచాయతీ పాలకవర్గం 34 ఏండ్లకు ఏకగ్రీవమైంది. 1978లో బీసీ జనరల్‌కు రిజర్వుకాగా తోట్ల లింగం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1985లో మరోమారు గోరుమంతుల భూమయ్యను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పటి నుంచి ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. కాగా 34యేండ్లకు తిరిగి ఇక్కడ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. తాజాగా నూతన సర్పంచ్‌గా మ్యాకల అర్చన, ఉపసర్పంచ్‌గా గోపిడి ముత్యంరెడ్డి, వార్డు సభ్యులుగా అలిశెట్టి కొమురమ్మ, గోపిడి అంజమ్మ, పత్తం గంగాధర్, మాదం లక్ష్మి, ఇప్ప గంగాధర్, పుప్పాల లింగారెడ్డి, మునుగూరి సుశీల ఎన్నికయ్యారు. నూతన పాలక వర్గాన్ని గురువారం స్థానికులు సన్మానించారు.



వరికోలు అతివలదే

సర్పంచ్, వార్డు సభ్యులంతా మహిళలే.. ఏకగ్రీవంగా ఎన్నిక



సాదు నిర్మల

పరకాల, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా నడికూడ మండలం వరికోలు గ్రామపంచాయతీ అతివల సొంతమైంది. జనరల్ మహిళకు రిజర్వు కావడంతో గ్రామంలో సర్పంచ్‌తోపాటు 12మంది వార్డుసభ్యులు మహిళలే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రోత్సాహంతో గ్రామమంతా ఐక్యతారాగంతో ముందుకు వెళ్తున్నది. వరంగల్ ఎంపీ ఉప ఎన్నికల నుంచి మొదలు ఆ గ్రామం ఏ ఎన్నిక వచ్చినా టీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్నది. వంద శాతం ఓట్లను అప్పటి ఎంపీ అభ్యర్థి పసునూరి దయాకర్‌కు వేసి గెలిపించుకుని నూరుశాతం అభివృద్ధి నినాదంతో రాష్ట్రస్థాయిలో వరికోలు గ్రామం ఆదర్శంగా నిలిచింది. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన స్ఫూర్తితో గ్రామ సర్పంచ్ నుంచి మొదలుకొని వార్డుసభ్యులంతా మహిళలే కావడం.. అదీకూడా ఏకగ్రీవం కావడంతో ఆ గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలంతా సంబురాలను చేసుకున్నారు. టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. సర్పంచ్‌గా సాదు నిర్మల సమ్మిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ స్థానానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కృషితో మిగతా ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో గ్రామ సర్పంచ్‌గా నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా 12 వార్డు సభ్యుల స్థానాలకు కూడా మహిళలే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తంగా వరికోలు పంచాయతీని టీఆర్ఎస్ కైవసం చేసుకున్నది.

సోపానం

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకు

ఉద్యమకారుడు మొలుగూరి భిక్షపతి ప్రస్థానం



వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా పరకాలకు చెందిన మొలుగూరి భిక్షపతి సర్పంచ్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించి శాసనసభ్యుడిగా ఎదిగారు. పరకాల మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా రెండుసార్లు గెలుపొందారు. టీఆర్ఎస్ ఉద్యమ నాయకుడిగా, జెడ్పీ వైస్‌చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు ఆ ప్రాంత ప్రజల ప్రశంసలు అందుకున్నారు. 1955లో పరకాలలో జన్మించిన మొలుగూరి భిక్షపతి బీకాం వరకు చదివారు. 1983లో టీడీపీలో చేరారు. 1996లో పరకాల మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా గెలుపొంది కాంగ్రెస్ కంచుకోటను బద్దలుకొట్టారు. 2001లో టీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్‌గా మరోసారి గెలిచి రికార్డు నెలకొల్పారు. 2006లో టీఆర్ఎస్ నుంచి పరకాల జెడ్పీటీసీగా విజయం సాధించి పార్టీ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో జెడ్పీ వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. 2009లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన మొలుగూరి.. 2012లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ తాజా ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపునకు కృషిచేశారు.

ఏకగ్రీవ వార్డుల్లో పోలింగ్ కేంద్రాల కుదింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన వార్డు స్థానాల్లో పోలింగ్ కేంద్రాలను తగ్గించనున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మార్పుచేసే పోలింగ్ కేంద్రాలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నది. ఏకగ్రీవమైన స్థానాల్లో ఒక్కో పోలింగ్‌కేంద్రంలో 600 మంది ఓటర్ల వరకు కల్పిస్తామని, 600 మంది ఓటర్ల కంటే ఎక్కువైతే మరో కేంద్రాన్ని పక్కనే ఏర్పాటు చేస్తామన్నారు.

రెండో విడుత ప్రచారం ప్రారంభం



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామపంచాయతీ వార్డు సభ్యులుగా ఎన్నికైన వారితో సర్పంచ్ యమున

- **మూడోవిడుత నామినేషన్లకు నేడు ఆఖరు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండోవిడుత నామినేషన్ల ఘట్టం ముగిసింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణలకు అవకాశం కల్పించి, తుది జాబితాను విడుదలచేశారు. ఈ సందర్భంగా బరిలో నిలిచే అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. శుక్రవారం నుంచి రెండోవిడుత ప్రచారంకూడా మొదలుకానున్నది. మూడోవిడుత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల స్వీకరణ ముగియనున్నది.

ఘన్‌పూర్ ఎంపీడీవోపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన వనపర్తి జిల్లా ఘన్‌పూర్ ఎంపీడీవో ఫయాజుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ శ్వేతా మహంతి ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో విచారణ జరిపి చర్యలు తీసుకొని.. ఘన్‌పూర్ ఎంపీడీవోగా వనపర్తి జిల్లా డీఆర్‌డీఏ ఏపీవో శంకరయ్యకు బాధ్యతలు అప్పగించినట్టు స్పష్టంచేశారు.

ఎపిక్‌కార్డు నంబర్ లేకున్నా ఓటరు స్లిప్పులు

పంచాయతీ ఎన్నికల్లో ఓటరు కార్డు ఎపిక్ నంబర్ తెలియనప్పటికీ ఓటరు స్లిప్పులు పొందవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. tsec.gov.in నుంచి ఓటరు స్లిప్పులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రెండో విడుతలోనూ ఏకగ్రీవాల జోరు

రెండోవిడుతనామినేషన్ల ఉపసంహరణ ముగియడం, బరిలోఉన్న అభ్యర్థుల తుదిజాబితా ప్రకటించడంతో పలుగ్రామాలు ఏకగ్రీవంగా నిలిచాయి. ముఖ్యంగా కొత్తగా ఆవిర్భవించిన పంచాయతీలు ఏకగ్రీవాలబాటలో ఉన్నాయి. సర్పంచ్ పదవికి ఒకే నామినేషన్ దాఖలైన పంచాయతీల్లో అధికారులు విచారణ జరిపి ఏకగ్రీవ పంచాయతీలుగా ప్రకటిస్తున్నారు. అలాంటి పంచాయతీల్లో గురువారం రాత్రి వరకు కొన్నింటిని ఏకగ్రీవ పంచాయతీలుగా ప్రకటించారు. కడపటి సమాచారం ప్రకారం రెండో విడుతలో ఎన్నికలు జరిగే పంచాయతీల్లో జిల్లాలవారీగా ఏకగ్రీవంగా ప్రకటించిన పంచాయతీల వివరాలు ఇలా ఉన్నాయి.

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగు మండలాల్లో 16 గ్రామాల సర్పంచులు, వార్డుసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో 6, వీర్నపల్లి మండలంలో 6, గంభీరావుపేట మండలంలో 3, ముస్తాబాద్ మండలంలో 1 చొప్పున సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- జగిత్యాల జిల్లాలో 22 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటిలో 19 గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలు మొత్తంగా ఏకగ్రీవమయ్యాయి. మెట్‌పల్లి మండలంలో 7, కోరుట్ల మండలంలో 3, మల్లాపూర్ మండలంలో 4, ఇబ్రహీంపట్నం మండలంలో 2 కథలాపూర్ మండలంలో 2, మేడిపల్లి మండలంలో 4 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- మహబూబాబాద్ జిల్లాలో 40 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మరిపెడ మండలంలో 19, కురవి మండలంలో 9, డోర్నకల్ మండలంలో 7, దంతాలపల్లి మండలంలో 3, చిన్నగూడూరు మండలంలో 2 జీపీలు ఏకగ్రీవమయ్యాయి.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 57, జోగుళాంబ గద్వాల జిల్లాలో 14, నాగర్‌కర్నూల్ జిల్లాలో 19 ఏకగ్రీవమయ్యాయి. వనపర్తి జిల్లాలో 20 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. అమరచింత మండలంలో 7, మదనాపూర్ మండలంలో 4, కొత్తకోట మండలంలో 4, పెద్దమందడి మండలంలో 5 పంచాయతీల్లో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- నల్లగొండ జిల్లాలో రెండోవిడుత జరిగే ఎన్నికల్లో మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 276 గ్రామపంచాయతీలు ఉండగా 52 పంచాయతీలు, 516 వార్డుస్థానాలు ఏకగ్రీవమయ్యాయి.
- సూర్యాపేట జిల్లాలో 26 పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు.
- పెద్దపల్లిజిల్లాలో తొమ్మిది పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- కరీంనగర్ జిల్లాలో ఐదు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- వరంగల్ రూరల్ జిల్లాలో 33 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- యాదాద్రిభువనగిరి జిల్లాలో 15 సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మోటకొండూర్ మండలంలో రెండు, ఆత్మకూర్ మండలంలో రెండు, రామన్నపేట మండలంలో రెండు, మోత్కూరు ఒకటి , అడ్డగూడూరు మండలంలో మూడు, వలిగొండ మండలంలో ఐదు పంచాయితీలు ఏకగ్రీవమయ్యాయి.
- వికారాబాద్ జిల్లాలో 18 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- ఆదిలాబాద్ జిల్లాలో 64 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- నిర్మల్ జిల్లాలో 25 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.
- కామారెడ్డి జిల్లాలో 52, నిజామాబాద్ జిల్లాలో 33 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

కన్నం వేసి కొల్లగొట్టారు!

- సొరంగం తవ్వి.. డీజిల్ పైప్‌లైన్‌కు రంధ్రం
- 1.40 లక్షల లీటర్ల డీజిల్ చోరీ
- చర్లపల్లిలో సినీ ఫక్కీలో దోపిడీ
- నలుగురు అరెస్టు..90 లక్షలు స్వాధీనం
- పరారీలో మరో 8 మంది



చర్లపల్లిలో సొరంగం తవ్వి డీజిల్ దొంగిలిస్తున్న దృశ్యం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకొన్న రూ.90 లక్షల నగదు

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సినీఫక్కీలో సొరంగం తవ్వి పైప్‌లైన్‌కు కన్నం వేసి డీజిల్ దొంగతనానికి పాల్పడ్డ ఓ ముఠాను రాచకొండ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ సంఘటన చర్లపల్లి ప్రాంతంలో చోటు చేసుకుంది. రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్‌భగవత్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ నుంచి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన డీజిల్‌ను చర్లపల్లి లోని ఇండియన్ అయిల్ కార్పొరేషన్ సంస్థకు సరఫరా చేస్తున్నారు. దీని కోసం ఘట్‌కేసర్ నుంచి చర్లపల్లి వరకు 17 కిలో మీటర్ల మేర ప్రత్యేక పైపులైన్ ఉంది. ముంబైలోని ముమ్రా ప్రాంతానికి చెందిన హఫీజ్ అజీజ్ చౌదరీ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జియాహూల్ చాంద్ షేక్ అలియాస్ చెడ్డీ బెంగాలి, హైదరాబాద్ బహదూర్‌పురా ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ అబ్రార్ నకిలీ కరెన్సీ సరఫరా, డీజిల్ దొంగతనాల కేసుల్లో ముంబైలో అరెస్టై జైలుకు వెళ్ళారు. అక్కడ పరిచయమైన ఈ ముగ్గురు పైపులైన్‌ల ద్వారా సరఫరావుతున్న డీజిల్‌ను చోరీ చేయాలని పథకం వేసుకున్నారు. హైదరాబాద్ యువతిని వివాహం చేసుకున్న హఫీజ్ అజీజ్ చౌదరీ, నగరానికి చెందిన అబ్రార్‌కు చర్లపల్లి ప్రాంతంపై అవగాహన ఉండడంతో చాంద్ షేక్‌తో కలిసి నవంబరు నెలలో రెక్కీ నిర్వహించారు. ఘట్‌కేసర్ నుంచి చర్లపల్లి వరకు పైపులైన్ ద్వారా డీజిల్ సరఫరా అవుతుందని ఈ మార్గంలో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డుల ద్వారా తెలుసుకొన్నారు. చర్లపల్లి వద్ద పైపులైన్‌కు ఆనుకుని ఉన్న ఓ స్థలాన్ని స్క్రాప్ గోడౌన్ పేరుతో లీజుకు తీసుకున్నారు. ఆ తర్వాత స్థలం చుట్టూ ఇనుప షీట్‌లను ఏర్పాటు చేసుకుని స్థలం నుంచి పైప్ లైన్ వరకు ఆరు అడుగుల లోతు, 9 అడుగుల పొడువుతో సొరంగాన్ని తవ్వారు. పైప్‌లైన్‌కు రంధ్రం చేసి మరో పైప్‌లైన్ ఏర్పాటు చేసుకొని ఖాళీ స్థలంలోకి తీసుకువచ్చారు. ఆ పైపులైన్ ద్వారా 1.40 లక్షల లీటర్ల డీజిల్‌ను చోరీచేశారు. దానిని ట్యాంకర్‌లను అద్దెకు తీసుకుని మధ్యవర్తుల ద్వారా ఫైనాన్సియర్ సహాయంతో వరంగల్, బాచుపల్లి, బూర్గుల,కోయల్‌కొండ, ధర్మాబాద్ ప్రాంతాల్లో మార్కెట్‌కు 5 నుంచి 10 రూపాయల తక్కువకు అమ్మేశారు. పైపులైన్‌కు రంధ్రం ఏర్పాటు చేసే సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకోకుండా ఉండేందుకు దుండగులు ఆధునిక కట్టింగ్ సామగ్రితో పాటు గోనె సంచిని నీటిలో తడిపి జాగ్రత్తలు తీసుకున్నారు. డిసెంబరులో రెండు అయిల్ కంపెనీల లెక్కల్లో తేడా రావడంతో వారు రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయడంతో ఈ ముఠా బండారం వెలుగులోకి వచ్చింది. మొత్తం ఈ కేసులో 12 మంది పాత్రను నిర్ధారించిన పోలీసులు హఫీజ్ అజీజ్ చౌదరి, అబ్రార్, బిన్ని శ్రీనివాసులు, మారోజు జయకృష్ణలను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.90 లక్షల నగదు, ఓ అయిల్ ట్యాంకర్, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో 8 మంది పరారీలో ఉన్నారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మ, క్రైం డీసీపీ నాగరాజు, క్రైం అదనపు డీసీపీ, షీ టీమ్స్ ఇంచార్జి సలీమా, కుషాయిగూడ ఏసీపీ శివకుమార్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన చలితీవ్రత

- ఉత్తరాదినుంచి వీస్తున్న శీతలగాలులు
- మరో రెండ్రోజులు ఇదే వాతావరణం

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉత్తరాదినుంచి వీస్తున్న శీతలగాలుల కారణంగా రాష్ట్రంలో చలితీవ్రత స్వల్పంగా పెరిగినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో సాధారణం కంటే రెండునుంచి నాలుగు డిగ్రీల మేర తగ్గుదల నమోదైనట్టు పేర్కొన్నారు. శుక్ర, శనివారాల్లోనూ ఇదేరకమైన వాతావరణ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నట్టు చెప్పారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాను పొగమంచు కమ్మేసింది. ఉదయం 10 గంటలవరకు మంచు తొలగడంలేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్నారు. అత్యల్పంగా సిద్దిపేట జిల్లాలో 9, మెదక్ 9.3, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 9.5, హైదరాబాద్‌లో 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సిద్దిపేట	9.0	35.2
మెదక్	9.3	34.6
ఆదిలాబాద్	9.5	29.8
మంచిర్యాల	9.5	29.8
కుమ్రంభీం ఆసిఫాబాద్	9.5	29.8
సంగారెడ్డి	9.7	34.6
వికారాబాద్	10.2	29.6
నాగర్‌కర్నూల్	10.2	34.6
జనగామ	10.8	32.1
మహబూబ్‌నగర్	10.8	34.6
యాదాద్రి	11.1	34.6
కరీంనగర్	11.3	35.1
పెద్దపల్లి	12.0	30.2
కామారెడ్డి	12.0	32.0
నిర్మల్	13.0	28.0
వరంగల్ అర్బన్	13.0	29.0
సూర్యాపేట	13.0	30.0
జగిత్యాల	13.0	33.0
మహబూబాబాద్	13.2	35.1
జోగుళాంబ గద్వాల	13.4	34.6
వనపర్తి	13.9	34.6
రంగారెడ్డి	14.0	30.0
హైదరాబాద్	14.0	30.0
మేడ్చల్‌మల్కాజిగిరి	14.0	30.0
నిజామాబాద్	14.4	30.1
వరంగల్ రూరల్	15.0	31.0
రాజన్నసిరిసిల్ల	15.0	32.0
ఖమ్మం	16.0	31.0
జయశంకర్	16.0	31.0
భద్రాద్రి కొత్తగూడెం	16.0	32.0
నల్లగొండ	17.0	31.0



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో ఎంపీ దత్తాత్రేయ తదితరులు

సహకారంతోనే శాంతి.. అభివృద్ధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్నిదేశాల మధ్య సహకారం, స్నేహపూర్వక ఒప్పందాల ద్వారానే శాంతి, అభివృద్ధి సాధ్యమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కేరళ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ సర్వేపల్లి వెంకటశేషగిరిరావు రచించిన 'ఇండియాస్ ఓషన్ నైబర్‌హుడ్ నరేంద్రమోదీస్ స్ట్రాటజీ ఇనీషియేటివ్స్' పుస్తకాన్ని గురువారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్చార్డీలో ఆవిష్కరించారు. ఎంసీఆర్‌హెచ్చార్డీ రూపొందించిన సారా లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించారు. మాజీ ఐఏఎస్ అధికారి మోహన్‌కందా తాను రచించిన 'ఎథిక్స్ ఇన్ గవర్నెన్స్ –రిజల్యూషన్ ఆఫ్ డైలమాస్' పుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందించారు.

బోధనా సిబ్బంది వివరాలు ఇవ్వండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత ఏడాది అఫిలియేషన్ పొందిన ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది పూర్తి వివరాలు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వివరాలను శనివారంలోగా ఇవ్వాలని జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదయ్య కోరారు. వివరాలు ఇవ్వని కాలేజీలకు అఫిలియేషన్‌ను నిలిపివేస్తామని హెచ్చరించారు.

స్వగ్రామాలకు చేర్చేందుకు సహకరించండి

- ఇరాక్‌లో చిక్కుకున్న 15 మంది నిజామాబాద్ జిల్లా వాసులు
- ఇండియా కాన్సులేట్‌కు సీఎస్ ఎస్కే జోషి విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : జీవనోపాధికోసం ఇరాక్‌కు వెళ్లి ఇబ్బందులు పడుతున్న 15 మంది తెలంగాణ వాసులను స్వగ్రామాలకు పంపేందుకు సహకరించాలని ఇరాక్‌లోని ఇండియా కాన్సులేట్ జనరల్‌ను సీఎస్ ఎస్కే జోషి కోరారు. ఏజెంట్ మోసం చేయడంతో భోజన, వసతిలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ ఆర్థిక సహాయం అందజేయడంతోపాటు విమాన ప్రయాణ సౌకర్యం కల్పించి వీలైనంత త్వరగా వారిని స్వగ్రామాలకు చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరాక్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల్లో కాటం మహేందర్‌రెడ్డి, వేల్పూర్ రాజేందర్, దారెడ్డి రాజు, లాదె రాజేశ్వర్, కాంతం లక్ష్మణ్, మెల్ల ప్రభాకర్, గుండ్ల భూమేశ్వర్, గనోజీ కృష్ణాకర్, శ్రీరాం లింబాద్రి, పుల్ల సాయన్న, గొల్ల గంగన్న, ఆలూరు గంగారెడ్డి, కొర్రా రవీందర్, బానోత్ చతుర్ సింగ్, బానోత్ వినోద్ ఉన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణతోపాటు ఉపాధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ద్వారా వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశం కల్పిస్తున్నట్టు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ ఎన్ కిశోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణాకాలం ఆరునెలలు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు 21వ తేదీ ఉదయం 10 గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని రామానంద తీర్థ గ్రామీణ సంస్థ కార్యాలయానికి రావాలని సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై న్యాక్‌తో యూకే ఎంవోయూ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/ మాదాపూర్: తెలంగాణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్).. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నేషనల్ ఓపెన్ కాలేజ్ నెట్‌వర్క్(ఎన్వోసీఎన్)తో స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్నది. గురువారం హైదరాబాద్‌లోని న్యాక్ క్యాంపస్‌లో ఎన్వోసీఎన్, డిపార్ట్‌మెంట్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (డీఎఫ్ఐడీ) ప్రతినిధులు న్యాక్‌తో ఒప్పందం కుదుర్చుకొన్నారు. సమావేశంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ కే భిక్షపతి, యుకే ఎన్వోసీఎన్ ప్రతినిధులు గ్రహం హాస్టింగ్ ఈవాన్స్, డాక్టర్ సునీల్‌అబ్రోల్, ఎంఎస్ ఝాన్సీ మ్యాథ్యూస్, ఎన్ఎస్‌డీసీ నుంచి నటరాజన్, సీఐఐ ఐజీబీసీ చైర్మన్ సీ శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ ప్రెసిడెంట్ జీ రాంరెడ్డి, న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయ మార్గాలపై కసరత్తు

- హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్ ప్రతినిధులతో ఆర్టీసీ ఈడీ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆదాయమార్గాలపై అన్వేషణ మొదలుపెట్టారు. ఆర్టీసీకి చెందిన ఖాళీస్థలాల్లో నెలకొల్పిన పెట్రోల్ బంకుల నిర్వహణ, వాటిపై వస్తున్న ఆదాయాన్ని పరిశీలించారు. టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ), సంస్థ కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో గురువారం బస్‌భవన్‌లో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులతో అధికారుల బృందం సమావేశమై సుదీర్ఘంగా చర్చించింది. ఆయిల్ అవుట్‌లెట్లలో మౌలిక సదుపాయాల కల్పన, సేల్స్‌రూం, టాయిలెట్లు తదితర సౌకర్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఈడీ పురుషోత్తం మాట్లాడుతూ.. సంస్థను బలోపేతం చేసేందుకు ఆర్టీసీకి ఉన్న ఖాళీస్థలాలను గుర్తించి.. వాటిని సక్రమంగా వినియోగించుకోవడంపై దృష్టిసారించాలని సూచించారు.

ఈ ఏడాది ఎనిమిది మంది సచివాలయ అధికారుల పదవీ విరమణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సచివాలయంలోని వివిధ విభాగాల్లో సెక్షన్ అధికారులుగా పనిచేస్తున్న ఎనిమిది మంది ఈ ఏడాది పదవీవిరమణ చేయనున్నట్టు జీఏడీ ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. దేవేందర్‌సింగ్ (వ్యవసాయం), నరహరి(జీఏడీ), బాలకృష్ణ(జీఏడీ), సర్వేశ్వరి(పంచాయతీరాజ్), రాంప్రసాద్(టీవీసీ), ప్రకాశ్‌రావు(రెవెన్యూ), పరిమళ(పాఠశాల విద్య), జనార్దన్‌రావు (జీఏడీ) పదవీ విరమణ చేయనున్నారు.

సీఐటీడీలో ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ

- దరఖాస్తు దాఖలుకు గడువు ఈనెల 25

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఎస్సీ నిరుద్యోగ యువతకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైనింగ్ (సీఐటీడీ) ద్వారా ఐదు కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ మాన్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–35 ఏండ్ల మధ్య వయసువారు ఈనెల 25వ తేదీలోపు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతోపాటు ధ్రువీకరణపత్రాలు, ఆధార్‌జిరాక్స్ ప్రతులను జోడించాలని సూచించారు.

సాయ్ డైరెక్టర్ సహా ఆరుగురి అరెస్ట్
అవినీతి కేసులో సీబీఐ దూకుడు

న్యూఢిల్లీ: భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) కేంద్రంలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) గురువారం దాడులు నిర్వహించింది. రూ. 19 లక్షల బిల్లు మంజూరు కోసం 3శాతం సొమ్మును లంచంగా డిమాండ్ చేసిన కేసులో సాయ్ డైరెక్టర్ ఎస్‌కే శర్మ , జూనియర్ అకౌంట్స్ అధికారి హరిందర్ ప్రసాద్, సూపర్‌వైజర్ లలిత్ జోళీ, యూడీసీ వీకే శర్మతో పాటు ప్రైవేట్ కాంట్రాక్టర్ మన్‌దీప్ అహుజా, అతని ఉద్యోగి యూనుస్‌ను సీబీఐ అరెస్ట్ చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని సాయ్ ప్రధానకేంద్రాన్ని గురువారం సాయంత్రం అధీనంలోకి తీసుకున్న సీబీఐ సిబ్బంది ఈ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సాయ్ డైరెక్టర్ జనరల్ నీలం కపూర్ లంచం వ్యవహారాన్ని సీబీఐ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తున్నది. 'ఆరునెలల కిందట సాయ్ డీజీ లంచం వ్యవహారాన్ని కేంద్ర క్రీడల శాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రంగంలోకి సీబీఐ దిగింది' అని సదరు అధికారి తెలిపారు. సాయ్ ప్రధాన కార్యాలయంలో గతేడాది కాలంగా ఈ విషయంలో అవినీతి జరుగుతుందని పేర్కొన్నారు.



గెలిస్తే.. చరిత్రే!

నేడు ఆసీస్‌తో భారత్ మూడో వన్డే ■ నెగ్గితే తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ సొంతం ■ రాయుడు, సిరాజ్‌కు నో చాన్స్!

కొత్త ఏడాదిలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టేందుకు భారత్ సిద్ధమైంది. కంగారూ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించిన టీమ్ఇండియా.. ఇప్పుడు అదే బాటలో వన్డే సిరీస్‌నూ సాధించాలని కలలుకంటున్నది. ఈ నేపథ్యంలో నేడు ఆస్ట్రేలియాతో కీలకమైన మూడో వన్డే జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విరాట్‌సేన గెలిస్తే.. ఆసీస్‌లో ద్వైపాక్షిక సిరీస్ గెలిచిన తొలి భారత జట్టుగా మరో రికార్డును సొంతం చేసుకుంటుంది. దీంతో ఒకే పర్యటనలో రెండు అపురూపమైన, అద్వితీయమైన రికార్డులను చేజిక్కించుకోవాలని విరాట్ వీరులు తహతహలాడుతుండగా.. టెస్ట్ సిరీస్ ఓటమితో పరువు కోల్పోయిన ఆసీస్ ఎలాగైనా వన్డే సిరీస్‌ను గెలుచుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఇలాంటి రసవత్తర పరిస్థితుల మధ్య గెలిచేదెవరు? చరిత్రను సృష్టించేదెవరు? కాపాడుకునేదెవరు?.. వేచి చూడాలి..!

ఉదయం 7.50 నుంచి సోనీ సిక్స్‌లో

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గడ్డపై ఎదురులేకుండా దూసుకుపోతున్న భారత్ మరో కఠిన పరీక్షకు సిద్ధమైంది. 1-1తో సమంగా ఉన్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను గెలుచుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్న టీమ్ఇండియా.. నేడు ఆసీస్‌తో జరిగే తుది పోరులో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే విరాట్‌సేన మరో రికార్డును సొంతం చేసుకుంటుంది. కంగారూ గడ్డపై ఇప్పటివరకు వన్డే ఫార్మాట్‌లో భారత్ ద్వైపాక్షిక సిరీస్ గెలువలేదు. 1985లో వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ క్రికెట్, 2008లో సీబీ సిరీస్ గెలిచినా.. ఈ రెండూ ద్వైపాక్షిక సిరీస్‌లు కావు. కాబట్టి టెస్ట్ సిరీస్ ఇచ్చిన జోష్‌తో వన్డే ఫార్మాట్ రికార్డును కూడా కొల్లగొట్టాలని వీరాట్‌సేన లక్ష్యంగా పెట్టుకున్నది. 2016లో చివరిసారి ఆడిన ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ 1-4తో ఓటమిపాలైంది. అయితే ఆ సిరీస్‌లో మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో వన్డేలో భారత్ గెలువడం విశేషం. ఇప్పుడు కూడా సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు ఎంసీజీ ఆతిథ్యమిస్తుండటంతో సెంటిమెంట్ కలిసొస్తుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు 2018-19 పర్యటనలో టీమ్ఇండియా 1-1తో టీ20 సిరీస్‌ను డ్రా చేసుకోగా, 2-1తో చరిత్రాత్మక టెస్ట్ సిరీస్‌ను చేజిక్కించుకుంది. మిగిలింది వన్డే సిరీస్ కాబట్టి ఎలాగైనా దక్కించుకోవాలని విరాట్‌సేన కృతనిశ్చయంతో ఉంది.

ఐదో బౌలర్ ఎవరు?

రెండో వన్డే విజయంతో జోరుమీదున్న భారత్‌ను ఐదో బౌలర్ లోటు పీడిస్తున్నది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు సీనియర్ పేసర్లు భువనేశ్వర్, షమీ అంచనాలను అందుకున్నారు. స్పిన్నర్లు కుల్దీప్, జడేజా మిడిల్ ఓవర్లలో మ్యాచ్‌ను బాగా నియంత్రించారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గైర్హాజరీతో ఫుల్‌టైమ్ సీమర్ అందుబాటులో లేకుండా పోయాడు. అడిలైడ్, సిడ్నీలో ఈ లోటు స్పష్టంగా కనిపించింది. ఐదో బౌలర్‌గా ఖలీల్ అహ్మద్, హైదరాబాదీ సిరాజ్‌కు అవకాశం ఇచ్చినా ఘోరంగా విఫలమయ్యారు. దీంతో మరో బౌలర్ ఎవరనే దానిపై చర్చ మొదలైంది. ఐదో బౌలర్ వ్యూహాన్ని విరాట్ పెద్దగా పట్టించుకోకపోతే బ్యాట్స్‌మన్‌గా రాయుడుకు మరో అవకాశం దక్కుతుంది. లేదంటే సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ లేదా స్పిన్నర్ చాహల్‌లలో ఒకర్ని తీసుకోవచ్చు. గురువారం ఈ ఇద్దరు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చారు. శంకర్‌ను తీసుకుంటే మూడో సీమర్‌గా, అదనపు బ్యాట్స్‌మన్‌గా ఉపయోగపడుతాడు. కానీ బలమైన ఆసీస్ బ్యాట్స్‌మెన్ ముందు 10 ఓవర్ల కోటా పూర్తి చేసే సత్తా శంకర్‌కు ఉందా? అనే అనుమానాలు కూడా మొదలయ్యాయి. దీనికితోడు బ్యాటింగ్ లైనప్‌లో శంకర్ కోసం కేదార్ జాదవ్ స్థానాన్ని కూడా మార్చాల్సి వస్తుంది. సిరాజ్ పరుగులు నియంత్రించలేకపోవడం ప్రతికూలంగా మారగా, ఖలీల్‌కు మరో అవకాశం ఇస్తారో లేదో చూడాలి. ఎంసీజీలో బౌండరీ లైన్ పెద్దగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని చాహల్‌ను తీసుకుంటే పరుగుల నిరోధంతో పాటు వికెట్లు కూడా తీస్తాడని భావిస్తున్నారు. కాబట్టి ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో బరిలోకి దిగే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. రాయుడును పక్కనబెట్టి జాదవ్, శంకర్‌ను తీసుకొని 10 ఓవర్ల కోటా పూర్తి చేయాలన్న ఆలోచనలో కూడా మేనేజ్‌మెంట్ కనిపిస్తున్నది. సూపర్ ఫినిషర్ ధోనీ ఫామ్‌లోకి రావడం శుభసూచకం కాగా, నాలుగో స్థానానికి ప్రమోట్ అయ్యే అవకాశాలున్నాయి. రోహిత్, ధవన్, కోహ్లీ, కార్తీక్ యధాస్థానాల్లో ఆడనున్నారు.

ఆరంభం బాగాలేదు..

మరోవైపు ఆస్ట్రేలియాకు బ్యాటింగ్‌లో సరైన ఆరంభం దక్కడం లేదు. ఓపెనర్లు ఫించ్, క్యారీ.. టీమ్ఇండియా పేసర్లను చూసి భయపడుతున్నారు. తొలి రెండు వన్డేల్లో మిడిలార్డర్ పుణ్యమాని పరుగులు సాధించారు. ఈ మ్యాచ్ కోసం ఆసీస్ రెండు మార్పులు చేసింది. వెన్ను నొప్పితో బెహ్రెన్‌డార్ఫ్, ఫామ్ లేమితో నాథన్ లైయన్ తప్పుకోగా, వాళ్ల స్థానంలో లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, స్టాన్‌లేక్ జట్టులోకి వచ్చారు. ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌కు మరోసారి భంగపాటు ఎదురైంది. షాన్ మార్ష్ ఫామ్ కొనసాగితే భారత్‌కు కష్టాలు తప్పవు. అయితే హ్యాండ్స్‌కోంబ్, ఖవాజా, స్టోయినిస్ బ్యాట్లకు పనిచెప్పాల్సిన అవసరం వచ్చింది. ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించే మ్యాక్స్‌వెల్ ఆ స్థాయిలో ఆడకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. బౌలింగ్‌లో వెటరన్ సిడెల్ వికెట్లు తీయడంలో విఫలమవుతున్నాడు. రిచర్డ్‌సన్, స్టాన్‌లేక్ ప్రభావం చూపుతారో లేదో చూడాలి. మిడిలార్డర్‌లో కీలక భాగస్వామ్యాలను అడ్డుకుంటే ఈ మ్యాచ్‌లో భారత్ విజయం నల్లేరు మీద నడకే. ఓవరాల్‌గా ఆసీస్ బౌలింగ్‌కు, భారత్ బ్యాటింగ్ మధ్య జరిగే పోరులో గెలిచనొళ్లదే సిరీస్.



జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధవన్, ధోనీ, కార్తీక్, జాదవ్ / శంకర్, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్, ఖలీల్, షమీ.

ఆస్ట్రేలియా: ఫించ్ (కెప్టెన్), క్యారీ, ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టోయినిస్, మ్యాక్స్‌వెల్, సిడెల్, రిచర్డ్సన్, జంపా, స్టాన్‌లేక్.

9 ఎంసీజీలో ఆస్ట్రేలియాతో ఆడిన 14 వన్డేల్లో భారత్ తొమ్మిదింటిలో ఓడింది. చివరిసారిగా 2008లో సీబీ సిరీస్‌లో టీమ్ఇండియా ఇక్కడ మ్యాచ్ గెలిచింది.

పిచ్, వాతావరణం

డ్రాప్ ఇన్ పిచ్. పేసర్లకు బౌన్స్, స్వింగ్ లభిస్తుంది. పెద్ద బౌండరీ లైన్ కారణంగా స్పిన్నర్లు కచ్చితంగా ప్రభావం చూపుతారు. వర్షం ముప్పులేదు. ఉష్ణోగ్రత 41 డిగ్రీలు. ఎండ వేడిమి ఉంటుంది. సింగిల్స్, డబుల్స్ తీయడానికి అనుకూలంగా ఉంటుంది.

క్రికెటర్లు కూడా మనుషులే.. తప్పులు చేస్తుంటారు


గంగూలీ

ముంబై: జీవితంలో ప్రతి ఒక్కరు ఏదో ఓ దశలో తప్పులు చేస్తుంటారని, వాటిని సరిదిద్దుకుని ముందుకెళ్లాలని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. కాఫీ విత్ కరణ్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలను దృష్టిలో పెట్టుకుని పైవిధంగా వ్యాఖ్యానించాడు. 'ప్రజలు పొరపాట్లు చేస్తుంటారు. వాటిపై తీవ్రంగా స్పందించకూడదు. తప్పు చేసినవారు దానిని తెలుసుకుని మరింత మెరుగైన వ్యక్తులుగా మారుతారు. ఆ నమ్మకం నాకు ఉంది. తప్పు చేయకుండా ఉండటానికి క్రికెటర్లేమీ యంత్రాలు కాదు. వాళ్లు కూడా మనుషులే. మరోసారి అలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటూ ముందుకెళ్లాలి. పాండ్యా, రాహుల్ ఇప్పటికే చాలా కుమిలిపోతున్నారు' అని దాదా పేర్కొన్నాడు. క్రికెటర్లలో చాలా మంది అణుకువగా ఉంటారన్నాడు. చాలా మంది తనకు వ్యక్తిగతంగా తెలుసని, ఎప్పుడూ పొరపాట్లు చేయరని స్పష్టం చేశాడు. 'ఈ తరం క్రికెటర్లు చాలా విధేయులుగా ఉంటారు. చాలా అణుకువగా, గౌరవంగా మసలుకుంటారు. ఎప్పుడో ఓ సారి చిన్నచిన్న పొరపాట్లు చేస్తారు. వ్యక్తిగతంగా చాలా మందితో నాకు పరిచయాలు ఉన్నాయి. విరాట్‌ను చూడండి. అందరికీ ఆదర్శప్రాయుడుగా ఉంటాడు. భారత్ ఓ అదృష్ట దేశం. ప్రతి తరంలో అందరినీ అలరించే, ఆకట్టుకునే క్రికెటర్లను అందిస్తున్నది. ఒకప్పుడు గవాస్కర్, తర్వాత సచిన్. అతరి కెరీర్ ముగియగానే ఎవరు వస్తారని ఎదురుచూశాం. కోహ్లీ రూపంలో గొప్ప క్రికెటర్ మనకు లభించాడు. చాలా మంది క్రికెటర్లు స్వతహాగా మంచి మనుషులు. మధ్య తరగతి నుంచి పోరాటం చేసి ఈ స్థాయికి ఎదిగారు. కోట్లాది మంది క్రికెట్ ఆడేవారిలో కేవలం 11 మందినే ఎంపిక చేస్తామంటేనే ఊహించుకోవచ్చు' అని గంగూలీ వివరించాడు.

సుప్రీం దృష్టికి పాండ్యా, రాహుల్ వ్యవహారం

న్యూఢిల్లీ: రాహుల్, పాండ్యా సంఘటనలో అంబుడ్స్‌మన్‌ను నియమించేలా వెంటనే ఆదేశాలు ఇవ్వాలని సీవోఏ.. సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. గురువారం కోర్టు విచారణకు హాజరైన సీవోఏ న్యాయవాది పరాగ్ త్రిపాఠి.. ఇద్దరు క్రికెటర్ల విషయాన్ని జస్టిస్ ఏఎమ్ సప్రే, జస్టిస్ ఎస్‌ఏ బొబ్డేలతో కూడిన ధర్మాసనం ముందుకు తీసుకొచ్చారు. వాదనల అనంతరం వచ్చే వారం బీసీసీఐకి సంబంధించిన అన్ని అంశాలపై విచారణ చేపడుతామని కోర్టు స్పష్టం చేసింది. ఆరోగ్య కారణాలతో అమికస్ క్యూరీగా వ్యవహరించిన గోపాల్ సుబ్రమణియమ్ తప్పుకోగా, అతని స్థానంలో సీనియర్ న్యాయవాది పీఎస్ నరసింహన్‌ను నియమించింది.

జట్టు సమతూకంలో పాండ్యా కీలకం

ఐదో బౌలర్ లోటుపై ఆందోళన లేదు


ధవన్

మెల్‌బోర్న్: టీమ్ఇండియాలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తీసుకొచ్చే సమతూకం చాలా కీలకమని ఓపెనర్ శిఖర్ ధవన్ అభిప్రాయపడ్డాడు. అతను లేకపోవడం వల్ల ఏదో వెలితి కనిపిస్తుంటుందన్నాడు. అయితే పాండ్యా గైర్హాజరీతో ఐదో బౌలర్ లోటు ఏర్పడిందనే వార్తలను కొట్టిపారేశాడు. 'జట్టులో పాండ్యా ఉంటే మంచి సమతూకంగా ఉంటుంది. కేదార్ ఉన్నా కూడా మాకు బాగా కలిసొస్తుంది. అతనిది గోల్డెన్ ఆర్మ్. ఎప్పుడు బౌలింగ్‌కు దిగినా వికెట్ తీస్తాడు. లేదంటే భారీ భాగస్వామ్యాలను బాగా విడగొడుతాడు. టెస్ట్‌లు, పరిమిత ఓవర్లలో ఆల్‌రౌండర్లకు సమప్రాధాన్యం ఉంటుంది' అని ధవన్ పేర్కొన్నాడు. తొలి రెండు వన్డేల్లో ధారాళంగా పరుగులు సమర్పించుకున్న ఖలీల్, సిరాజ్‌లకు ఈ ఢిల్లీ ఓపెనర్ మద్దతిచ్చాడు. కుర్రాళ్లు పరిణతి సాధిస్తారని, వాళ్లపై ఒత్తిడి పెట్టొద్దని సూచించాడు. 'సిరాజ్, ఖలీల్ బౌలింగ్‌పై ఎలాంటి విచారం లేదు. వాళ్లు ఇప్పుడే జట్టులోకి వచ్చారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా గాడిలో పడుతారు. విఫలమైనప్పుడు వాళ్లకు మద్దతుగా నిలువాల్సిన అవసరం ఉంది. కుర్రాళ్లు కాబట్టి ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్నారు. మంచి జట్లపై ఆడుతున్నప్పుడు ఇది చాలా ఎక్కువగా ఉంటుంది. తప్పులు చేస్తుంటేనే పరిణతి సాధిస్తారు' అని శిఖర్ వివరించాడు. ఆసీస్ గడ్డపై తొలి ద్వైపాక్షిక సిరీస్ గెలిచి చరిత్ర సృష్టిస్తామని ధవన్ ఆశాభావం వ్యక్తం చేశాడు.


పంజాబ్, ప్రగ్వారాలో జరిగిన అంతర్జాతీయ స్పోర్ట్స్ కౌన్సిల్ గేమ్స్‌లో అండర్-14 విభాగం బాస్కెట్‌బాల్ టోర్నీలో విజయం సాధించిన తెలంగాణ బాలుర జట్టు. ఈ విజయంలో గిరిసాయి తేజ కీలకపాత్ర పోషించినట్లు జట్టు కోచ్ తెలిపారు.



ప్రేమలో పంత్!

భారత యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ తన ప్రేమ వ్యవహారాన్ని అభిమానులతో పంచుకున్నాడు. ఇన్‌స్టాగ్రాంలో అమ్మాయితో దిగిన ఫొటోను 'నా జీవితంలో సంతోషానికి నీవే కారణం..నిన్ను కూడా సంతోషంగా ఉంచాలని కోరుకుంటున్నా' అన్న కామెంట్‌తో షేర్ చేశాడు. ఆ అమ్మాయి పేరు ఇషా నేగి. తను ఇంటీరియర్ డిజైనర్. ఇషా కూడా 'మై మ్యాన్, మై సోల్‌మేట్, మై బెస్ట్‌ఫ్రెండ్, లవ్ ఆఫ్ మై లైఫ్' అన్న కామెంట్‌తో షేర్ చేయడం విశేషం. దీంతో వీరిద్దరూ గాఢమైన ప్రేమలో ఉన్నారని స్పష్టంగా తెలుస్తున్నది. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో యువ వికెట్‌కీపర్ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకున్న పంత్..కుటుంబంతో సరదాగా గడుపుతున్నాడు.

కేరళ సంచలనం

తొలిసారి రంజీ సెమీస్‌లోకి..


థంపి (5/27)

వాయనాడ్: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కేరళ క్రికెట్ జట్టు.. రంజీ ట్రోఫీలో సంచలనం సృష్టించింది. బాసిల్ థంపి (5/27), సందీప్ వారియర్ (4/30) బౌలింగ్‌లో చెలరేగడంతో.. గురువారం మూడో రోజే ముగిసిన సెమీస్ మ్యాచ్‌లో 113 పరుగుల తేడాతో గుజరాత్‌పై ఘన విజయం సాధించింది. దీంతో ఆరు దశాబ్దాల తర్వాత తొలిసారి సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. 2017-18 సీజన్‌లో తొలిసారి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించినా.. విదర్భ చేతిలో ఓడింది. కేరళ నిర్దేశించిన 195 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ రెండో ఇన్నింగ్స్‌లో 31.3 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. రాహుల్ షా (33 నాటౌట్) టాప్ స్కోరర్. రావల్ (17) ఫర్వాలేదనిపించారు. ఈ ఇద్దరు ఐదో వికెట్‌కు 39 పరుగులు జోడించారు. సందీప్, థంపి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 9 మంది బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కేరళ 185 పరుగులకు ఆలౌట్‌కాగా, గుజరాత్ 162 పరుగులకే పరిమితమైంది. కేరళ రెండో ఇన్నింగ్స్‌లో 171 పరుగులకు ఆలౌట్‌కావడంతో గుజరాత్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. బాసిల్ థంపికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. సెమీస్‌లోనూ ఇదే తరహా ప్రదర్శన కొనసాగిస్తామని కేరళ కెప్టెన్ సచిన్ బేబీ, కోచ్ డేవ్ వాట్‌మోర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

క్వార్టర్ ఫైనల్లో సైనా, శ్రీకాంత్

కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, శ్రీకాంత్.. మలేసియా మాస్టర్స్‌లో దూసుకుపోతున్నారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఏడోసీడ్ సైనా 21-14, 21-16తో పియు ఇన్ ఇప్ (హాంకాంగ్)పై గెలిచి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. 39 నిమిషాల ఏకపక్ష పోరులో సైనా అన్ని రంగాల్లో అద్భుత ప్రదర్శనను చూపెట్టింది. క్వార్టర్స్‌లో సైనా.. రెండోసీడ్ నజోమి ఒకుహర (జపాన్)తో తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో 8-4 ఆధిక్యంలో ఉన్న హైదరాబాద్ స్టార్.. చివరి రెండు టోర్నీల్లో ప్రత్యర్థిని వరుసగా చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. రెండోరౌండ్‌లో శ్రీకాంత్ 23-21, 8-21, 21-18తో వోంగ్ వింగ్ కీ విన్సెంట్ (హాంకాంగ్)పై చెమటోడ్చి నెగ్గాడు. మరో మ్యాచ్‌లో పారుపల్లి కశ్యప్ 17-21, 23-25తో ఆంథోని సునిస్కా (ఇండోనేషియా) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని-సిక్కీ రెడ్డి 18-21, 17-21తో ఇండోనేషియా ద్వయం నీ కెటుట్-రిజ్కీ అమిలియా చేతిలో ఓడి ఇంటిముఖం పట్టారు.

మూడోరౌండ్‌లో సెరెనా, హలెప్

సోంగాపై విజయంతో టాప్‌సీడ్ జకోవిచ్ ముందంజ ■ రెండోరౌండ్‌లో పరాజయం పాలైన వారెంకా ■ ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: అమెరికా నల్లకలువ సెరెనా విలియమ్స్, టాప్‌సీడ్ సిమోన్ హలెప్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడోరౌండ్‌కు దూసుకెళ్లారు. సెరెనా 6-2,6-2 స్కోరుతో వరుససెట్లలో కెనడా అమ్మాయి యెజెనీ బౌచర్డ్‌ను చిత్తుగా ఓడించింది. అత్యధిక గ్రాండ్‌స్లామ్స్ సాధించిన టెన్నిస్ దిగ్గజం ఎవర్ట్ రికార్డు (24 గ్రాండ్‌స్లామ్స్)దిశగా సాగుతున్న సెరెనా(23) ఈ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడింది. యూఎస్ ఓపెన్ ఫైనల్లో అనూహ్యంగా ఒసాకా చేతిలో కంగుతిన్న సెరెనా.. మళ్లీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తాజాగా బరిలోకి దిగింది. అప్పట్లో చైర్ అంపైర్‌పై సెరెనా నోరు చేసుకున్న విషయం తెలిసిందే. ఆటలో పాత సెరెనాను గుర్తుకు తెస్తూ అమెరికా స్టార్ రికార్డు విజయం దిశగా మరో అడుగు ముందుకు వేసింది. కొత్త ఏడాదిలో తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రుమేనియా స్టార్ హలెప్ రెండోరౌండ్‌లో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొంది. అమెరికా టెన్నిస్ భామ సోఫియా కెనిన్‌తో జరిగిన రెండోరౌండ్ పోరులో హలెప్ 6-3,6-7 (5/7), 6-4 స్కోరుతో కష్టపడి గెలిచింది. గురువారం జరిగిన ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో జపాన్ నయాస్టార్ నవోమి ఒసాకాతోపాటు పురుషుల సింగిల్స్‌లో కీ నిషికోరి సైతం మూడోరౌండ్‌కు దూసుకెళ్లడం విశేషం. కాగా, 2014 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ , స్విట్జర్లాండ్ ఆటగాడు స్టాన్ వారెంకా కథ రెండోరౌండ్‌లోనే ముగిసింది. 7-6(7-4),6-7(6-8),6-7(5-7) స్కోరుతో మొనాకోకు చెందిన మిలోస్ రవోనిచ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. వరుసగా మూడుసెట్ల ఫలితం ట్రైబ్రేకర్‌లో తేలడం విశేషం. మహిళల సింగిల్స్‌లో ఒసాకా 6-2,6-4 స్కోరుతో జిదాన్‌సెక్‌ను చిత్తుగా ఓడించింది. 6-3,4-6,6-0తో అమెరికా వెటరన్ వీనస్ విలియమ్స్ ..కార్నెట్‌పై విజయం సాధించగా.. ప్లిస్కోవా 4-6,6-1,6-0తో బ్రింగిల్‌పై విజయంతో మూడోరౌండ్ చేరింది.


సెరెనా

మూడోరౌండ్‌లో జొకోవిచ్

మళ్లీ ఫాంలోకి వచ్చిన టాప్‌సీడ్, క్రొయేషియా స్టార్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడోరౌండ్ చేరుకున్నాడు. ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్‌పై గురిపెట్టిన జొకో..6-3,7-5,6-4 స్కోరుతో ఫ్రాన్స్ వెటరన్ జో విల్‌ఫ్రెడ్ సోంగాపై వరుససెట్లలో సునాయాసంగా విజయం సాధించాడు. మూడోసీడ్ ఫెదరర్, రెండోసీడ్ నాదల్ కూడా మూడోరౌండ్ చేరడంతో ఈ సారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈ త్రయం పోరు ప్రేక్షకులకు కనులవిందు కానుంది. మరో మ్యాచ్‌లో ఏడోసీడ్ డొమినిక్ థీమ్ గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. వైల్డ్‌కార్డ్ ద్వారా మెయిన్‌డ్రాకు చేరిన ఆస్ట్రేలియన్ అలెక్సీ పొపీరిన్ 7-5,6-4,2-0తో ఆధిక్యంలో ఉన్న దశలో థీమ్ తప్పుకోవడంతో విజయంతో మూడోరౌండ్ చేరుకున్నాడు. జపాన్ నంబర్‌వన్ ఆటగాడు కీ నిషికోరి 6-3,7-6((6-8),5-7,5-7,7-6(10-7)స్కోరుతో హోరాహోరీగా పోరాడి కార్లోవిచ్‌ను ఓడించి ముందంజ వేశాడు.

సెన్సెక్స్	నిఫ్టీ
36,374	10,905
↗53	↗15

ముడి చమురు (బ్రెంట్) ↘ 61.03 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	33,300
22 క్యారెట్లు	33,150
వెండి (కిలో)	40,200

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.50	75.00
యూరో	77.80	85.80
బహ్రెయిన్ దినార్	182.00	194.00
కువైట్ దినార్	226.10	239.10
సౌదీ రియాల్	18.00	19.80
యూఏఈ దిర్హామ్	18.40	20.00

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	87.00
రిటైల్ లైవ్	109.00
డ్రెస్డ్	158.00
స్కిన్‌లెస్	180.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	418-00
రంగారెడ్డి	418-00
మెదక్	418-00
కరీంనగర్	420-00
వరంగల్	420-00
రిటైల్ ప్రైస్	4-80

హెచ్చుతగ్గులు తీవ్రం లాభం స్వల్పం



తీవ్ర ఒడిదుడుకుల మధ్య చివరకు స్వల్ప లాభాలతో మార్కెట్ ముగిసింది. గ్లోబల్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడ్ అవుతుండడం, రిలయన్స్, హెచ్‌యూఎల్ వంటి ఇండెక్స్ హెవీ వెయిట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు వెలువడుతుండడంతో రోజంతా లాభనష్టాల పరంపరతో ట్రేడ్ అయింది. సెన్సెక్స్ దాదాపు 300 పాయింట్ల ఒడిదుడుకుల తర్వాత కేవలం 52.79 పాయింట్ల లాభంతో 36,374.08 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 14.90 పాయింట్ల స్వల్ప లాభంతో 10,905.20 వద్ద నిలిచింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ బలహీన పడుతుండడంతో ఐటీ షేర్ల ధరలు పుంజుకున్నాయి. దీంతో ఇండెక్స్ నష్టాల నుంచి బయటపడింది. దేశీయంగా పాజిటివ్ ట్రిగ్గర్స్ లేకపోవడంతో మార్కెట్‌లో గరిష్ఠ స్థాయిల్లో లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు మొగ్గుచూపారు. సమీప భవిష్యత్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప రేంజ్‌లోనే ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రియల్టీ ఇండెక్స్ 1.19 శాతం లాభపడగా, ఐటీ ఇండెక్స్ 0.63 శాతం, ఆర్థిక సేవల రంగం 0.43 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.16 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, మీడియా ఇండెక్స్ 2.08 శాతం, ప్రభుత్వరంగ బ్యాంకింగ్ ఇండెక్స్ 1.56 శాతం, ఫార్మా ఇండెక్స్ 1.56 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.28 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం చొప్పున నష్టపోయాయి. ఎన్‌ఎస్‌ఈలో మార్కెట్ బ్రెడ్త్ కూడా నెగటివ్‌గా ఉంది. మొత్తం 1,096 షేర్లు నష్టపోగా, 667 షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. నిఫ్టీలో 27 షేర్లు నష్టపోగా, 23 షేర్లు లాభాలతో ముగిశాయి. గెయిల్ 2.23 శాతం లాభపడగా, బీపీసీఎల్ 1.99 శాతం, ఇన్‌ఫ్రాటెల్ 1.78 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.64 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 1.55 శాతం లాభపడ్డాయి. కాగా, సన్‌ఫార్మా 6.61 శాతం నష్టపోగా, యెస్ బ్యాంక్ 3.70 శాతం, జీఎంటర్‌టెయిన్‌మెంట్ 2.50 శాతం, ఐషర్ మోటార్స్ 1.93 శాతం, ఎస్‌బీఐ 1.90 శాతం నష్టాలతో ముగిశాయి. ఎన్‌ఎస్‌ఈలో 7 షేర్లు కొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేయగా, 46 షేర్లు కొత్త 52 వారాల కనీస స్థాయిని నమోదు చేశాయి. ఎఫ్‌ఐఐలు రూ. 842.13 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా, డీఐఐలు రూ. 727.46 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు.

రిలయన్స్ రికార్డులు

క్యూ3లో రూ.10,251 కోట్ల లాభం ■ కార్పొరేట్ చరిత్రలో ఇదే గరిష్ఠం

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలో అతిపెద్ద కార్పొరేట్ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ రికార్డుల మీద రికార్డులు బద్దలుకొడుతున్నది. కార్పొరేట్ చరిత్రను తిరగరాస్తూ ఒక త్రైమాసికంలో రూ.10 వేల కోట్లకు పైగా నికర లాభాన్ని ఆర్జించిన సంస్థగా రికార్డు పుటల్లోకి ఎక్కింది. రిఫైనింగ్ మార్జిన్లు తగ్గుముఖం పట్టినప్పటికీ పెట్రో కెమికల్స్, రిటైల్, డిజిటల్ సేవల విభాగాల్లో మెరుగైన పనితీరు కనబర్చడం ఇందుకు దోహదం చేశాయి. చమురు నుంచి టెలికం వరకు సేవలు అందిస్తున్న సంస్థకు డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.10,251 కోట్ల(ప్రతిషేరుకు రూ.17.3) కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని నమోదు చేసుకున్నది. గతేడాది ఇదే సమయంలో వచ్చిన రూ.9,420 కోట్లతో పోలిస్తే 8.82 శాతం వృద్ధిని కనబరిచింది. మూడు నెలల్లో ఇంతటి లాభాన్ని ఆర్జించిన ప్రైవేట్ సంస్థగా ఆర్‌ఐఎల్ నిలిచింది. గతంలో ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) జనవరి-మార్చి 2013 మధ్యకాలంలో రూ.14,512.81 కోట్ల లాభాన్ని గడించింది. ఆదాయం విషయానికి వస్తే అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికి రూ.1,71,336 కోట్లు ఆర్జించింది. అంత క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే 56 శాతం ఎగబాకింది. వరుసగా 16 త్రైమాసికాలుగా లాభాలు ఆర్జించిన సంస్థగా మరో రికార్డును నెలకొల్పింది. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు తగ్గుముఖం పట్టడంతో చమురు రిఫైనింగ్ బిజినెస్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ రిటైల్ స్టోర్ల సంఖ్యను పెంచడం, జియో వినియోగదారులు సంఖ్య భారీగా పెరుగడం లాభాలు పుంజుకోవడానికి దోహదపడ్డాయని ఆర్‌ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ తెలిపారు. కంపెనీ చరిత్రలో గడిచిన త్రైమాసికం మరో మైలురాయిగా నిలిచిందని, ముఖ్యంగా లాభాల్లో పది వేల కోట్ల రూపాయలు దాటడంతో వాటాదారులు, దేశ విలువ కూడా మరింత పెరిగిందని ఆర్థిక ఫలితాల సందర్భంగా ఆయన వెల్లడించారు. చమురు ధరలు తీవ్ర ఆటోపోటులకు గురైనప్పటికీ పనితీరు మెరుగుపడటం విశేషమన్నారు.



జియో లాభం రూ.831 కోట్లు

ఇతర టెలికం సంస్థలు భారీ నష్టాలను మూటగట్టుకుంటున్న ప్రస్తుత తరుణంలో రిలయన్స్ జియో వరుసగా లాభాలతో విరజిల్లుతున్నది. గడిచిన ఏడాదికాలంగా లాభాలను ప్రకటించిన సంస్థ..డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల్లోనూ రూ.831 కోట్ల లాభం వచ్చినట్లు ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.681 కోట్ల లాభంతో పోలిస్తే 65 శాతం ఎగబాకింది. వినియోగదారులు పెరుగడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వెల్లడించింది. ఏడాది క్రితం 16 కోట్లుగా ఉన్న కస్టమర్లు..గత నెల చివరినాటికి 28 కోట్లకు పెరిగారు. ప్రతి భారతీయుడికి, ప్రతిదీ, ప్రతిచోట అందించాలనే తమ లక్ష్యం దిశగా చర్యలను వేగవంతం చేయడంతో ప్రపంచంలో అత్యధిక మొబైల్ డాటా నెట్‌వర్క్ కలిగిన సంస్థల్లో ఒక్కటిగా నిలిచినట్లు ముకేశ్ అంబానీ ఈ సందర్భంగా చెప్పారు. ఆదాయం విషయానికి వస్తే రూ.10,383 కోట్లు ఆర్జించింది. 2017-18 ఇదే సమయంలో వచ్చిన రూ.6,879 కోట్లతో పోలిస్తే 50.9 శాతం ఎగబాకింది. సరాసరిగా ఒక్కో వినియోగదారుడు నెలకు 10.8 జీబీల డాటాను, 794 నిమిషాల వాయిస్ కాల్స్ చేశారు. ఒక్కో వినియోగదారుడి ద్వారా రూ.130 ఆదాయం లభించింది.

ఆర్థిక ఫలితాల్లో ముఖ్యాంశాలు..

- **లాభం:** కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.10,251 కోట్లు(1.5 బిలియన్ డాలర్లు), గతేడాదితో పోలిస్తే 8.8 శాతం పెరిగింది.
- **ఆదాయం:** ఏడాది ప్రాతిదిపకన ఆదాయం 56.38 శాతం ఎగిసి రూ.1,60,299 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇది రూ.1,02,500 కోట్లుగా ఉన్నది.
- **జీఆర్‌ఎం:** ప్రతి బ్యారెల్‌ను శుద్ధిచేయడం ద్వారా సంస్థ 8.8 డాలర్ల ఆదాయం లభించింది. గతేడాది వచ్చిన 11.6 డాలర్లతో పోలిస్తే భారీగా తగ్గింది. రెండో త్రైమాసికంలో 9.5 డాలర్లుగా ఉన్నది.
- **రిటైల్:** రిటైల్ రంగం కూడా అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకున్నది. రూ.35,577 కోట్ల(89.3 శాతం వృద్ధి) ఆదాయంపై రూ.1,680 కోట్ల(2 రెట్లు పెరుగుదల) నికర లాభాన్ని ఆర్జించింది. 6,400 నగరాల్లో 9,907 రిటైల్ స్టోర్లను ఏర్పాటు చేసింది.
- **చమురు అన్వేషణ:** చమురు, గ్యాస్ విభాగం నుంచి లభించే ఆదాయం 27.5 శాతం తగ్గి రూ.1,182 కోట్లకు పరిమితమైంది.
- **ప్రతిషేరుపై ఆదాయం:** కంపెనీకి చెందిన ప్రతిషేరుకు రూ.17.3 ఆదాయం ఆర్జించింది. గతేడాది ఇది రూ.16గా ఉన్నది.
- **రుణం:** డిసెంబర్ 31తో ముగిసిన కాలానికి కంపెనీకి రూ.2,74,381 కోట్ల(39.3 బిలియన్ డాలర్లు) అప్పు ఉన్నది.
- **నగదు నిల్వలు:** ప్రస్తుతం సంస్థ వద్ద రూ.77,933 కోట్ల(11.2 బిలియన్ డాలర్లు) నగదు, నగదుకు సమానమైన ఆస్తులు ఉన్నాయి. వీటిలో బ్యాంక్ డిపాజిట్లు, ఫండ్లు, సీడీఎస్, ప్రభుత్వ బాండ్లు, ఇతర సెక్యూరిటీ బాండ్ల కింద ఉన్నాయి.
- **పెట్టుబడి:** గడిచిన త్రైమాసికంలో వ్యాపార విస్తరణకోసం రూ.27,274 కోట్లు(3.9 బిలియన్ డాలర్లు) నిధులను ఖర్చు చేసింది.

అరబిందో చేతికి ఆరు క్యాన్సర్ ఔషధాలు

న్యూఢిల్లీ, జనవరి 17: అమెరికాకు చెందిన స్పెక్ట్రమ్ ఫార్మాస్యూటికల్స్ నుంచి ఏడు ఆంకాలజీ ఇంజెక్టబుల్ ఉత్పత్తులను 300 మిలియన్ డాలర్లు (రూ. 2100 కోట్లు) వెచ్చించి కొనుగోలు చేయనున్నట్టు అరబిందో ఫార్మా ప్రకటించింది. దాదాపు 160 మిలియన్ డాలర్లను ముందస్తుగా నగదు రూపంలో చెలించనున్నట్టు తెలిపింది. ఈ మేరకు రెండు కంపెనీలు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం అరబిందో ఫార్మా అనుబంధ కంపెనీ ఆక్రోటెక్ బయోఫార్మా ఎల్‌ఎల్‌సీ 160 మిలియన్ డాలర్లను ముందస్తుగా చెల్లించనుంది. మిగిలిన 140 మిలియన్ డాలర్లను రెగ్యులేటర్ అనుమతులు వచ్చాక, అమ్మకాల లక్ష్యాలను చేరుకున్న తర్వాత చెల్లించనున్నారు. రుణాలు లేకుండా మొత్తం నగదు రూపంలోనే చెల్లిస్తున్నట్టు అరబిందో ఫార్మా ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికన్ బ్రాండెడ్ ఆంకాలజీ మార్కెట్‌లోకి విభిన్న ఉత్పత్తుల ప్రవేశానికి ఈ ఉత్పత్తుల కొనుగోలు దోహదపడుతుందని తెలిపింది. ఈ ఉత్పత్తులను కైవసం చేసుకోవడం ద్వారా అమెరికాలో ఇప్పటికే బహుళ ఆదరణ పొందిన, అనుభవం ఉన్న వాణిజ్య మౌలిక వసతులను చేజిక్కించుకున్నట్లైందని అరబిందో వెల్లడించింది. ఈ కొనుగోలు ద్వారా ఆక్రోటెక్ అమెరికా మార్కెట్‌లో ప్రవేశించడానికి మంచి వేదికలాగా పని చేస్తుందని, బ్రాండెడ్ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఉపయోగపడుతుందని అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ గోవిందరాజన్ తెలిపారు. ఈ లావాదేవీలు వచ్చే 90 రోజుల్లో పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. తొలి సంవత్సర కాలంలో 100 మిలియన్ డాలర్ల రెవెన్యూ వస్తుందని అంచనా వేస్తున్నట్టు అరబిందో తెలిపింది.

కీలక వడ్డీరేట్లను తగ్గించండి

■ ఆర్బీఐతో సమావేశంలో పరిశ్రమ విజ్ఞప్తి

ముంబై, జనవరి 17: రాబోయే ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లను తగ్గించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్‌కు వ్యాపార, పారిశ్రామిక వర్గాలు విజ్ఞప్తి చేశాయి. గురువారం ఇక్కడ పారిశ్రామిక సంఘాలతో దాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వృద్ధిరేటు పురోగతికి రెపో రేటును, రిజర్వ్ రేషియోలను తగ్గించాలని కోరాయి. వ్యవస్థలో ద్రవ్యకొరత ఇబ్బందులను తీర్చాలన్న సీఐఐ, అసోచామ్, ఫిక్కీలు.. ఇటీవల టోకు, చిల్లర ద్రవ్యోల్బణం గణాంకాలు గణనీయంగా తగ్గినందున వడ్డీరేట్లనూ తగ్గించాలన్నాయి.

24 గంటల్లో రూ.100 కోట్లివ్వాలి

లేదంటే డైరెక్టర్లు జైలుకే ■ ఉద్గారాల కేసులో ఫోక్స్‌వాగన్‌కు ఎన్‌జీటీ హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 17: జర్మనీ ఆటో రంగ దిగ్గజం ఫోక్స్‌వాగన్‌పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్బన ఉద్గారాల కేసులో గతంలో సూచించిన రూ.100 కోట్లను డిపాజిట్ చేయకపోవడాన్ని తీవ్రస్థాయిలో ఆక్షేపించింది. 24 గంటల్లోగా ఈ మొత్తాన్ని సమర్పించాలని, లేదంటే సంస్థ డైరెక్టర్లు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని గురువారం ఇక్కడ స్పష్టం చేసింది. ఫోక్స్‌వాగన్ తమ డీజిల్ కార్లలో నిబంధనలకు విరుద్ధంగా మోసపూరిత పరికరాన్ని బిగించిందని, దీనివల్ల దేశంలో పర్యావరణానికి హాని కలిగిందని ఎన్‌జీటీ నిరుడు నవంబర్ 16న ధ్రువీకరించింది. ఈ క్రమంలోనే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి రూ.100 కోట్లను డిపాజిట్ చేయాల్సిందిగా ఫోక్స్‌వాగన్‌ను ఎన్‌జీటీ ఆదేశించింది. ఈ డిపాజిట్‌ను కేవలం తాత్కాలిక ధరావతుగా పేర్కొన్న ఎన్‌జీటీ.. సీపీసీబీతోపాటు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్‌ఏఐ), నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లకు చెందిన నలుగురు సభ్యులతో ఓ సంయుక్త కమిటీని కూడా వేసింది. దీంతో మోతాదుకు మించి నైట్రోజన్ ఆక్సైడ్ ఉద్గారాలను ఫోక్స్‌వాగన్ డీజిల్ కార్లు విడుదల చేయడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగిందని, ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదంటూ రూ.171.34 కోట్ల జరిమానాను ఈ కమిటీ సిఫార్సు చేసింది. అయితే ముందుగా సూచించిన రూ.100 కోట్లనే ఫోక్స్‌వాగన్ ఇంతవరకు డిపాజిట్ చేయకపోవడంతో ఎన్‌జీటీ మండిపడింది. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా సదరు మొత్తాన్ని డిపాజిట్ చేయాలని ఎన్‌జీటీ చైర్‌పర్సన్ ఆదర్శ్ కుమార్ గోయల్, జస్టిస్ ఎస్‌పీ వంగ్డీలతో కూడిన ధర్మాసనం గడువు విధించింది. గడువు దాటితే డైరెక్టర్లు జైలుకు వెళ్లాల్సిందేనని హెచ్చరించారు.



నిబంధనలన్నీ మీరలేదు: ఫోక్స్‌వాగన్

మరోవైపు తమ సంస్థకు చెందిన అన్ని కార్లు భారతీయ ఉద్గార నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని ఫోక్స్‌వాగన్ ఇండియా అధికార ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. ఎన్‌జీటీ ఆదేశాన్ని ఇప్పటికే సుప్రీం కోర్టులో సవాల్ చేశామని చెప్పారు. అయినప్పటికీ ఎన్‌జీటీ ఆదేశం మేరకు రూ.100 కోట్లను డిపాజిట్ చేస్తామని అన్నారు. కాగా, 2016లో ఫోక్స్‌వాగన్ కార్ల వల్ల ఢిల్లీలో దాదాపు 48.678 టన్నుల నైట్రోజన్ ఆక్సైడ్ ఉద్గారాలు విడుదలైనట్లు అంచనా. బీఎస్-4 నిబంధనల ఆధారంగా పరిమితికి మించి కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయని ఏఆర్‌ఏఐ పరీక్షల్లో తేలడంతో 2015 డిసెంబర్‌లో 3,23,700 కార్లను ఫోక్స్‌వాగన్ రీకాల్ చేసింది. అయితే ఈ రీకాల్ పూర్తిగా వాలెంటరీ రీకాల్ అని, కాబట్టి నిబంధనల ఉల్లంఘన, జరిమానాల ప్రసక్తి తగదని ఫోక్స్‌వాగన్ వాదిస్తున్నది.

రూ.700 కోట్ల పెట్టుబడులకు సిద్ధం

■ జెట్ ఎయిర్‌వేస్ చైర్మన్ నరేష్ గోయల్



న్యూఢిల్లీ, జనవరి 17: ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న జెట్ ఎయిర్‌వేస్‌ను ఆదుకోవడానికి రూ.700 కోట్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ చైర్మన్ నరేష్ గోయల్ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తెలియచేశారు. కానీ కంపెనీలో తన వాటా 25 శాతం తగ్గకుండా ఉండేందుకోసమే ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించారు. కంపెనీలో వ్యూహాత్మక భాగస్వామి అయిన ఎతిహాద్..కంపెనీ నాయకత్వ బాధ్యతల నుంచి గోయల్ తప్పుకోవాలని షరతు విధించిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్‌కు రాసిన లేఖలో సంస్థలో తనకున్న షేర్లను తాకట్టు పెట్టైన రూ.700 కోట్ల వరకు నిధులు చొప్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కానీ ఈ మొత్తంతో కంపెనీలో తనకున్న వాటా 25 శాతం తగ్గకుండా చూడాలని షరతు విధించారు. ఒకవేళ ఇది సాధ్యం కాకపోతే..తాను కంపెనీలో పెట్టుబడులు పెట్టడం, షేర్లను తాకట్టుపెట్టడం కూడా సాధ్యం కాదని ఈ లేఖలో హెచ్చరించారు. లేకపోతే టేకోవర్ నిబంధనలు అమలు చేయకుండా సంస్థలో తన వాటాను 25 శాతానికి పెంచుకునేలా స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ అనుమతించాలని ఆయన కోరారు.

సైయెంట్ లాభం రూ.92 కోట్లు

హైదరాబాద్, జనవరి 17: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.92.1 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు రాష్ట్రానికి చెందిన ఐటీ సేవల సంస్థ సైయెంట్ ప్రకటించింది. 2017-18 ఇదే సమయంలో వచ్చిన రూ.87.8 కోట్ల లాభంతో పోలిస్తే 4.9 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 20.8 శాతం ఎగిసి రూ.1,187.6 కోట్లుగా నమోదైంది. ప్రస్తుతం సంస్థ వద్ద రూ.1,230 కోట్ల(176 మిలియన్ డాలర్లు) నగదు నిల్వలు ఉండటంతో వాటాదారులకు డివిడెండ్ పంచే ఉద్దేశంలో సంస్థ ఉన్నది. దీంతోపాటు టెక్నాలజీ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉన్నదని కంపెనీ ఎండీ, సీఈవో కృష్ణ బొడనపు తెలిపారు. సాధారణంగా మూడో త్రైమాసికంలో ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటాయని, సంస్థ ఆదాయ వృద్ధిలో 1.5 శాతం క్షీణించిందన్నారు. సెమికండక్టర్, కమ్యూనికేషన్ బిజినెస్ యూనిట్లు మందకొడి వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ నాలుగో త్రైమాసికంపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు.

ఆకట్టుకున్న హెచ్‌యూఎల్

■ క్యూ3లో 9 శాతం పెరిగిన లాభం



న్యూఢిల్లీ, జనవరి 17: ఎఫ్‌ఎంసీజీలో అతిపెద్ద సంస్థల్లో ఒకటైన హిందుస్థాన్ యునీలీవర్(హెచ్‌యూఎల్) ఆర్థిక ఫలితాలు ఆకట్టుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,444 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి నమోదైన రూ.1,326 కోట్ల లాభంతో పోలిస్తే 9 శాతం వృద్ధి కనబరిచింది. అమ్మకాలు పెరుగడం, మార్జిన్లు అధికమవడం ఇందుకు దోహదం చేశాయి. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 12.42 శాతం ఎగబాకి రూ.9,357 కోట్లకు చేరుకున్నట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. విలువ పరంగా చూస్తే దేశీయ అమ్మకాల్లో 13 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఎబిటా మార్జిన్లు 170 బేసిస్ పాయింట్లు అధికమయ్యాయని కంపెనీ సీఎండీ సంజీవ్ మెహతా తెలిపారు. గత త్రైమాసికంలో సంస్థ అన్ని రంగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిందని, అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదైందన్నారు. సమీక్షకాలంలో నిర్వహణ ఖర్చులు రూ.7,036 కోట్ల నుంచి రూ.7,652 కోట్లకు పెరిగాయి. రంగాల వారీగా చూస్తే హోమ్ కేర్ విభాగం నుంచి రూ.3,148 కోట్ల ఆదాయం సమకూరగా, పర్సనల్‌కేర్ ఉత్పత్తుల ద్వారా రూ.4,539 కోట్లు, ఆహార రంగాల నుంచి రూ.1,728 కోట్ల ఆదాయం లభించినట్లు వెల్లడించింది. స్వల్పకాలంపాటు డిమాండ్ నిలకడగా ఉండే అవకాశం ఉందన్న ఆయన..దేశ ఆర్థిక పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

ఎన్‌ఎండీసీ సాధిస్తుంది

■ వియత్నాం టంగ్‌స్టన్ గనిలో వాటాపై మిధాని ఆశాభావం

హైదరాబాద్, జనవరి 17: వియత్నాంలోని టంగ్‌స్టన్ గనిలో మైనారిటీ వాటాను ఎన్‌ఎండీసీ వచ్చే నెలలో సొంతం చేసుకోగలదన్న ఆశాభావాన్ని మిశ్ర ధాతు నిగమ్ (మిధాని) లిమిటెడ్ వ్యక్తం చేసింది. 2016 అక్టోబర్లో దేశ, విదేశాల్లో టంగ్‌స్టన్ ఆస్తుల అన్వేషణ, హస్తగతానికిగాను ఎన్‌ఎండీసీ, మిధానీ ఎంవోయూను కుదుర్చుకున్నాయి. ఈ క్రమంలోనే వియత్నాంలోని థాయ్ గుయెన్ ప్రావిన్సులోగల టంగ్‌స్టన్ గనిలో వాటా కోసం అక్కడి మసన్ రీసోర్సెస్ సంస్థతో తమ భాగస్వామి ఎన్‌ఎండీసీ ప్రస్తుతం చర్చల్లో ఉన్నదని మిధాని సీఎండీ దినేశ్ కుమార్ లిఖి గురువారం ఇక్కడ పీటీఐకి తెలిపారు. ఇదిలావుంటే స్పెయిన్‌కు చెందిన ట్యూబాసెక్స్ సంస్థతో మిధాని గురువారం ఓ ఎంవోయూను కుదుర్చుకున్నది.

ఫిబ్రవరి 20 నుంచి ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్

హైదరాబాద్, జనవరి 17: వచ్చే నెల 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు కొచ్చిలో అంతర్జాతీయ అడ్వర్టైజింగ్ అసోసియేషన్(ఐఏఏ) ఆధ్వర్యంలో వరల్డ్ కాంగ్రెస్ జరుగబోతున్నది. భారత్‌లో ఈ సమావేశాలు జరుగడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఐఏఏ ప్రపంచ అధ్యక్షుడు శ్రీనివాసన్ స్వామి మాట్లాడుతూ..వచ్చే నెల చివర్లో జరుగనున్న ఈ సమావేశాల్లో 55 దేశాలకు చెందిన సుమారు 2 వేల మంది డెలిగేట్స్ పాల్గొనే అవకాశం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతోపాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ, యునీలీవర్ సీఈవో పాల్ పొల్మన్, క్వాల్‌కామ్ సీఈవో స్టీవెన్ మమోల్లెన్ కోఫ్, ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నందన్ నీలేకని, సాఫ్ట్ బ్యాంక్ సీఈవో రాజీవ్ మిశ్రాలతోపాటు బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, హీరోయిన్ దీపిక పదుకొనే తదితరులు హాజరు కానున్నారు.

అంబానీతో అదాని ఢీ

పెట్రోకెమికల్స్ వ్యాపారంలోకి ప్రవేశం ■ జర్మనీకి చెందిన బీఏఎస్‌ఎఫ్ ఎస్‌ఈతో భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జనవరి 17: భారతీయ పెట్రోకెమికల్స్ రంగంలో రారాజుగా వెలుగొందుతున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని, అదాని గ్రూప్ అధిపతి గౌతమ్ అదాని ఢీ కొంటున్నారు. జర్మనీకి చెందిన కెమికల్ దిగ్గజం బీఏఎస్‌ఎఫ్ ఎస్‌ఈతో అదాని భాగస్వామ్యాన్ని ప్రకటించారు. సుమారు రూ.16,000 కోట్ల (దాదాపు 2 బిలియన్ యూరోలు) పెట్టుబడితో గుజరాత్‌లోని ముంద్రా జిల్లాలో ఓ రసాయన కర్మాగారాన్ని అదాని గ్రూప్, బీఏఎస్‌ఎఫ్ కలిసి నిర్మిస్తున్నాయి. అలాగే ఈ ప్లాంట్ విద్యుత్ అవసరాల కోసం ఇక్కడే ఓ పవన, సౌర విద్యుదుత్పత్తి కేంద్రాన్నీ ఏర్పాటు చేయనున్నారు. వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 2019 శుక్రవారం ప్రారంభమవుతున్న క్రమంలో గురువారం ఎంవోయూపై బీఏఎస్‌ఎఫ్ ఎస్‌ఈ, అదాని గ్రూప్‌లు సంతకాలు చేశాయి. అనంతరం ఇరు సంస్థలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేయగా, దాని ప్రకారం కెమికల్ వెంచర్‌లో మెజారిటీ వాటా బీఏఎస్‌ఎఫ్‌కే ఉండనున్నది. అయితే పవర్ వెంచర్‌లో మాత్రం అదానిదే అగ్ర వాటా. కానీ ఈ జాయింట్ వెంచర్లకు సంబంధించి ఇరు సంస్థలు పూర్తి వివరాలను తెలియజేయకపోవడంతో ఇంతకుమించి సమాచారం అందుబాటులో లేకుండాపోయింది. అయినప్పటికీ భారత్‌లో బీఏఎస్‌ఎఫ్ భారీ పెట్టుబడి ఇదేనని మాత్రం తెలుస్తున్నది. బీఏఎస్‌ఎఫ్ తో భాగస్వామ్యం 'మేక్ ఇన్ ఇండియా'కు ఊతమిస్తుందని, ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకుంటున్న సీ3సహా ఎన్నో రసాయనాలు దేశీయంగానే ఉత్పత్తి కాగలవని ఈ సందర్భంగా మాట్లాడుతూ అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదాని అన్నారు.

ఇక ప్రత్యక్ష పోటీకి సై

బహుళ వ్యాపార కార్యకలాపాలతో భారతీయ పారిశ్రామిక రంగంలో అంబానీ, అదానిలు బలమైన ముద్రనే వేశారు. ఈ బిలియనీర్ వ్యాపారులిద్దరూ గుజరాత్‌కు చెందినవారే కావడం విశేషం. అయితే ఎన్నో వ్యాపారాలను వీరిద్దరు చేస్తున్నా.. ఇప్పటిదాకా ఏ రంగంలోనూ ప్రత్యక్షంగా పోటీపడిన దాఖలాల్లేవు. కానీ ఇప్పుడు పెట్రోకెమికల్స్ వ్యాపారంలోకి అదాని రావడంతో తొలిసారి ఓ వ్యాపారంలో ప్రత్యక్షంగా ఈ ఇద్దరు దిగ్గజాలు తలపడబోతున్నట్లైంది. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)లో పెట్రోకెమికల్స్ వ్యాపారానిదే పెత్తనం. అలాంటి ఈ వ్యాపారంలోకే అదాని వస్తుండటం ఇప్పుడు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. అంబానీ ఏకఛత్రాధిపత్యానికి అదాని బ్రేకులు వేస్తారా? అన్నదానిపై మొత్తం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తి నెలకొన్నది.

కెమికల్స్ తయారీ ప్రధానం

అదాని-బీఏఎస్‌ఎఫ్ జాయింట్ వెంచర్.. కెమికల్స్‌ను తయారు చేయనున్నది. నిర్మాణ, ఆటోమోటివ్, కోటింగ్స్ వ్యాపారాలకు వీటి సరఫరా ప్రధానంగా ఉండనున్నది. కాగా, అంబానీ సంస్థ మాత్రం ప్యాకేజింగ్, అగ్రికల్చర్, ఆటోమోటివ్, హౌజింగ్, హెల్త్‌కేర్ మరికొన్ని వ్యాపారాలకూ సేవలను అందిస్తున్నది. ఆయిల్ టు టెలికం వ్యాపార దిగ్గజంగా పేరున్న రిలయన్స్.. 16 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో చేపట్టిన పెట్రోకెమికల్ ఉత్పాదక సామర్థ్యం విస్తరణ పనులను గతేడాది జనవరిలోనే పూర్తి చేసింది. దీంతో ప్రపంచంలోని టాప్-5 భారీ చమురు శుద్ధి ఉత్పాదకదారుల్లో రిలయన్స్ ఒకటైంది. ఈ నేపథ్యంలో అదాని ఎంట్రీ సర్వత్రా ఆసక్తిదాయకంగా మారింది. గుజరాత్‌లోని జమ్‌నగర్, హజిరా, దహేజ్, వడోదర, మహారాష్ట్రలోని నాగోథానేల్లో ఆర్‌ఐఎల్‌కు పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లున్నాయి.



గురువారం గుజరాత్‌లో ఎంవోయూ సందర్భంగా అదాని గ్రూప్ అధినేత గౌతమ్ అదాని, బీఏఎస్‌ఎఫ్ ఎస్‌ఈ చైర్మన్ మార్టిన్ కరచాలనం

'దురంతో'లో దొంగల బీభత్సం

కత్తులతో రెండు బోగీల్లోకి ప్రవేశించి దోపిడీ

న్యూఢిల్లీ, జనవరి 17: జమ్ము-ఢిల్లీ దురంతో రైలులో దొంగలు దోపిడీకి పాల్పడ్డారు. బీ3, బీ7 బోగీల్లోకి కత్తులతో జొరబడిన దొంగలు ప్రయాణికుల వద్ద ఉన్న విలువైన వస్తువులను, నగదును దోచుకున్నారు. ఈ సంఘటన గురువారం ఢిల్లీ సరై రోహిల్లా స్టేషన్‌కు సమీపంలో చోటుచేసుకుంది. రైలు కాసేపు ఆగగానే ఏడెనిమిది మంది దొంగలు ఈ రెండు బోగీల్లోకి ప్రవేశించారు. కత్తులతో బెదిరించి ప్రయాణికుల వద్ద ఉన్న బంగారం, నగదు, సెల్‌ఫోన్లు తదితర వస్తువులను దోచుకొని పారిపోయారు. ప్రయాణికుల్లో ఒకరైన అశ్విని కుమార్ రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దొంగలు రైలులోకి ప్రవేశించి దోచుకుంటుంటే సమాచారం ఇద్దామనుకున్నా ఒక్క అధికారిగానీ, ఆర్పీఎఫ్ సిబ్బందిగానీ అందుబాటులో లేరని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏసీ బోగీల్లోని ప్రయాణికులకే భద్రత లేదంటే.. ఇక సాధారణ బోగీల ప్రయాణికుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థమవుతుందని తెలిపారు. ఫిర్యాదుపై స్పందించిన రైల్వే అధికారులు దొంగలను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

అమెరికాలో ముగ్గురు భారతీయులకు కీలక పదవులు

- అణుశక్తి విభాగ అసిస్టెంట్ సెక్రటరీగా రీటా బరన్వాల్
- పౌరహక్కుల బోర్డు సభ్యునిగా ఆదిత్య బంజాయ్
- ఆర్థికశాఖ అసిస్టెంట్ సెక్రటరీగా బిమల్ పటేల్



రీటా బరన్వాల్, బిమల్ పటేల్, ఆదిత్య బంజాయ్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముగ్గురు ఇండో-అమెరికన్లను తన ప్రభుత్వంలో కీలకమైన పదవులకు నామినేట్ చేశారు. వీరిలో అణుశక్తి నిపుణురాలైన రీటా బరన్వాల్ అనే మహిళ కూడా ఉన్నారు. రీటా బరన్వాల్‌ను అమెరికా అణుశక్తి విభాగ అసిస్టెంట్ సెక్రటరీగా నామినేట్ చేసిన ట్రంప్.. ఆదిత్య బంజాయ్‌ని పౌర హక్కుల పర్యవేక్షక బోర్డు సభ్యునిగా, బిమల్ పటేల్‌ను ఆర్థిక శాఖ అసిస్టెంట్ సెక్రటరీగా నామినేట్ చేశారు. వీరి నామినేషన్లను బుధవారం అమెరికా సెనేట్‌కు పంపారు. ఇప్పటివరకు ట్రంప్ 36 మందికిపైగా ఇండియన్-అమెరికన్లను కీలక పదవుల్లో నియమించారు. అణుశక్తి విభాగ సహాయ కార్యదర్శిగా నామినేట్ అయిన రీటా బరన్వాల్.. ప్రస్తుతం 'గెయిన్' (గేట్‌వే ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ ఇన్ న్యూక్లియర్ ఇనిషియేటివ్) డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. బరన్వాల్ నియామకానికి సెనేట్ ఆమోదం తెలిపితే అమెరికా అణుశక్తి విభాగంలో ఆమె శక్తిమంతమైన పదవిని చేపట్టడంతోపాటు న్యూక్లియర్ టెక్నాలజీ రిసెర్చ్, న్యూక్లియర్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగాలకు బాధ్యురాలిగా వ్యవహరిస్తారు. మరోవైపు యేల్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ అయిన ఆదిత్య బంజాయ్.. గతంలో అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆంటోనిన్ స్కాలియాతోపాటు సిక్త్స్ యూఎస్ అప్పీల్స్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జెఫ్రీ సట్టన్‌కు లా క్లర్క్‌గా సేవలందించారు. అమెరికా న్యాయ శాఖ లీగల్ కౌన్సెల్ కార్యాలయంలో అటార్నీ అడ్వైజర్‌గా పనిచేశారు. ప్రస్తుతం విద్యాబోధన చేస్తున్నారు. అలాగే బిమల్ పటేల్ ప్రస్తుతం అమెరికా ఆర్థికశాఖలోని ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్‌కు డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

చంద్రుడిపై ఎండిపోతున్న చైనా పత్తి విత్తనం

బీజింగ్: చంద్రుడిపైకి చైనా పంపిన పత్తి విత్తనం ఎండిపోతున్నది. చైనా ఈ నెల 3న చాంగ్‌ఏ-4 అంతరిక్ష నౌకను చంద్రునిపైకి పంపించింది. ఆ నౌకలో ఓ పత్తి విత్తనంతోపాటు, ఓ ఆలుగడ్డ, అరబిడాప్సిస్ గింజలను కూడా పంపించింది. ఓ ప్రత్యేకమైన డబ్బాలో ఉంచిన పత్తి విత్తనం ఈ వారం ప్రారంభంలో మొలకెత్తింది. అయితే దాదాపు 212 గంటలపాటు చంద్రమండలంపై చక్కర్లు కొట్టిన చాంగ్‌ఏ-4 చీకటి కాగానే ఆగిపోయింది. చంద్రమండలంపై ఒక రాత్రి భూమిపై రెండు వారాలతో సమానం. ఇక చంద్రునిపై ఉష్ణోగ్రతలు కూడా మైనస్ 170 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. చంద్రునిపై మళ్లీ సూర్యోదయమైతేనే చాంగ్‌ఏ మేలుకొంటుంది. ఈలోపు దానిలో మొలకెత్తిన పత్తి విత్తనం ఎండిపోతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

సరిహద్దుల భద్రతకు ఇస్రో సాంకేతిక పరిజ్ఞానం

బెంగళూరు: దేశ సరిహద్దులో పాకిస్థాన్ వైపున్న ఇండ్లలోకి ప్రత్యక్షంగా తొంగి చూడగల సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్ అభివృద్ధి చేసిందని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. ఇస్రోకు సంబంధించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏకీకృత సమగ్ర సరిహద్దు నిర్వహణ పరిజ్ఞానాన్ని రూపొందించామని, దానిని పాక్‌తో గల అంతర్జాతీయ సరిహద్దులో ప్రవేశపెట్టామని తెలిపారు. దీనితో సరిహద్దులోని ఇండ్లపైన ప్రత్యక్ష నిఘా సాధ్యమవుతుందని అన్నారు.

'కతువా' క్రూరత్వానికి ఏడాది

- 2018 జనవరిలో జమ్ముకశ్మీర్‌లో ఎనిమిదేండ్ల బాలికపై సామూహిక లైంగిక దాడి, ఆపై హత్య
- ఇంకా భయం గుప్పిట్లోనే బాధిత కుటుంబం
- న్యాయం కోసం ఎదురుచూపులు.. తుది దశకు చేరిన కేసు విచారణ



న్యూఢిల్లీ, జనవరి 17: దేశాన్ని నివ్వెరపర్చి, తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన 'కతువా' లైంగికదాడి ఘటన జరిగి ఏడాదైంది. 2018 జనవరిలో జమ్ముకశ్మీర్‌లోని కతువా జిల్లాలో ఎనిమిదేండ్ల బాలికపై ఒక ఆలయ ఆవరణలో కొన్ని రోజులపాటు సామూహిక లైంగిక దాడికి పాల్పడడంతోపాటు హతమార్చిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. మాయనిమచ్చగా మారిన ఈ ఘటనపై దేశమంతా భగ్గుమంది. సమీప అడవిలో గుర్రాలను కాసేందుకు వెళ్లిన మైనార్టీ సంచార తెగకు చెందిన బాలికను స్థానిక దేవాలయ ధర్మకర్త సాంజీరామ్ ప్రోద్బలంతో అతడి కుటుంబసభ్యులు, బంధువులు, ఇతరులు జనవరి 10న కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత అక్కడి దేవాలయ ఆవరణలోని ఓ గదిలో బాలికను బంధించారు. జనవరి 14 వరకు వరుసగా నాలుగు రోజులపాటు సాంజీరామ్ కుమారుడు విశాల్‌తోపాటు ఇతరులు సామూహికంగా లైంగిక దాడికి ఒడిగట్టారు. బాలిక కేకలు వేయకుండా ఉండేందుకు అత్యధిక మోతాదులో నిద్ర మాత్రలు, మాదకద్రవ్యాలను బలవంతంగా ఇచ్చినట్లు పోస్టుమార్టం నివేదికలో వెలుగుచూసింది. నిద్రమాత్రల ప్రభావంతో బాలిక కోమాలోనే ఉండిపోయింది. ఆ తర్వాత దుండగులు బాలికను సమీప అడవిలోకి తీసుకెళ్లి బండరాయితో మోది చంపేశారని దర్యాప్తులో తేలింది. ఈ విషయం బహిర్గతం కాగానే జమ్ముకశ్మీర్ అట్టుడికింది. దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. దోషులను ప్రభుత్వం కాపాడుతున్నదన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. దీంతో వెంటనే కతువా కేసు విచారణను కశ్మీర్ ప్రభుత్వం క్రైం బ్రాంచ్‌కు అప్పగించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సాంజీరామ్, అతడి కుమారుడు విశాల్, స్పెషల్ పోలీసు అధికారులు దీపక్ కజూరియా, సురేందర్ వర్మ, ప్రకాశ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ తిలక్‌రాజ్, ఎస్‌ఐ అరవింద్ దత్త, సాంజీరామ్ మేనల్లుడు, మైనర్ అయిన బాలుడిపై కేసులు నమోదు చేశారు. మైనార్టీ సంచార తెగను భయభ్రాంతులకు గురిచేసి వారిని ఈ ప్రాంతం తరిమి కొట్టేందుకే సాంజీరామ్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు న్యాయస్థానంలో సమర్పించిన చార్జిషీట్‌లో.. 'బాలికను గత ఏడాది జనవరి 10న కిడ్నాప్ చేసి, 14న హతమార్చారు. అనంతరం మృతదేహాన్ని సమీప అడవిలో పారేశారు. 17న బాలిక మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు' అని పేర్కొన్నారు. మార్చి 20న పోలీసులు సాంజీరామ్‌ను అరెస్టు చేశారు. సాక్ష్యాలు దొరకకుండా బాధితురాలి దుస్తుల్ని శుభ్రం చేశారంటూ పోలీసులపై ఆరోపణలు రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. తనను అరెస్టు చేయకుండా ఉండేందుకు ప్రధాన నిందితుడు సాంజీరామ్ పోలీసులకు రూ.4లక్షల లంచం ఎరవేసినట్లు దర్యాప్తులో తేలింది.

పిల్లల్ని బయటికి పంపాలంటే భయంగా ఉంది

నాటి ఘటన నుంచి బాధిత కుటుంబం ఇంకా కోలుకోలేదు. 'మా కుటుంబం ఇంకా షాక్‌లోనే ఉంది. మా పిల్లల్ని బయటకు పంపాలంటే భయంగా ఉంది. ఇలాంటి కష్టం ఏ కన్నతండ్రికి కూడా రాకూడదు' అని బాధితురాలి తండ్రి పేర్కొన్నారు. కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని, నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితురాలి తల్లిదండ్రుల విజ్ఞప్తితో కేసును జమ్ము నుంచి పంజాబ్‌లోని పఠాన్‌కోట్ కోర్టుకు బదిలీ చేశారు.

బీజేపీ పతనానికి సమరశంఖం

ఆ పార్టీ 125 స్థానాలకు మించి గెలువదు ■ కేంద్రంలో తదుపరి నిర్ణేతలు ప్రాంతీయ పార్టీలే: మమత ■ రేపే కోల్‌కతాలో విపక్షాల భారీ బహిరంగ సభ

కోల్‌కతా, జనవరి 17: కోల్‌కతాలో శనివారం నిర్వహించనున్న ప్రతిపక్షాల బహిరంగ సభ బీజేపీ పతనానికి సమరశంఖంలాంటిదని పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వాన్ని నిర్ణయించేది ప్రాంతీయ పార్టీలేనన్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 'లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 125 ఎంపీస్థానాలకు మించి గెలువదు. ప్రాంతీయ పార్టీలు బీజేపీ కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తాయి. అప్పుడు కేంద్రంలో కీలక పాత్ర పోషించేది ప్రాంతీయ పార్టీలే' అని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీకి ఓ విజన్ ఉంటుందని, కానీ, ప్రతిపక్షాల సభ అనేది ప్రజా మహాకూటమికి నిదర్శనంగా నిలువబోతున్నదని చెప్పారు. 1993లో నాటి రాష్ట్రంలో ఉన్న అధికార వామపక్ష కూటమికి వ్యతిరేకంగా మీరు చేపట్టిన సభలాగానే ఇప్పటి సభ ఉండనున్నదా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'అప్పుడు నేను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకురాలిగా ఉన్నాను. కానీ ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలు ఒకే వేదికను పంచుకోబోతున్నాయి. కాబట్టి నేను ఇప్పుడు ఏమీ మాట్లాడదలచుకోలేదు. ఏదైనా ఏకాభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుంది' అని మమత తెలిపారు. సభకు మాయావతి రావడం లేదు కదా అని విలేకరులు ప్రశ్నించగా.. ఆమె తరపున బీఎస్పీ నాయకుడు సతీశ్ చంద్ర మిశ్రా హాజరుకానున్నారని చెప్పారు. సభకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీ హాజరవ్వనున్నారన్నారు. శనివారం 12 గంటలకు సభ ప్రారంభమవుతుందని, ఢిల్లీ, కర్ణాటక, ఏపీ సీఎంలు కేజ్రీవాల్, కుమారస్వామి, చంద్రబాబు, మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ సీఎంలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, బీజేపీ అసంతృప్త ఎంపీ శత్రుఘ్నసిన్హా తదితరులు సభకు హాజరుకానున్నారని మమత వివరించారు. మరోవైపు సభకు హాజరయ్యే ప్రతిపక్షాలతో తేనీటి విందు సమావేశం నిర్వహించాలని మమతాబెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ నిర్ణయించింది.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న తృణమూల్ అధినేత్రి మమత

నిప్పంటించిన చితి నుంచి శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు

హత్యారోపణల నేపథ్యంలో యూపీలో ఘటన

ముజఫర్‌నగర్(యూపీ), జనవరి 17: నిప్పంటించిన చితి నుంచి శవాన్ని పోస్టుమార్టం కోసం పంపిన వింత ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ముజఫర్‌నగర్‌లోని గోధ్నా గ్రామంలో నివాసముంటున్న విజయ్‌పాల్ భార్య ఇటీవల మరణించారు. దీంతో ఆమెకు బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని చితిపై ఉంచి నిప్పంటించారు. ఇంతలోనే ఆమె మరణంపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. చితిపై ఉన్న శవాన్ని కిందకు దించి పోస్ట్‌మార్టం కోసం పంపారు. ఆమె భర్త విజయ్‌పాల్, ఆయన కుటుంబసభ్యులపై పోలీసులు కేసు నమోదు చేయడంతో వారు పరారయ్యారు. మృతిచెందిన మహిళ సోదరుడు మాట్లాడుతూ తన సోదరిని ఆమె అత్త, మామలు వేధించేవారని, వాళ్లే ఆమెను చంపారని తెలిపారు. ఈ విషయం ఎక్కడ భయటపడుతుందేమోనన్న భయంతోనే అంత్యక్రియలు త్వరగా పూర్తి చేయాలని భావించారని పేర్కొన్నారు.

అవిశ్వాసం నుంచి గట్టెక్కిన థెరెసా మే

బ్రెగ్జిట్ ఒప్పందంపై కలిసి పనిచేయాలని ప్రతిపక్షానికి పిలుపు

లండన్, జనవరి 17: లేబర్ పార్టీ నాయకుడు కార్బిన్.. ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానం గండం నుంచి బ్రిటన్ ప్రధాని థెరెసా మే బయటపడ్డారు. బ్రెగ్జిట్ ఒప్పందం విషయంలో ఓటమిని ఎదుర్కొన్న ప్రధాని థెరెసాను మరో దెబ్బ కొట్టేందుకు ప్రతిపక్షం విసిరిన అవిశ్వాసం పాచిక వీగిపోయింది. ప్రతిపక్ష నేతలు తమ స్వప్రయోజనాలను పక్కన పెట్టి కొత్త బ్రెగ్జిట్ ఒప్పందాన్ని రూపొందించడంలో తనకు సహకరించాలని ప్రధాని మే విజ్ఞప్తి చేశారు. దాదాపు 26 ఏండ్ల తరువాత బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం రాత్రి ఓటింగ్ జరిగింది. అయితే తీర్మానానికి వ్యతిరేకంగా 325 ఓట్లు, అనుకూలంగా 306 ఓట్లు లభించాయి. 19 ఓట్ల మెజారిటీతో నెగ్గిన థెరెసా మే ఆ తరువాత మీడియాతో మాట్లాడుతూ, తమ ప్రభుత్వం పార్లమెంట్ విశ్వాసాన్ని గెలుచుకుందని చెప్పారు. ఐరోపా యూనియన్ నుంచి వైదొలుగాలని నిర్ణయించిన బ్రిటన్, ఆ దిశగా ఏం చేయాలన్న దానిపై ఇంతవరకు ఓ నిర్ణయానికి రాలేదు. బ్రెగ్జిట్ వ్యూహం విషయమై ప్రతిపక్షంతో చర్చించి ఒక ఒప్పందాన్ని రూపొందించి వచ్చే సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతానని థెరెసా మే పార్లమెంట్‌కు హామీనిచ్చారు. ప్రతిపక్ష సభ్యులు తమ స్వప్రయోజనాలను పక్కనపెట్టి, తమతో నిర్మాణాత్మకంగా కలిసి పనిచేయాలని కోరారు. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని రూపొందించడం అంత సునాయాసమైనదేమీ కాదన్నారు. అవిశ్వాసంపై జరిగిన ఆరు గంటల చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు జెర్మీ కార్బిన్ మాట్లాడుతూ, థెరెసా మే ప్రభుత్వం పాలించే అర్హతను కోల్పోయిందని విమర్శించారు.

77 కోట్ల మంది ఈ-మెయిళ్లు, 2 కోట్ల పాస్‌వర్డ్‌లు లీక్

హ్యాకర్ల హస్తలాఘవం

న్యూయార్క్: నెటిజన్లూ బహుపరాక్. మీ ఈ-మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ సురక్షితంగా ఉన్నాయా? లేదా? ఒక్కసారి చెక్ చేసుకోండి. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా 77 కోట్ల మంది ఈ-మెయిళ్లు, 2 కోట్ల మంది పాస్‌వర్డ్‌లు హ్యాక్ అయ్యాయి. మొత్తం 87 జీబీ పరిమాణం కలిగిన 12వేల ఫైళ్లని ప్రముఖ ఫైల్ షేరింగ్ నెట్‌వర్క్ 'ఎంఈజీఏ (మెగా)'లో హ్యాకర్లు అప్‌లోడ్ చేశారు. అయితే, ప్రస్తుతం ఆ సంస్థ ఈ డేటాను డిలీట్ చేసింది. కానీ, ఇప్పటికే అనేకమంది వాటిని డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ వివరాల్ని ఆస్ట్రేలియాకు చెందిన వెబ్ సెక్యూరిటీ నిపుణుడు ట్రాయ్ హంట్ గుర్తించి వాటిని 'ట్రాయ్ హంట్.కామ్' అనే వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. మొత్తంగా 269 కోట్ల వరుసల్లో నెటిజన్ల ఈ మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారానికి సంబంధించి డేటాను 'కలెక్షన్ హ్యాష్ 1' పేరుతో పొందుపర్చినట్లు హంట్ చెప్పాడు. 2019లో డేటా లీకేజీకి సంబంధించి ఇదే అతి పెద్ద ఘటనగా భావిస్తున్నారు. మీ మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ హ్యాకింగ్‌కు గురయ్యాయా? లేదా? అనే విషయం చెక్ చేసుకోవాలంటే 'హావ్ ఐ బీన్ పౌన్‌డ్' అనే వెబ్‌సైట్ ఓపెన్ చేసి, అందులో మీ మెయిల్ ఐడీ టైప్ చేయగానే 'గుడ్ న్యూస్.. నో పౌనేజ్ ఫౌండ్' అని వస్తే మన ఐడీ, పాస్‌వర్డ్ హ్యాక్ కాలేదన్నమాట. ఒకవేళ 'ఓ..నో.. పౌన్‌డ్' అని వస్తే మీరు వెంటనే మీ పాస్‌వర్డ్‌ను మార్చివేయాల్సిందే.

కుంభమేళాకు రాష్ట్రపతి దంపతులు

త్రివేణి సంగమం వద్ద గంగానదికి ప్రత్యేక పూజలు



ప్రయాగ్‌రాజ్, జనవరి 17: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు కుంభమేళాకు హాజరయ్యారు. భార్య సవిత తోపాటు ఇతర కుటుంబసభ్యులతో కలిసి భారత వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో రామ్‌నాథ్ కోవింద్ ప్రయాగ్‌రాజ్ సమీపంలోని బామ్‌రౌలి విమానాశ్రయానికి గురువారం ఉదయం చేరుకున్నారు. యూపీ గవర్నర్ రామ్‌నాయక్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి త్రివేణి సంగమానికి చేరుకున్న రాష్ట్రపతి దంపతులు అక్కడ గంగానదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు అరగంట పాటు త్రివేణి సంగమం వద్ద రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గడిపారు. అనంతరం పలువురు సాధువులను కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. సాయంత్రం తిరిగి విమానంలో ఢిల్లీ వెళ్లిపోయారు.



జేపీదర్గాలో గంధం సమర్పించిన ఎమ్మెల్సీ సలీం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జహంగీర్ పీర్ దర్గాలో గురువారం ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు వక్ఫ్‌బోర్డు చైర్మన్, ఎమ్మెల్సీ సలీం హాజరై గంధం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని, అందరి సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉర్సు ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కూడా పాల్గొన్నారు.



బ్రాహ్మణ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రాహ్మణ సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. బ్రాహ్మణ సంక్షేమానికి తొలిసారిగా నిధులు, భూమి కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ.. పేద బ్రాహ్మణులను అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు.

సీఎల్పీ నేత ఎంపికపై తుది నిర్ణయం ఏఐసీసీదే

- ఏకవాక్య తీర్మానం చేసిన సీఎల్పీ
- పోటీలో ప్రధానంగా ముగ్గురు సీనియర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఎంపికలో తుది నిర్ణయాన్ని పార్టీ అధిష్ఠానానికే వదిలిపెడుతూ సీఎల్పీ సమావేశం తీర్మానించింది. అధిష్ఠానం ప్రత్యేక దూత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం అసెంబ్లీ కమిటీహాల్లో పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 19 మంది ఎమ్మెల్యేలు హాజరై వారి అభిప్రాయాలను వ్యక్తంచేశారు. సీఎల్పీ నేత పదవికోసం ప్రధానంగా మల్లు భట్టివిక్రమార్క, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పోటీపడుతున్నట్టు సమాచారం. చాలా మంది ఎమ్మెల్యేలు సీనియర్‌కే పదవిని కట్టబెట్టాలని, సామాజికవర్గాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది. ఎక్కువమంది ఎమ్మెల్యేలు మల్లు భట్టివిక్రమార్క అభ్యర్థిత్వాన్ని సమర్థించినట్టు సమాచారం.



గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్. చిత్రంలో ఉత్తమ్, భట్టి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
శుక్రవారం 18 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

హైదరాబాద్

చీరలు.. చుడీదార్లు.. లెహంగాలు.. గౌన్లు.. ఒక్కొక్కప్పుడు ఒక్కో ఫ్యాషన్ నడుస్తుంది..
సీజన్‌ని బట్టే కాదు.. అకేషన్‌ని బట్టి కూడా ఇవి మారుతుంటాయి..
కానీ అన్ని సీజన్లలో.. అన్ని అకేషన్లకి తగ్గట్టు.. లాంగ్‌ఫ్రాక్‌లదే ఇప్పుడు హవా కొనసాగుతున్నది..
పొట్టిగా కాదు.. పొడుగుగా ఉంటేనే అందమంటున్నారు మగువలు..
అందుకే చూడముచ్చటైన ఆ లాంగ్‌ఫ్రాక్‌ల సోయగాలు మీ కోసం..

పొడుగైనా అందమే!



పార్టీల్లో ప్రత్యేకంగా కనిపించాలంటే ఈ డ్రెస్ మీకు పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది. ఆకుపచ్చని ఫ్లోయి కాటన్‌ని బోట్ నెక్‌తో కుట్టాం. కింద అసమెట్రికల్ డిజైన్ ఇచ్చాం. పైన, స్లీవ్స్ మీద మాత్రం జర్దోసీ, స్టోన్స్‌తో వర్క్ చేసేసరికి మరింత ఎలిగెంట్‌గా కనిపిస్తున్నది.



వైన్ పింక్ కలర్ అనార్కలీ మోడల్ లాంగ్ డ్రెస్ వేసుకుంటే అందరూ నోరెళ్లబెట్టాల్సిందే! ఆర్గంజా ఫ్యాబ్రిక్‌తో కుట్టిన ఈ డ్రెస్‌కి పైన ఒక వైపు మాత్రమే హైలైట్ చేశాం. ఫుల్‌గా జర్దోసీ వర్క్‌తో నింపేశాం. స్లీవ్స్ మీద మాత్రం సింపుల్ జర్దోసీ వర్క్ ఇచ్చేసరికి చూడముచ్చటగా కనిపిస్తున్నది.



హ్యాండ్‌లూమ్ ఎప్పటికీ ఎవర్‌గ్రీనే! లేత ఆకుపచ్చ రంగు డ్రెస్‌ని లాంగ్ అనార్కలీ మోడల్‌లో డిజైన్ చేశాం. దీనికి పైన కలర్ సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌తో పువ్వుల డిజైన్ కుట్టాం. స్లీవ్స్ మీద మాత్రం సింపుల్‌గా జర్దోసీ వర్క్‌తో నింపేయడంతో సూపర్‌గా ఉన్నది.



సింపుల్ అండ్ స్వీట్‌గా మెరిసిపోవాలంటే ఈ డ్రెస్ వేయాల్సిందే! ఆనియన్ కలర్ క్రేప్‌ని లాంగ్ గౌన్‌గా డిజైన్ చేశాం. కింద ఎక్కువ కుచ్చుల్లా వచ్చేలా దీన్ని కుట్టాం. దీనికి పైన ఫుల్‌గా హ్యాండ్ వర్క్ చేయించాం. స్లీవ్స్‌ని మాత్రం సీతాకోక చిలుక రెక్కల్లా డిజైన్ చేశాం. పింక్ కలర్ క్రేప్ మీద ఫుల్‌గా వర్క్ ఇవ్వడంతో మరింత మెరిసిపోతున్నది.



పీచ్ అండ్ పింక్ కాంబినేషన్‌లో కుట్టిన డ్రెస్ ఇది. శిబోరీ లాంగ్ ఫ్రాక్‌కి సరిగ్గా సరిపోయేలా మధ్యలో పింక్ కలర్ రాసిల్క్ బెల్ట్‌ని ఇచ్చాం. దీని మీద ఫుల్‌గా సీక్వెన్స్ వర్క్ ఇచ్చాం. సీతాకోక చిలుక రెక్కలా స్లీవ్స్ ఇచ్చి దీని మీద కూడా ఫుల్‌గా వర్క్ చేశాం. ఈ స్లీవ్స్ ఈ డ్రెస్‌కి అదనపు ఆకర్షణ.



హారికారావు
ఫ్యాషన్ డిజైనర్
హారికా స్టూడియో
పద్మనాభ నగర్, హైదరాబాద్
ఫోన్: 8179593237
వెబ్ : www.harikastudio.in

పిల్లలకు సృజన పాఠాలు



పుస్తక పఠనం మనిషికి జ్ఞానాన్ని పెంచడమేకాకుండా, ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు తోడ్పడుతుంది. చిన్ననాటి నుంచి పుస్తక పఠనాన్ని చిన్నారుల్లో పెంపొందించేందుకు డార్జిలింగ్‌కు చెందిన ఓ మహిళ ఎంతగానో కృషి చేస్తున్నది.

డార్జిలింగ్‌లోని నగరి టీ ఎస్టేట్‌కు చెందిన సృజన సుబ్బా అనే మహిళ తన గ్రామంలో సొంతంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి చిన్నారుల్లో పఠనాసక్తిని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నది. ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసేవాళ్లు. యూకేజీ చదువుతున్న సమయంలో ఆమె తల్లి ఓ డిక్షనరీని తీసి ఇచ్చింది. అలా చదువడం అలవాటైంది సృజనకి. ఆమె తల్లి కూడా పుస్తకాలు బాగా చదివేది. వాటిని సృజనకి పడుకొనే సమయంలో కథలుగా చెప్పేది. అలా ప్రతి రోజూ ఓ కథ చెప్పడం వల్ల సృజనకు పుస్తకాలు చదవాలనే ఆసక్తి మరింతగా పెరిగింది. ఆ తర్వాత కొన్నాళ్లకు పెద్ద ఎత్తున పుస్తకాలను సేకరించి తన ఇంట్లోనే 'ద బుక్ తీఫ్' పేరుతో కార్ పార్కింగ్ స్థలంలోనే ఓ గ్రంథాలయాన్ని ప్రారంభించింది. చిన్నారులకు ఆసక్తికరంగా ఉండే 500 కథల పుస్తకాలు, బొమ్మల పుస్తకాలను తన గ్రంథాలయంలో ఉంచింది. చదువుతో పాటు ఇతర పుస్తకాలను పఠించడం వల్ల కలిగే లాభాలను వారికి వివరిస్తూ పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెడుతున్నది. ఓ రోజు తన గ్రంథాలయానికి ఏడాదిన్నర వయసున్న పాపతో వాళ్ల అక్క వచ్చి పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆ పాప కూడా పుస్తకం వైపు ఆసక్తి కనబరచడం చూసి సృజన ఎంతో సంతోషించింది. అలాగే ఒక్కొక్కరూ పుస్తక పఠనం పై ఆసక్తి పెంచుకుంటూ ఉంటే భవిష్యత్‌లో సమాజం అంత త్వరగా ముందుకు వెళుతుందనేది సృజన అభిప్రాయం. భారతదేశంలోని ప్రతి గ్రామంలో 'ద బుక్ తీఫ్' లాంటి గ్రంథాలయాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సృజన కోరుతున్నది.

ప్యాడ్స్‌తో.. ప్రపంచ రికార్డు!



శానిటరీ నాప్‌కిన్‌లతో రికార్డు నెలకొల్పొచ్చని ఎవరైనా అనుకుంటారా? కానీ బెంగళూరుకి చెందిన మహిళలు ఆ పనిచేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. దీనిద్వారా బహిష్టు సమయంలో వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలని వాళ్లు భావించారు.

ఆడవాళ్లు ఆ ఐదు రోజుల బాధ వర్ణనాతీతం. అలాగే ఆ సమయంలో వ్యక్తిగత శుభ్రత కూడా ముఖ్యం. కానీ ఇప్పటికీ చాలామంది శుభ్రత విషయంలో వెనుకే ఉన్నారట. భారతదేశంలో 58శాతం మంది మాత్రమే ఇప్పటికీ వ్యక్తిగత శుభ్రత పాటిస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ సంఖ్య పెరుగాలంటే మహిళల్లో సరైన అవగాహన ఉండాలి. దీన్ని సాధించేందుకు బెంగళూరుకి చెందిన ఇండియా కాంగ్రెస్ ఆఫ్ ఒబేయెస్ట్రిక్ అండ్ గైనకాలజీ (ఏఐసీఓజీ) ప్యాడ్స్‌ని ప్రమోట్ చేయాలనుకున్నది. ఐదు వందలమంది ఏడున్నర గంటల పాటు కష్టపడి 10,105ప్యాడ్‌లను ఒక వరుస క్రమంలో పేర్చారు. అది కూడా 1,078 మీటర్ల పొడువున ఉంచి మధ్యలో అండాశయాన్ని గీశారు. గర్భాశయ అంటువ్యాధులు, మూత్రాశయ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడేందుకు అవగాహన కల్పిస్తున్నట్టు ఏఐసీఓజీ ప్రకటించింది. ఇలా పేర్చిన ప్యాడ్స్‌ని ఆ తర్వాత కొన్ని పాఠశాలల్లో ఉచితంగా పంపిణీ కూడా చేశారు.

శిరోజాల సంరక్షణకు..

చలికాలం వచ్చిందంటే జుట్టు చిట్లిపోవడం, రాలిపోవడం ఎక్కువ అవుతుంటుంది. ఈ సమస్య పరిష్కారానికి సరైన చిట్కాలు పాటించాలి.



- ఒక కప్పు స్ట్రాబెరీలను జ్యూస్ చేసి అందులో గుడ్డు పచ్చసొన, ఆలివ్ ఆయిల్‌ని కలిపి తలకు రాయాలి. అరగంట తర్వాత షాంపూతో తలస్నానం చేస్తే చాలు.
- ఓట్‌మీల్, పాలు, బాదం నూనెను కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కేశాలకు పూతలాగా రాయాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. వారానికోసారి ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ఆలుగడ్డని మెత్తని పేస్ట్‌లా చేయాలి. అందులో తేనె, నీరు కలిపి జుట్టు మొదళ్లకు రాయాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు రాలే సమస్య చాలావరకు తగ్గుతుంది.
- కొత్తిమీరను మెత్తగా రుబ్బి అందులో నీళ్లు కలిపి జుట్టుకు రాయాలి. గంట తర్వాత తలస్నానం చేయాలి. వారానికి రెండు లేదా మూడు సార్లు ఈ ప్యాక్ రాయడం వల్ల చుండ్రు సమస్యను తగ్గించుకోవచ్చు.
- వీటితో పాటు ఈ కాలంలో ఎక్కువ సేపు నూనె పెట్టుకొని ఉండకూడదు. కండీషనర్‌ని కూడా తప్పని సరిగా వాడినప్పుడు జుట్టు రాలకుండా ఉంటుంది.

విధి కలిపిన బిడ్డలు!





ఇదో విచిత్ర సంఘటన. విధి కలిపిన పేగుబంధం. సినిమా కథను తలపించే ఈ సంఘటన అమెరికాలో జరిగింది. ఓ తల్లి మానవత్వం ఇద్దరు చిన్నారులను ఒకేచోటికి చేర్చింది. ఆ యాదృశ్చికమైన సంఘటన ఏంటో తెలుసా?

ఈమె పేరు కాటీ పేజ్. అమెరికాలోని కొలొరాడోలో ఉంటుంది. 30 యేండ్ల ఈవిడ భర్తతో విడాకులు తీసుకుంది. అయితే ఈమెకు పిల్లలు లేరు. 11 నెలల క్రితం ఓ బాబును దత్తత తీసుకుంది. అతనికి గ్యారీసన్ అని పేరు పెట్టింది. ఆ తర్వాత మరో బేబీని దత్తత తీసుకొని ఇద్దరినీ సొంతబిడ్డల్లా చూసుకుంటుంది. అయితే.. రెండు వారాల క్రితం ఆమెకు ఓ అనాథ శరణాలయం నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'ఆడపిల్లను దత్తత తీసుకుంటావా?' అనేది దాని సారాంశం. నలుగురి బిడ్డలను దత్తత తీసుకోవాలని ఆశతో ఉన్న కాటీ పేజ్.. సరేనని సమాధానం ఇచ్చింది. అక్కడికి వెళ్లి.. ఆ పాపను దత్తత తీసుకొని హన్నా అని పేరు పెట్టింది. అయితే, చట్టబద్ధంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల కోసం కన్నతల్లి ఎవరనేది ఆరా తీయడం మొదలు పెట్టింది కాటీ. అప్పుడే గ్యారీసన్, హన్నా తల్లి ఒక్కరే అని గుర్తించింది. వెంటనే కన్నతల్లి చిరునామా వెతికి.. ఆమెను కలుసుకున్నది కాటీ పేజ్. ఆమె కన్న బిడ్డలిద్దరూ తన దగ్గర క్షేమంగా ఉన్నారని చెప్పింది. ఆ వార్త విని కన్నతల్లి చాలా సంతోషించింది. అయితే ముచ్చటగా మూడో బిడ్డను కూడా కనివ్వాలని కోరింది కాటీ పేజ్. ఈ విషయాన్ని, పిల్లల ఫొటోలను తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేసింది కాటీ. విధి కలిపిన ఈ చిన్నారులను సోషల్ మీడియా వేదికగా పలువురు దీవిస్తున్నారు.

ఎత్తు తక్కువ ఉన్నా..


పొట్టిగా ఉన్నారని చింతిస్తున్నారా? మీరు వేసుకునే బట్టలను బట్టి మీరు ఉన్నదానికంటే కాస్త ఎత్తుగా ఉన్నట్లు కనిపించవచ్చు. అదెలాగో ఇది చదివితే మీకే తెలుస్తుంది.

- ఎత్తు తక్కువ ఉన్నవారు పొడుగ్గా కనిపించాలని హై హీల్స్ వేసుకుంటారు. అవి మాత్రమే వేసుకుంటే సరిపోదు. గీతలున్న దుస్తులను ధరిస్తే కాస్త హైట్‌గా కనిపించొచ్చు.
- చిన్న పువ్వులు, ప్రింట్లు, తక్కువ అల్లికలున్న వస్త్రాలు మిమ్మల్ని మరింత ఎత్తుగా కనిపించేలా చూసుకోవాలి. ఇలాంటి డిజైన్లు కూడా ఒకే రంగులో ఉండేలా చూసుకుంటే సరిపోతుంది.
- చీరలు ధరిస్తున్నప్పుడు.. పెద్ద అంచులున్నవి కాకుండా చిన్నగా ఉండేవి ఎంచుకోవాలి. సన్న పింట్ర్ ఉన్నవి అయితే మరింత బాగా నప్పుతాయి.
- జీన్స్ ఏవో ఒకటి కాకుండా.. కష్డ్ రకాలను కొనడం మేలు. వీటి మీదకి హై హీల్స్ వేసుకుంటే నలుగురిలో స్పెషల్ లుక్ సొంతమవుతుంది.
- నిలువు గీతలున్న టాప్‌ల కంటే.. అడ్డం గీతలున్న టాప్‌లను ధరించాలి. కాంట్రాస్ట్ రంగులు ఉండే డ్రెస్‌లు, టాప్‌ల జోలికి వెళ్లకపోవడమే మంచిది.



నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 18 జనవరి 2019

పద్యనీతి



దేవాపిత్ృ కార్యాభ్యాం
న ప్రమదితవ్యమ్
మాతృదేవోభవ పితృదేవోభవ
ఆచార్య దేవోభవ అతిథి దేవోభవ ॥

- తైత్తిరియోపనిషత్ (1.11.2)

దేవతల పట్ల, పితృదేవతల (పూర్వీకులు) పట్ల మన ఆరాధనా భావాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. ముందు తల్లిని దేవతగా కొల వాలి. తర్వాత వరుసగా తండ్రిని, గురువును, అతిథిని దైవాలుగా చూడాలని ఉద్బోధించే శ్లోకమిది.

మంచిమాట



ఒక నిజమైన సైనికునికి సైనిక పరంగా, ఆధ్యాత్మిక పరంగా రెండింటిలోనూ శిక్షణ అవసరం.

-నేతాజీ సుభాష్ చంద్రబోస్

నమో నమామి

భద్రకాళి నమస్తుభ్యం
మహాకాళి నమోస్తుతే
చండీ చండే నమస్తుభ్యం
తారిణి వరవర్ధిని ॥ (23.5)

-దుర్గాస్తవం,
(మహాభారతం, భీష్మపర్వం)

భద్రకాళి, మహాకాళి, దుర్గ, చండీ, తారిణీ అందరూ ఒక్కరే. పార్వతీదేవి వివిధ రూపాలుగా, జగన్మాత అవతారాలుగా ఈ అమ్మవార్లను చెప్తారు. శక్తిస్తోత్రంలో భాగమైన దుర్గాస్తవంలోని ఈ పాదాల స్మరణతో ఆమెకు మనసారా నమస్కరిద్దాం.



మేల్కొలుపు



శ్రీస్వామి పుష్కరిణికా ప్లవ నిర్మలాంగా:
శ్రేయోవర్ధినో హరవిరించి సనందనాద్యా:
ద్వారే వసంతి వరవేత హతోత్తమాంగా:
శ్రీ వేంకటా చలపతే తవ సుప్రభాతమ్ ॥ 14 ॥

- శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్

స్వామీ! నీ శ్రేయస్సును కోరి బ్రహ్మ, ఈశ్వర, సనందాది మహర్షులంతా పుష్కరిణిలో స్నానం చేసి పవిత్రులైనారు. నిర్మలమైన హృదయాలతో నీ కడకు వచ్చి వున్నారు. వారంతా తమ తలలపైన బెత్తపు దెబ్బలను సైతం తినుచూ నీ మహద్దర్శనం కోసం ఎదురు చూస్తున్న ఈ శుభవేళ ఓ వేంకటా చలపతీ! అందుకొనుమా మా సుప్రభాతమ్.

ఇలా చేద్దాం



శని త్రయోదశి (రేపు శనివారం) సందర్భంగా శనీశ్వర ఆరాధన అత్యంత శుభప్రదం. ఆ రోజు శనికి ఇష్టమైన పనులు చేయడం ద్వారా ఆయన అనుగ్రహానికి పాత్రులు కావచ్చు. దానధర్మాలన్నా, సత్యాహింసలన్నా, పవిత్రంగా మానవధర్మాన్ని ఆచరించే వారన్నా శనిదేవునికి ఎంతో ఇష్టమని పండితులు చెప్తారు. శనివారం పూట వచ్చే 'శని త్రయోదశి' మరింత అధిక ఫలాలను ఇస్తుందనీ అంటారు. వారాలలో శనివారం శనితోపాటు విష్ణుమూర్తికి, త్రయోదశి పరమేశ్వరునికి ఇష్టమైనవి. కాబట్టే, ఇది విశిష్ఠం. అయితే, శనిని దూషించడం మంచిది కాదు. ఆయన కావాలని ఎవరికీ ఏ హానీ చేయడు. వారి వారి కర్మలను బట్టే ఆయన పీడ ఉంటుందని తెలుసుకోవాలి. ప్రతి నెలా వచ్చే త్రయోదశి నాడు శని ఆరాధన, పూజ ఎంతో మంచిది కూడా.

హస్తభూషణం



పుస్తకాలను చాలామంది ప్రచురిస్తారు. కానీ, తాము అందించే విశేషాల (కంటెంట్)పై ఎంతో ప్రేముంటే తప్ప ఇంత సొగసైన, సుందరమైన, సుసంపన్న రీతిలో, చక్కగా చేతిలో ఇమిడిపోయే అనువైన సైజులో పుస్తకాన్ని ఎవరూ రూపొందించలేరు. 'మహామంత్రస్య..' పేరున పురాణపండ శ్రీనివాస్ రచన, సంకలనంలో రాజమహేంద్రవరానికి చెందిన 'జ్ఞాన మహా యజ్ఞ కేంద్రం' వారు 2018 చివరలో ప్రచురించిన ఈ ఆధ్యాత్మిక గ్రంథం భక్తులకు నిజంగా ఒక హస్తభూషణమే. ఇందులో హిందువుల ఆరాధ్య దైవాల స్తోత్రాలు పెద్ద అక్షరాలతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొంటాయి. ఎంతో నాణ్యమైన న్యూస్‌ప్రింట్ ఒక విశేషమైతే, ఇందులోని తైలవర్ణ చిత్రాలు అన్నీ మరో గొప్ప పని. 'ఆర్షవిద్యల అఖండ జ్ఞానగంగ'గా దీనిని ప్రచురణకర్తలు అభివర్ణించడం పూర్తిగా సముచితం. మొత్తం 644 పేజీలలో మంచి బైండింగ్‌తో గ్రంథాన్ని గొప్పగా తీర్చిదిద్దారు.

సందర్భ శుద్ధి

ప్రచండ శక్తి, పరబ్రహ్మ స్వరూపిణి, సమున్నత దేవత

చండీ కటాక్షం!

ఇటీవలి తెలంగాణ ఎన్నికల్లో టీఆర్ఎస్ రెండో పర్యాయం దిగ్విజయం సాధించిన తర్వాత, తిరిగి రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన మన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరోసారి శక్తివంతమైన, మహిమాన్వితమైన యాగదీక్షకు పూనుకున్నారు. సోమవారం(21వ తేది) 'మహారుద్ర సహిత సహస్ర చండీయాగాన్ని' గజ్వేలు దగ్గర్లోని వారి వ్యవసాయ క్షేత్రంలో ప్రారంభించనున్నారు. శుక్రవారం (25వ తేది) వరకు అయిదు రోజుల పాటు జరగనున్న ఈ బృహత్ యజ్ఞం సందర్భంగా.. ప్రచండ శక్తి, పరబ్రహ్మ స్వరూపిణి, సమున్నత దేవత అయిన చండికా మాత మహోన్నతమైన దివ్యమంగళ విశేషాలను క్లుప్తంగా తెలుసుకుందాం.



నాటి రాజులు, ఋషుల నుంచి నేటి పాలకులు, యోగుల వరకూ అందరూ అత్యధిక ప్రాధాన్యమిచ్చే యాగాలలో చండీదే ప్రథమ స్థానం. 1997 నుంచి మన కేసీఆర్ నిర్వహించిన పలు యాగాలలో చండీ అమ్మవారువే అత్యధికం. తెలంగాణ రాష్ట్రం సాధించాక 2015 డిసెంబర్‌లో ఆయన నిర్వహించిన 'ఆయత (సుదీర్ఘమైన, గొప్పనైన) చండీ యాగం' తర్వాత ఇప్పుడు మరింత విశిష్ఠ స్థాయిలో 'మహారుద్ర సహితం'గా 'సహస్ర చండీ'ని నిర్వహిస్తున్నారు. సహస్రాని (వెయ్యి)కి పదిరెట్లు (పది వేలు) ఆయతం. (దీనికి పదిరెట్లతో లక్ష చండీయాగమూ ఉంటుంది).

ప్రత్యేకించి చండీయాగానికి ఎందుకింత ప్రాధాన్యం? అసలు ఎవరీ చండీమాత? దేవతల నుంచి మానవాది జీవులన్నీ ఆమె కరుణా కటాక్షం కోసం ఎందుకింతగా తపించిపోతుంటాయి? ఆమె స్వరూప స్వభావాలు, శక్తి పరాత్పరత, ఉపాసనా బలం ప్రతి ఒక్కరూ తెలుసుకోదగ్గవి. ఆమె కటాక్షం కోసం వేడుకోదగ్గవే.

చండి లేదా చండిక వంటి పేర్లలోనే మహోగ్రమనే శబ్దం దాగుంది. సృష్టి, స్థితి, లయలకు, చరాచర జీవరాశులకు అన్నింటికీ మూలాధారం ఆమెనే. ఒక్కమాటలో చెప్పాలంటే ఆమెనే పరాశక్తి, పరాత్పరిణి, పరదేవత, పరబ్రహ్మ స్వరూపిణీ, సకల దేవతలకందరికంటే సమున్నతమైంది. ఆమె వదనం ఎంత ప్రచండమో, అంత ప్రసన్నం. అద్భుతమైన, అనితర సాధ్యమైన ఆ తల్లి స్తోత్ర మహత్తు, గొప్పతనం, తేజోభరిత విశేషాలను తెలుసుకోవాలంటే 'శ్రీ చండీ సప్తశతి'లోకి వెళ్లాల్సిందే. సాక్షాత్తు వ్యాసభగవానుని సృష్టే ఈ 'సప్తశతి స్తోత్రం'. దీనినిబట్టి, చండీ ప్రాశస్త్యం, విలువ ఎంతటివో మనకు తెలుస్తాయి.

జగత్తులోని అన్ని విశేష శక్తులకూ 'ఆత్మ' (నిజానికి పరమాత్మే) చండిక. 'శివునాజ్ఞ లేకుండా చీమైనా కుట్టదు' అన్న శాస్త్రోక్తి మాదిరిగానే చండిక సకల కార్యాల్లోనూ అంతర్లీనంగా ఆసీనురాలై ఉంటుందనీ వేద పండితులు అంటారు. అన్ని శక్తులకూ ఆమెనే ఉపాదానం (మూలం). కాబట్టి, ఈమెను 'సామాన్య రూపిణి'గానూ పిలుస్తారు. అటు బ్రహ్మదేవునికి చిన్మాత్ర రూపమని, ఇటు పరమేశ్వరునికి అర్ధ శరీరిణి అనీ 'శ్వేతాశ్వతరోపనిషత్' చెబుతున్నది. అలాగే, మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ ముగ్గురమ్మల మూలపుటమ్మ కూడా చండీయే. మొత్తంగా ఆమె పరదేవత (ఆదిపరాశక్తి) గానే 'సప్తశతి'లో ఘనమైన స్తుతిని పొందుతున్నది. 'సూత సంహిత'లో పేర్కొన్నట్టు పరదేవతా స్వరూపమైన చండిక శక్తికి, పరమేశ్వరునికి మధ్య భేదమే లేదని సాక్షాత్ శ్రీ శంకర భగవత్పాదులు (ఆది శంకరాచార్య) వారే వ్యాఖ్యానించారు.

ఉగ్రరూపానికే తొలి వందనం!

ప్రచండ రూపంలో ఉన్న చండికను ప్రసన్నం చేసుకోవడానికి ముందు ఆమె ఉగ్ర రూపానికే వందనాలు సమర్పించాలని వేద పండితులు చెప్తారు. 'నమస్తే రుద్రమన్యవే..' అంటూ వేడుకోవాలి. 'శ్రీ సప్తశతీ స్తోత్రం' వల్లే ఆమె అనుగ్రహం లభిస్తుందని, సకల అభీష్టాలూ సిద్ధిస్తాయని 'మార్కండేయ పురాణమూ' పేర్కొన్నది. వేదమంత గొప్పది, అనాదిది, అద్భుత శక్తివంతమైంది సప్తశతి. కనుకనే, చండికకు, చండీ హోమానికి అంతటి ప్రాధాన్యం. యావత్ కలియుగానికే ఈ చండీ ఉపాసన అత్యంత శ్రేష్ఠమని, శక్తిదాయకమనీ వారు అంటారు. 'వారాహి తంత్రం' మేరకు భగవద్గీత, విష్ణు సహస్ర నామస్తోత్రాలతో సమానంగా చండీ సప్తశతి, చండీ సహస్రనామ స్తోత్రం ఉన్నాయని, ఈ నాలుగూ అత్యంత ప్రసిద్ధమని పోతుకూచి శ్రీరామమూర్తి విరచిత గ్రంథం 'శ్రీ చండీ సప్తశతీ మీమాంస' (సాధన గ్రంథ మండలి, తెనాలి) పేర్కొంది.



మరింత ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, బ్రహ్మరూపమే బ్రహ్మధర్మిణిగా, పరమేశ్వరుని రూపమే పరమేశ్వరీగా కూడా ఆమెనే సాక్షాత్కరిస్తుంది. సకల జగన్మాతగా ఆమె అనుగ్రహాన్ని పొందడానికే పలు శాస్త్రాలు తనను వివిధ రూపాలుగా అభివర్ణించాయి. చండీ దేవినే పుంరూపాన్ని, బ్రహ్మరూపాన్నీ పొందినట్లు, గాయత్రి, త్రిపురాసుందరి.. ఇలా అనేక పేర్లతో, రూపాలతో ఆమె కొలువబడుతున్నట్లు శ్రుతులు, స్మృతులు, పురాణాలు పేర్కొంటున్నాయి.

అన్ని అవతారాలకు మూలమైన మహాలక్ష్మీ స్వరూపం, మహాకాళీ రూపంతోపాటు చంద్రకాంతితో దగద్ధాయమానంగా వెలుగొందే మహాసరస్వతీ స్వరూపాన్ని కూడా త్రిగుణాల (సత్వ, రజో, తమో)ను అనుసరించి చండికయే పొందినట్లు 'శ్రీ సప్తశతి' వెల్లడించింది. ఈ శక్తులన్నీ భర్తృరహితాలని, స్వాతంత్ర్యాలని, విషయ వాసనలు లేనివని కూడా ఆ స్తుతి మంత్రాలు పేర్కొన్నాయి. ఈ ముగ్గురు తల్లులూ మాయాశక్తి సామర్థ్యంతో పురుషభావాన్ని కూడా పొందినట్లు చెప్తారు. కాబట్టే, ఈ పరాశక్తిని మాయ, నిద్ర, తామసి అని కూడా వ్యవహరిస్తున్నారు. ఇదే ప్రళయానంతరం కూడా కారణబీజంగా మారుతున్నట్లు పండితులు పేర్కొన్నారు. ఈ మాయాబీజంలోని బీజాక్షరమన్నా చండికయే అని, 'ఆత్మన ఆకాశ: సంభూత:' అంటూ శ్రుతివాక్యాలలో చెప్పినట్టు సూక్ష్మ, స్థూల దేహాలు ఉత్పన్నమవుతాయని 'సప్తశతి' తెలిపింది. ఈ రకంగానే బ్రహ్మదేవునికి మూలమంత్రంగా ప్రణవం ఆవిర్భవించిందని వారు అంటారు.

- దోర్బల బాలశేఖరశర్మ

జీవన వేదం



మేఘాలలో ఉత్పన్నమయ్యే సోమరస జలం మానవులకు అత్యంత శక్తిదాయకమైంది. త్యాగనిరతితో కూడిన ఆ రసాన్ని ఆస్వాదించండి. వేగంగా వీచే గాలి సోమరసాన్ని శుద్ధపరిచి అందిస్తుంది. 'సోమ' ఆత్మకు మిత్రునిగా శరీరంలోని ఇతర భాగాలతో తేలిగ్గా కలిసిపోతుంది. అలాగే, ఉషోదయం సూర్యుని బిడ్డవలె సోమరసాన్ని శుద్ధి పరుస్తుంది. సూర్యుడు తన ఉజ్వలమైన కాంతి కిరణాలతో శాశ్వత స్థితిని కలిగిస్తున్నాడు. పుష్కలమైన ఓషధీ గుణాలు కలిగిన సోమరసం ఈ రకంగా మానవులకు విద్యను, బుద్ధిని, బలాన్ని వృద్ధి పరుస్తుంది. అనారోగ్యాన్ని దూరం చేసి ఆత్మికవిద్యను చేరువ చేస్తుంది.

- యజుర్వేదం

ఎందుకంటే?



'మనుషులు ధర్మబద్ధంగా ఎందుకు జీవించాలి? అలా చేస్తే ఏమొస్తుంది?' అనే సామాన్యుల ప్రశ్నలకు హైందవ పండితులు ఇచ్చే సమాధానం 'మోక్షప్రాప్తి'. ధర్మమార్గంలో నడిస్తే తత్వజ్ఞానం లభిస్తుందంటారు. ఇది మనల్ని ముక్తి వైపు నడిపిస్తుంది. అందరికీ వర్తించే ధర్మాలు ఏవంటే ప్రకృతి పట్ల శ్రద్ధ, జీవులపట్ల అహింస, వ్యక్తిగతంగా అరిషడ్వర్గాలను జయించడం, దైవభక్తిని కలిగి ఉండడం వంటివి. మానవులు తాము చేసే కర్మలలో అప్రయత్నంగా జరిగేవి కొన్ని అయితే, బుద్ధిపూర్వకంగా చేసేవి మరి కొన్ని. ధర్మాధర్మాలు ఏవైనా బుద్ధిపూర్వక కర్మలకే వర్తిస్తాయని వారు అంటున్నారు. కాబట్టి, ఎవరైనా తెలిసి, ఇష్టపూర్వకంగా అధర్మమార్గంలో ప్రయాణించకూడదన్నది పెద్దల మాట.

రచనలకు ఆహ్వానం!

వివిధ ఆధ్యాత్మిక విశేషాలు, సముచిత శాస్త్రోక్త విశ్లేషణలను మీరూ ఈ పేజీకి రాసి పంపవచ్చు. ప్రామాణికమైన, ప్రజోపయోగమైన అంశాలకే ప్రాధాన్యం.
మా చిరునామా: ఎడిటర్, చింతన, నమస్తే తెలంగాణ, తెలుగు దినపత్రిక, బంజారాహిల్స్, రోడ్ నంబర్: 10, హైదరాబాద్-34.

అర్థం- పరమార్థం



అభ్రాతృ ఘ్నీం వరుణా
పతి ఘ్నీం బృహస్పతే
ఇంద్రాపుత్ర ఘ్నీం
లక్ష్మింతామస్మై
సవితు స్సువ:

వధూవరులిద్దరికీ జీలకర్ర, బెల్లాన్ని ధరింపజేసిన తర్వాత ఆ ఇద్దరి నడుమ ఉన్న తెరను తొలగిస్తారు. అప్పుడది ఒకరి నొకరు చూసుకునే సమయం. ఈ సందర్భంగా పై మంత్రాన్ని పురోహితుడు పఠిస్తాడు. 'వరుణదేవుడు, సూర్యుడు, బృహస్పతి, ఇంద్రుడు ఈ నూతన దంపతులను సత్సంతానవంతులుగా దీవింతురుగాక. వధువును ఆరోగ్యవంతురాలిగా చూడవలసింది' అని వారికి ఆశీస్సులు అందించడమే ఇందులోని పరమార్థం.

సుడోకు

డైలీ సుడోకు 39 సమాధానం

4	7	1	5	8	3	6	9	2
2	5	3	4	6	9	1	7	8
6	8	9	7	1	2	3	4	5
5	4	2	3	9	8	7	1	6
3	1	7	6	2	4	8	5	9
8	9	6	1	5	7	4	2	3
9	6	5	8	4	1	2	3	7
7	2	4	9	3	6	5	8	1
1	3	8	2	7	5	9	6	4

డైలీ సుడోకు -40

	4					3	6	
	9				7	4	2	
		6						8
			5			2		
			7		2		1	
		8				5		
				1	9		3	
	7	4					9	1
		1	8			6		

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్

రకుల్ ప్రీత్
@Rakulpreet



మహిళల గురించి, వారి నైతిక హక్కుల గురించి మాట్లాడే వాళ్లు.. ముందు వాళ్లను వాళ్లు ప్రశ్నించుకోవాలి. వాళ్ల ఆలోచన తీరును మార్చుకోవాలి. అలా ప్రవర్తించేవాళ్ల తల్లిని నేనయితే, వాళ్ల స్థానంలో నేనుంటే చెంప చెల్లుమనిపిస్తాను.

రకుల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
3,040,575

కామన్‌మ్యాన్ వాయిస్

ఏదైనా అలవాటు వ్యసనంగా మారకుండా చూసుకోవాలి. మోతాదు మించితే ప్రతిదీ ప్రమాదమే. హానికరం కానంత వరకు ఏదైనా ఆనందంలో భాగమే.
-Kumar Balasubramaniam

జగన్ ఫెడరల్ ఫ్రంట్‌లో చేరడాన్ని రెండు తెలుగు రాష్ట్రాల హక్కులు కలిసి ఢిల్లీలో సాధించుకోవడానికి అని అన్నారు ఇద్దరు నేతలు. ఆ చేరడమే మీరన్నట్టు తప్పయితే.. బాబు, కాంగ్రెస్ కలిసిపోయి పొత్తు పెట్టుకొని తెలంగాణలో పోటీ చేయడాన్ని ఏమనాలి?
-Kulakarni Dharanidhar

మా వాడు ఏ గుడిసెలో దూరినా అది చారిత్రక అవసరం. ఇతరులు ఎవరైనా ఎవ్వరిని కలిసినా అది ద్రోహం, అన్యాయం. ఇది పచ్చమీడియా ప్రచారం.
-తిరుమలేశ్ గౌడ్


వైరల్ వీడియో



నా జీవితమింతే, నేనేం చేయలేనేమో, నా వల్ల ఏం జరుగదేమో, నేను దురదృష్టవంతురాలిని. ఇలా చాలామంది అనుకుంటారు. ఈ వీడియో చూస్తే మనిషిలోని నెగెటివ్ కోణాలు కనిపిస్తాయి. మహాతల్లి చేసిన ఈ వీడియో యూట్యూబ్ ట్రెండింగ్ వీడియో అయింది.

Naa Life Inthe - The Pessimist || Mahathalli
Total views : 320,084+
Published on Jan 16, 2019

నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 18 జనవరి 2019



ప్రకృతిని వీక్షిస్తూ.. అనుభూతిని ఆస్వాదిస్తూ

రైలు ప్రయాణమంటే తొందరగా, సురక్షితంగా గమ్యానికి చేర్చే మార్గం ఒక్కటే కాదు. దూర ప్రయాణాలను దగ్గరే చేసే మార్గం అంతకన్నా కాదు. ప్రయాణం చేస్తూ ప్రకృతిని వీక్షిస్తూ అనుభూతిని ఆస్వాదిస్తూ ఈ రైలు మార్గాల గురించి చదివేయండి. క్షణాలు నిమిషాలుగా, నిమిషాలు గంటలుగా, గంటలు రోజులుగా, రోజులు నెలలుగా క్యాలెండర్లు మారుతున్నాయి. కన్నుమూసి తెరిచేలోపు గడిచిపోవాల్సినవి గడిచిపోయి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. మనం గడిపిన క్షణాలు గొప్పగా ఉండాలంటే ప్రయాణాలు చేయాలి. గొప్ప ప్రయాణాలు గొప్ప జ్ఞాపకాలను ఇస్తాయి. ప్రయాణాలను, ప్రకృతిని ఇష్టపడే వాళ్లు జీవితంలో ఒక్కసారైనా ఇలాంటి రైలు ప్రయాణం చేయాలి. ప్రపంచంలో ఉన్న అత్యద్భుతమైన రైలు ప్రయాణాలివి..

గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్

జెర్మాట్, సెయింట్ మోరిట్జ్ ప్రాంతాలను కలుపుతూ స్విట్జర్లాండ్‌లో నిర్మించిన అత్యంత అందమైన రైలు వంతెన మార్గమిది. దీనికి గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్ వే అని పేరు పెట్టారు. ఈ దృశ్యాన్ని చూడడం కంటే వెళ్లి అక్కడ ప్రయాణిస్తే బాగుంటుంది. ఈ దారి గుండా ప్రయాణిస్తే 91 సొరంగాలుంటాయి. 291 వంతెనలుంటాయి. గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ఈ వంతెన సముద్ర మట్టానికి 6706 ఫీట్ల ఎత్తు ఉంటుంది. ఆరు పిల్లర్లు కలిగిన ఈ వంతెన చూడగానే ఆకర్షిస్తుంది.



ట్రాన్స్-సైబీరియన్

ప్రపంచంలోనే అతి పొడవైన రైలు మార్గాల్లో ఇది ఒకటి. రష్యా రాజధాని మాస్కో పశ్చిమాన ఉనన టెర్మినస్ వద్ద ప్రారంభమై, ట్రాన్స్ - సైబీరియరన్ ఉరల్ పర్వతాలపై నుంచి సైబీరియన్ అడవులను దాటుతూ వెళ్లాల్సి ప్రయాణమిది. ఇది రష్యా మొత్తం విస్తరించి ఉంటుంది. ప్రారంభమైన చోటు నుంచి గమ్యానికి చేరడానికి ఎనిమిది రోజులు పడుతుంది. ప్రపంచంలో అతిపెద్ద మంచి నీటి సరస్సు అయిన బైకాల్ మీది నుంచి ఈ కూడా ప్రయాణం సాగుతుంది.



ది హాన్

ప్రపంచంలో ఎక్కడా చూడని ప్రకృతి అందాలు ఈ ప్రయాణంలో చూడొచ్చు. ఆస్ట్రేలియాలోని ది హాన్ ట్రావెల్స్ నుంచి డార్విన్, ఆడిలైడ్ వరకు ప్రయాణించవచ్చు. ఇది సుమారు రెండు వేల కిలోమీటర్ల దూరం ఉంటుంది. సారవంతమైన ఎర్రనేలల మీద కనుచూపు మేర ఉండే మైదానాలలో నుంచి ఈ ప్రయాణం సాగుతుంది.



ఫస్ట్ ప్యాసేజ్

పర్వాతారోహకులు ఎక్కువగా వెళ్లే మార్గమిది. ఫస్ట్ ప్యాసేజ్ ఆఫ్ వెస్ట్ అని ఈ మార్గాన్ని పిలుస్తారు. ఎత్తైన పర్వతాలు, చుట్టూ పొగమంచు, కనుచూపు మేర కనిపించే అందమైన ప్రకృతి అందాల నెలవిది. సౌత్ బ్రిటిష్ కొలంబియా వాంకోవర్ మధ్య ఉన్న ఈ రైలు మార్గం అత్యంత సుందరమైన రైలు మార్గాలలో ఒకటి. నగరాలు, గ్రామాలతో సంబంధం లేకుండా దట్టమైన అడవుల మధ్య నుంచి రైలు వెళ్తుంది. మధ్యలో కనిపించే సరస్సులు, చీకట్లో తారసపడే నగరాలు ఊహకు అందని అనుభవాన్నిస్తాయి.



ట్రాన్స్ ఆల్పైన్

న్యూజీలాండ్‌లని సౌత్ ఐలాండ్స్, క్రైస్టర్చ్ నుంచి ట్రాన్స్ ఆల్పైన్‌ల వరకు వెళ్లే రైలు ప్రయాణం అరణ్యాల మీదుగా వెళ్తుంది. ఉష్ణమండలాలు, వర్షారణ్యాలనుకూడా చూడొచ్చు. స్కాట్లాండ్‌లోని అతిపెద్ద నగరమైన గ్లాస్గో పట్టణంలో ఉన్న రైలు మార్గం ప్రయాణీకులను ఆకట్టుకుంటుంది. మరిచిపోలేని మధురానుభూతుల్ని మిగుల్చుతుంది. హ్యారీపోర్టర్, పలు వెబ్‌సిరీస్‌లలో ఈ లొకేషన్లను ఎక్కువ చూపించారు. ఇక సౌతాఫ్రికాలోని నమీబియా సఫారీ రైలు ప్రయాణం గురించి వర్ణించలేము. రెండు వేల కిలోమీటర్లు దట్టమైన అడవుల్లో , చుట్టుపక్కల జట్టువులు, నీటి కొలనులతో దర్శనమిస్తుంది. నదులు, జలపాతాలను దాటుకుంటూ వెళ్లే ఈ ప్రయాణం బాగుంటుంది. ఇలాంటివి మొత్తం ప్రపంచవ్యాప్తంగా పదకొండు ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా ఇలాంటి ప్రయాణాలు చేసి ఆ అనుభూతిని పొందాలి.

నూతన అధ్యయనం

అత్యంత కాలుష్య దేశమేదంటే..?

ప్రపంచవ్యాప్తంగా సంభవించే మరణాల్లో ఐదుశాతం వాయు కాలుష్యం వల్లేనని, మంచి ఆహారం, జీవనశైలి ఉన్నా పీల్చే గాలిలో ఉన్న కార్బన్‌మోనాక్సైడ్ వల్ల అనారోగ్యం పాలవుతున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్‌వో) 92 దేశాల్లోని 1622 పట్టణాల్లో గాలి నాణ్యతను పరీక్షించింది. ముఖ్యంగా గాలిలోని కణాలు, పొగ, మసి వంటివి పీల్చుకోవడం వల్లే



ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. పాకిస్థాన్‌లో నలుసు పదార్థాల సాంద్రత అతి ఎక్కువ ఉన్నది. ఆ తర్వాత ఖతర్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, దుబాయి, మంగోలియా, ఇండియా, బెహరెన్, నేపాల్ ఇలా వరుస స్థానాల్లో ఉన్నాయి. ఇండియా ఇందులో ఎనిమిదో స్థానంలో నిలిచింది. గాలి నాణ్యత విషయంలో చైనా చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. అందుకే టాప్ పది దేశాల్లో కూడా దాని పేరు లేదు. ఇదిలా ఉంటే.. మంచి నాణ్యతగల గాలి ఉన్న దేశాలుగా ఆస్ట్రేలియా, బ్రునై, న్యూజీలాండ్, ఇస్టోనియా, ఫిన్‌లాండ్‌లు నిలిచాయి. ఈ దేశాలకు వెళ్లాలనుకునే వాళ్లు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

ప్రయాణం - ఆరోగ్యం

ఇవి తోడుంటే సరి..

టూరుకెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉంటాయి. వాటిని పాటిస్తే మన ప్రయాణం సురక్షితంగా, ప్రశాతంగా, సజావుగా సాగుతుంది. ఈ ట్రావెట్ టిప్స్ ఫాలో అవండి. సుఖంగా ప్రయాణించండి.



- విదేశాలకు వెళ్తే అక్కడి వాతావరణం ఎలా ఉంది? అంటువ్యాధులు ప్రబలుతున్నాయా? ఆహారం ఎలాంటిది దొరుకుతుంది ఇంటి అంశాలను ట్రావెల్ ఏజెన్సీలను కానీ అఫీషియల్ సైట్స్‌లో కానీ చదివి తెలుసుకోవాలి.
- ప్రయాణాలు చేస్తున్నప్పుడు అలిసిపోతాం. ఒంట్లో శక్తి ఉండదు. రోగ నిరోధక శక్తి కూడా తగ్గుతుంటుంది. వేగంగా ఒంట్లో సత్తువ పెంచే ఆహార పదార్థాలను వెంటపెట్టుకోవాలి. ముఖ్యంగా ఎండు ద్రాక్షలు, చెర్రీలు, డ్రై ఫ్రూట్స్ వంటివి బ్యాగ్‌లో ఉంచితే సరిపోతుంది.
- శరీరానికి మామూలుగానే నిద్ర అవసరం. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు సాధారణంగానే నిద్రపట్టదు. గదిలో లైట్స్ ఆఫ్ చేసి, కళ్లకు గంతలు కట్టుకొని అయినా శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వాలి. లేకపోతే అనారోగ్యం బారిన పడుతారు.
- ప్రథమ చికిత్స చేసుకోవడానికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వెంటపెట్టుకొని వెళ్లండి. బ్యాండేజ్, బర్నల్, సన్‌బర్న్‌క్రీమ్, జండూబామ్, వోలిన్, సానిటైజర్ వంటి వస్తువులను ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో ఉండేలా చూసుకోండి.
- మీరు వెళ్లిన చోట దోమలు కుట్టి డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి జ్వరాలు రావొచ్చు. ఫేస్‌మాస్కులు, జాకెట్స్, గ్లౌజులు వెంట పెట్టుకోండి. ఆల్ అవుట్ కానీ, మస్కిటో కాయిల్ కానీ వెంటపెట్టుకోండి. నెత్తికి టోపి పెట్టడం మరిచిపోకండి.

వింత ప్రదేశం

వెలుగులోనే ఉంటాయి!

చీకటి ఉంటే గానీ తెలియదు పగలు విలువ. మరి ఎప్పటికీ పగలే ఉంటే ఎలా ఉంటుంది? సూర్యుడు మొదట ఉదయించే దేశాల గురించి మీరు చదివే ఉంటారు. మరి సూర్యుడు అస్తమించని దేశాల గురించి విన్నారా? అలాంటి ప్రదేశాలున్నాయని మీకు తెలుసా?


ఇరవై నాలుగు గంటలు సూర్యుడు ఉదయించి ఉంటే అత్యద్భుతమే అవుతుంది కదా! ఇక్కడ సూర్యాస్తమయం అనే ముచ్చట అసలు ఉండదు. ఎప్పుడూ పగలు మాత్రమే ఉండే ఆ ప్రదేశాలను ల్యాండ్స్ ఆఫ్ మిడ్ నైట్ సన్ అంటారు. ముఖ్యంగా జపాన్‌లో ఏప్రిల్ ఆఖరివారం నుంచి ఆగస్టు వరకు సూర్యుడు రాత్రి, పగలు అన్న బేధం లేకుండా అన్ని వేళలా దర్శనమిస్తాడు. అందుకే అక్కడి ప్రజలు ఎప్పుడూ వెలుగులోనే ఉంటారు. యూరోపియన్ ఖండంలోని ఒక దేశమైన నార్వేలో సుమారు 76 రోజుల పాటు సూర్యుడు అస్తమించడు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశమైన కెనడాలో నార్త్ వెస్ట్ ప్రదేశంలో 56రోజులు సూర్యుడు కనిపిస్తూనే ఉంటాడు. ఐస్‌ల్యాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా చీకటి అనేది ఉండదు. ఆ సమయంలో పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఆ అరవై రోజులూ ఆయా దేశాల్లో ఉత్సవాలు ఘనంగా జరుపుతారు.



యాప్‌రే

సాఫీగా ఉంచే హాలీడే ఐక్యూ

విహార యాత్రలకు వెళ్లాలనుందా? ఏ చోటకు వెళ్లాలి? ఎలాంటి ప్రదేశాలు చూడాలి? అన్న సందేహంలో ఉన్నారా? అయితే మీలాంటి వాళ్ల కోసమే ఈ యాప్. మీకు నచ్చిన ప్రదేశాలు అక్కడ అందుబాటులో ఉండే వసతుల గురించి ఈ యాప్‌లో ఉంటాయి. ఎక్కడికో వెళ్లి వెతకాల్సిన అవసరం ఉండదు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుంటే మరింత ఈజీ అవుతుంది. ఇందులో మీరున్న చోటు నుంచి మీరు వెళ్లాల్సిన ప్రదేశాలు ఎంతదూరం ఉన్నాయి? మీరు వెళ్తున్న ప్రదేశం చుట్టుపక్కన చూడాల్సిన ప్రదేశాలు ఏమైనా ఉన్నాయా? వంటి సమాచారాన్ని తెలియజేస్తుంది. యాత్రా ప్రదేశాలలో దొరికే ఆహారం, అందుబాటులో ఉండే హోటళ్లు అవి అందించే సర్వీస్‌లు వంటి విశేషాలను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

నిట్ వరంగల్‌లో ఎంబీఏ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఎంబీఏ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- కోర్సు పేరు: ఎంబీఏ
- అర్హత: ఇంజనీరింగ్ (బీఈ/ బీటెక్) అభ్యర్థులకు మాత్రమే.
- ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- వెబ్‌సైట్ : www.nitw.ac.in

టీఎంబీలో ఆఫీసర్లు

తమిళ నాడు మర్కంటైల్ బ్యాంక్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- జీఎం/డీజీఎం (ఐటీ)-చెన్నై
- జీఎం/డీజీఎం/ఏజీఎం (క్రెడిట్)-తూత్తుకూడి
- డీజీఎం (ఇన్‌స్పెక్షన్/క్యామ్)-తూత్తుకూడి
- అర్హత: సంస్థ నిబంధనల ప్రకారం
- ఎంపిక: ఇంటర్వ్యూ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: జనవరి 28
- వెబ్‌సైట్: www.tmbnet.in

సీఐఎస్ఎఫ్‌లో 429 ఖాళీలు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న హెడ్‌కానిస్టేబుల్ (మినిస్టీరియల్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- పోస్టు పేరు: హెడ్‌కానిస్టేబుల్ (మినిస్టీరియల్)
- పనిచేసే ప్రదేశం: దేశంలో ఎక్కడైనా
- మొత్తం ఖాళీలు-429 (జనరల్-222, ఓబీసీ-114, ఎస్సీ-63, ఎస్టీ-30)
- వీటిలో పురుషులు-328, మహిళలు-37, ఎల్‌డీసీఈ-64 కేటాయించారు.
- అర్హతలు: గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఇంటర్/సీనియర్ సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ (10+2) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- వయస్సు: 2019 ఫిబ్రవరి 20 నాటికి 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థుల వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- పేస్కేల్: లెవల్ 4 ప్రకారం రూ. 25,500-81,100/- ఇతర డీఏ, రేషన్ అలవెన్స్‌లు, స్పెషల్ అలవెన్స్, హెచ్‌ఆర్ఏ తదితరాలు ఉంటాయి.
- శారీరక ప్రమాణాలు: ఎత్తు: పురుషులు 167 సెం.మీ., మహిళలు 155 సెం.మీ ఉండాలి.
- ఛాతీ: పురుషులు-77 సెం.మీ., గాలి పీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. వ్యాకోచించాలి
- బరువు: వైద్య ప్రమాణాల ప్రకారం ఎత్తు, వయస్సుకు దామాషాగా ఉండాలి.
- ఎంపిక: రాతపరీక్ష, పీఎస్‌టీ, స్కిల్ టెస్ట్ ద్వారా
- రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులకు ఉంటుంది. దీనిలో జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ నాలెడ్జ్, అర్థమెటిక్, జనరల్ ఇంగ్లిష్/హిందీ అంశాల నుంచి ప్రశ్నలను ఇస్తారు. 2 గంటల్లో పరీక్ష పూర్తిచేయాల్సి ఉంటుంది.
- రాతపరీక్ష ఇంగ్లిష్/హిందీ భాషల్లోనే నిర్వహి స్తారు,
- **పరీక్షలో అర్హత మార్కులు**- జనరల్ అభ్యర్థులు 35 శాతం, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ అభ్యర్థులు 33 శాతం మార్కులను తప్పనిసరిగా సాధించాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో. ఆన్‌లైన్ హార్డ్‌కాపీలను సంబంధిత రీజినల్ ప్రాంతీయ కార్యాలయానికి పంపాలి.

చిరునామా: DIG, CISF (South Zone),
Rajaji Bhavan, D Block,
Besant Nagar,
Chennai -600090

- దరఖాస్తులకు చివరితేదీ: ఫిబ్రవరి 20
- వెబ్‌సైట్: https://cisfrectt.in

ఐఐటీ మద్రాస్‌లో

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ (ఐఐటీ) సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రాం-2019కి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రాం-2019
- అర్హత: బీఈ/బీటెక్, బీఎస్సీ (ఇంజినీరింగ్) లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్‌లో మూడో ఏడాది చదువుతున్నవారు లేదా ఎమ్మెస్సీ/ఎంఏ, ఎంబీఏ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థులు అర్హులు.
- స్టయిఫండ్: రూ. 6000/-
- వెబ్‌సైట్: https://sfp.iitm.ac.in

బొకారో స్టీల్ ప్లాంట్‌లో

జార్ఖండ్‌లోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) పరిధిలోని బొకారో స్టీల్ ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- పోస్టు పేరు: జూనియర్ మేనేజర్
- మొత్తం పోస్టులు: 11 (సేఫ్టీ-9, ఆర్కిటెక్చర్ అండ్ సిటీ ప్లానింగ్-2)
- అర్హత: సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచీలో బీఈ/బీటెక్ లేదా మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత
- వయస్సు: 2019 ఫిబ్రవరి 6 నాటికి 30 ఏండ్లకు మించరాదు.
- పే స్కేల్: రూ. 24,900/-50,500/-
- శారీరక ప్రమాణాలు: పురుషులు-150 సెంటీమీటర్లు ఎత్తు, 45 కేజీల బరువు.
- మహిళా అభ్యర్థులు 143 సెంటీమీటర్లు ఎత్తు, 35 కేజీల బరువు ఉండాలి.
- అప్లికేషన్ ఫీజు: రూ.500/- , ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- ఎంపిక: ఇంటర్వ్యూ, స్కిల్/ట్రేడ్ టెస్ట్ ద్వారా.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తులకు చివరితేదీ: ఫిబ్రవరి 6
- వెబ్‌సైట్: www.sail.co.in

ఎన్‌సీఈఆర్‌టీలో

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.



- మొత్తం పోస్టులు: 12
- అసిస్టెంట్ ఎడిటర్-5 ఖాళీలు (ఇంగ్లిష్-3, హిందీ-2)
- పే స్కేల్: రూ. 52,000/-
- ఎడిటోరియల్ అసిస్టెంట్-5 ఖాళీలు (ఇంగ్లిష్-2, హిందీ-2, ఉర్దూ-1)
- పేస్కేల్: రూ. 33,000/-
- ప్రూఫ్ రీడర్-2 ఖాళీలు (ఇంగ్లిష్-1, హిందీ-1)
- పేస్కేల్: రూ. 24,000/-
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఆర్ట్స్, సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూతేదీ: ఫిబ్రవరి 5,6,7
- వెబ్‌సైట్: www.ncert.nic.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
శుక్రవారం 18 జనవరి 2019

షరతులు వర్తిస్తాయి!

ఎంతటి మగవారైనా పెళ్లయిన తర్వాత భార్యా విధేయులుగా మారాల్సిందే. ఇల్లాలి షరతుల్ని ఖచ్చితంగా పాటించి తీరాల్సిందే. ఇందుకు సెలబ్రిటీలు కూడా మినహాయింపు కాదు. ఇటీవలే వివాహబంధంతో ఒక్కటైన బాలీవుడ్ జంట రణవీర్‌సింగ్, దీపికాపదుకునే విషయంలో కూడా ఇదే విషయం రుజువవుతున్నదని అంటున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సతీమణి దీపికా పదుకునే గురించి రణవీర్‌సింగ్ చెప్పిన విషయాలు బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి. పెళ్లయిన తర్వాత దీపిక తనకు ఎన్నో షరతులు విధిస్తున్నదని, గతంలో మాదిరిగా జీవితాన్ని ఎంజాయ్ చేసే వెసులుబాటు లేకుండా పోయిందని రణవీర్ సరదాగా వ్యాఖ్యానించారు. ‘ ఏ అర్ధరాత్రో ఇంటికి వస్తానంటే కుదరదు. పదింటిలోపే ఠంచనుగా ఇల్లు చేరాలి. రాత్రి భోజనం ఇంట్లోనే చేయాలి. ఎల్లప్పుడు ఫోన్‌లో అందుబాటులో ఉండాలి’.. ఇవీ దీపిక పెట్టిన షరతులని రణవీర్‌సింగ్ తెలిపారు. ఈ షరతులు కొంచెం ఇబ్బంది పెట్టినా వైవాహిక జీవితం సాఫీగా సాగడానికి అవసరమని రణవీర్ పేర్కొన్నారు.



దీపికాపదుకునే



గీతాంజలి, రమేష్‌ప్రసాద్, వై.వి.యస్.చౌదరి, సురేష్

సినిమానే ఆయన జీవితం!

‘సర్వశక్తుల్ని ఒడ్డి సినిమా కోసం శ్రమించిన వ్యక్తి ఎల్.వి.ప్రసాద్. సినిమానే ఆయన జీవితం. సినిమా లేకపోతే ఆయన లేరు. నాన్నతో నేను గడిపింది చాలా తక్కువ సమయమే. ఆయన ఎక్కువ విశ్రాంతి తీసుకునే వారు కాదు. షెడ్యూల్‌కి, షెడ్యూల్‌కి సమయం చిక్కితే ఆ సమయాన్ని కూడా మరో చిత్రానికి కేటాయించేవారు’ అన్నారు రమేష్ ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ 111వ జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సురేష్ కొవ్వూరి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ ‘నేను ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత నాన్న ఔన్నత్యం ఏంటో తెలిసింది. మా కుటుంబసభ్యులంతా సినిమాల్లో వుండాలనేది ఆయన కోరిక. నన్ను నటుడిగా ప్రయత్నించమన్నారు’ అని తెలిపారు. వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ ‘ఎల్వీ ప్రసాద్ జీవిత కథని సినిమాగా తీస్తే బాగుంటుంది. ఆ విషయంలో రమేష్ ప్రసాద్ చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నాను’ అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో నందమూరి బాలకృష్ణ, ఎల్వీ ప్రసాద్ మనవరాలు, రమేష్ ప్రసాద్ కుమార్తె రాధా ప్రసాద్, సీనియర్ నటి గీతాంజలి, సురేష్ కొవ్వూరి తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న బ్రహ్మానందం



బ్రహ్మానందం

ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందంకు గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స జరగడంతో ఆయన ఆరోగ్యంపై ఇండస్ట్రీ వర్గాలతో పాటు అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన క్షేమంగా ఉన్నారని బ్రహ్మానందం కుమారుడు రాజా గౌతమ్ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ‘గత కొన్ని నెలలుగా ఛాతిలో అసౌకర్యంగా ఉండటంతో డాక్టర్ల సలహా మేరకు నాన్న ఆపరేషన్ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ముంబయిలోని ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో హృద్రోగనిపుణులు రమాకాంత్ పాండా ఆధ్వర్యంలో సోమవారం నాన్నకు శస్త్రచికిత్స పూర్తయింది. అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సుల వల్ల నాన్న ఆరోగ్యం మెరుగుపడుతున్నది. ప్రస్తుతం ఐసీయు నుంచి ఆయన్ని సాధారణ గదికి మార్చాం’ అని రాజా గౌతమ్ పేర్కొన్నారు.

ఉస్మానియా యోధుడి గాథ



‘జార్జిరెడ్డి’ ప్రీలుక్ దృశ్యం

ధైర్యానికి, సాహసానికి మారుపేరుగా చరిత్రలో నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి జీవితం వెండితెరపై ఆవిష్కృతం కానుంది. జీవన్‌రెడ్డి (‘దళం’ ఫేమ్) ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మైక్ టీవీ, త్రీ లైన్స్ సినిమా పతాకాలపై అప్పిరెడ్డి, దాము రెడ్డి కొసనం నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర ప్రీలుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదలచేసింది. 1970 కాలం నాటి వస్త్రధారణలో చేతిలో పుస్తకాలతో నడిచి వెళ్తున్న జార్జిరెడ్డి లుక్ ఆకట్టుకుంటున్నది. నిర్మాతలు మాట్లాడుతూ ‘సమసమాజ స్థాపనే ధ్యేయంగా పోరాటాన్ని సాగించారు జార్జిరెడ్డి. విద్యార్థి ఉద్యమాల్లో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. చిన్న వయసులోనే ప్రత్యర్థుల చేతిలో ఉస్మానియా యూనివర్సిటీలో హత్యకు గురయ్యారు. జార్జిరెడ్డి మరణించినా ఆయన ఆశయం మాత్రం బతికి ఉంటుందనే కథాంశంతో స్ఫూర్తిదాయకంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. చరిత్ర మరచిన పోరాట యోధుడి గాథ ఇది. 1970 బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. చిత్రీకరణ పూర్తయింది. వేసవిలో సినిమాను విడుదలచేస్తాం. త్వరలో ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో పాటు నటీనటుల వివరాల్ని వెల్లడిస్తాం’ అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సుధాకర్‌రెడ్డి యెక్కంటి, సంగీతం: సురేష్ బొబ్బిలి, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్.